www.vishvambhara.com
తెలుగు దినపత్రిక
# విశ్వంభర
అక్షరం సాక్షిగా..
శనివారం
24-08-2024
సంపుటి : 01 | సంచిక : 112 | పేజీలు : 12 | వెల : 5/- తెలంగాణ / ఆంధ్రప్రదేశ్


డా॥ కాచం సత్యనారాయణ
CMD



## హస్తినలో సీఎం
# మంతనాలు.. భేటీలు

ఖర్గే, రాహుల్ గాంధీతో సీఎం రేవంత్ భేటీ

మంత్రి వర్గ విస్తరణ, పీసీసీ అధ్యక్ష పదవి పైనే చర్చ?

కృతజ్ఞత సభకు రావాలని రాహుల్‌కు ఆహ్వానం

2

ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఢిల్లీ పర్యటనలో బిజిబిజీగా ఉన్నారు. శుక్రవారం ఏఐసీసీ కార్యాలయంలో కాంగ్రెస్ అగ్రనేతలతో భేటీ అయ్యారు. పార్టీ అధ్యక్షుడు మల్లిఖార్జున ఖర్గే, రాహుల్ గాంధీతో ఆయన సమావేశమయ్యారు. రాష్ట్రంలో నూతన పీసీసీ చీఫ్, మంత్రివర్గ విస్తరణ, నామినేటెడ్ పోస్టుల భర్తీపై చర్చించారు. ఈ భేటీ అనంతరం సీఎం రేవంత్‌రెడ్డి, డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క, కేంద్ర టెలికాం, కమ్యునికేషన్లశాఖ మంత్రి జ్యోతిరాదిత్య సింధియాతో భేటీ అయ్యారు. టీ-ఫైబర్ ప్రాజెక్టును భారత్ నెట్ ఫేజ్ 3గా మార్చేందుకు సమర్పించిన డీపీఆర్‌ను ఆమోదించాలని విజ్ఞప్తి చేశారు. తర్వాత కేంద్ర క్రీడలశాఖ మంత్రి మన్‌సుఖ్ మాండవీయతో సీఎం రేవంత్ భేటీ అయ్యారు. స్పోర్ట్స్ యూనివర్సిటీకి ఆర్థికసాయం చేయాలని, ఖేలో ఇండియా పథకం నిధుల పెంచాలని విజ్ఞప్తి చేశారు.

### జాతీయ.. అంతర్జాతీయ క్రీడల నిర్వహణకు తెలంగాణకు అవకాశం ఇవ్వండి

- స్పోర్ట్స్ యూనివర్సిటీకి ఆర్థిక సహాయం అందజేయండి..
- క్రీడా సంస్థల అప్‌గ్రేడేషన్ డీపీఆర్‌లను ఆమోదించండి...
- కేంద్ర క్రీడా శాఖ మంత్రి మన్‌సుఖ్ ఎల్ మాండవీయకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వినతి

2

### నెలకు రూ.300కే ఇంటర్నెట్, కేబుల్ టీవీ, ఈ-ఎడ్యుకేషన్ సేవలు

- ఇవ్వాలని లక్ష్యంగా పెట్టుకున్నాం
- టీ-ఫైబర్ కు వడ్డీ రహిత రుణం రూ.1779 కోట్లు అందించండి
- ఎన్ఓఎఫ్ఎన్ మొదటి దశను భారత్ నెట్-3 ఆర్కిటెక్చర్‌కు మార్చే డీపీఆర్‌ను ఆమోదించండి..
- కేంద్ర టెలికం, కమ్యూనికేషన్ల శాఖ మంత్రి జ్యోతిరాదిత్య సింధియాకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వినతి

2

## ఉక్రెయిన్‌లో మోదీ
# శాంతి సందేశం

కీవ్‌లో మహాత్మాగాంధీ విగ్రహానికి నివాళులు

మహాత్ముడి బాటలో నడుద్దామని పిలుపు

జెలెన్‌స్కీతో మోదీ ద్వైపాక్షిక చర్చలు

రెండు దేశాల మధ్య నాలుగు ఒప్పందాలు



**ఉక్రెయిన్:** ఉక్రెయిన్‌లో పర్యటిస్తున్న భారత ప్రధాని నరేంద్ర మోదీ, కీవ్‌లో ఉన్న మహాత్మాగాంధీ విగ్రహానికి నివాళులు అర్పించారు. బాపూజీ ఆశయాలు విశ్వవ్యాప్తమన్న ఆయన, కోట్లాది మందికి స్ఫూర్తిదాయకమని చెప్పారు. మానవాళికి మహాత్ముడు చూపించిన బాటలో నడుద్దామని పిలుపునిచ్చారు. ఈ మేరకు సోషల్ మీడియాలో గాంధీకి నివాళులు అర్పిస్తున్న ఫొటోను ట్వీట్ చేశారు. ఉక్రెయిన్ అధ్యక్షుడు జెలెన్‌స్కీతో భారత ప్రధాని నరేంద్ర మోదీ ద్వైపాక్షిక చర్చలు జరిపారు. ఈ సందర్భంగా ఇరు దేశాల మధ్య నాలుగు ఒప్పందాలు కుదిరినట్లు అధికారులు వెల్లడించారు. వ్యవసాయం, వైద్యం, సంస్కృతి, మానవతా సాయం అంశాలపై పరస్పరం సహకరించుకోవాలని నిర్ణయం తీసుకున్నట్లు తెలిపారు. మోదీ ఉక్రెయిన్ పర్యటన ఓ మైలురాయిగా నిలుస్తుందన్న విదేశాంగ శాఖ మంత్రి జైశంకర్ చెప్పారు. ద్వైపాక్షిక సంబంధాలతో పాటు వాణిజ్యం, ఆర్థిక అంశాలు, రక్షణ, ఔషధ, వ్యవసాయం, విద్య రంగాల్లో సహకారంపై మోదీ, జెలెన్‌స్కీ చర్చించినట్లు పేర్కొన్నారు జైశంకర్. ఉక్రెయిన్‌లో యుద్ధానికి సంబంధించి కూడా ఇరు దేశాధినేతల మధ్య చర్చలు జరిగినట్లు వెల్లడించారు. శాంతిని పునరుద్ధరించేందుకు అన్ని విధాలుగా సహకరించేందుకు భారత్ సుముఖంగా

మిగతా2లో...



### 100 రోజుల్లోనే 5 గ్యారంటీలు
## అమలు చేశాం

- గత ప్రభుత్వం మాదిరిగా ప్రచారం కోసం రూ.వేల కోట్లు వృథా చేయడం లేదు
- మంత్రి పొంగులేటి

**విశ్వంభర, తెలంగాణ బ్యూరో:** తమ ప్రభుత్వం ఏర్పాటైన 100 రోజుల్లోనే 5 గ్యారంటీలు అమలు చేశామని మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి తెలిపారు. రూ.7 లక్షల కోట్లు అప్పులు ఉన్నప్పటికీ హామీలు

మిగతా2లో...



### రుణమాఫీ కానీ రైతుల కోసం
## కొత్త యాప్

- తప్పిదాలు సరిదిద్ది మేలు చేయడమే లక్ష్యం
- ఇప్పటికే 41,322 ఖాతాలు సరిచేశాం
- వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల

2

### ఇబ్బందులు తొలగించేందుకే
## కొత్త ఆర్ఓఆర్ చట్టం

- వచ్చే అసెంబ్లీ సమావేశాల్లో ప్రవేశపెట్టే అవకాశం
- మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి



05

### జైలులో నన్ను చిత్ర హింసలు పెట్టారు

కోర్టులు కూడా న్యాయం చేయలేదు

ప్రొఫెసర్ సాయిబాబా



05



## మా సహనాన్ని పరీక్షిస్తే.. చర్యకు ప్రతిచర్య తప్పదు

- కాంగ్రెస్ ప్రభుత్వాన్ని హెచ్చరించిన కేటీఆర్
- అధికారం ఎవరికీ శాశ్వతం కాదని వ్యాఖ్య
- బీఆరెస్ శ్రేణులపై దాడులపై డీజీపీకి ఫిర్యాదు

2

మరిన్ని తాజా వార్తల కోసం **స్కాన్** చేయండి

### తూర్పు హైదరాబాద్‌లో మంచి
# మార్పు తీసుకొస్తాం

**ఐటీ పార్క్, 5 స్టార్ హోటళ్లు.. కన్వెన్షన్ సెంటర్ ఏర్పాటు చేస్తాం**

ఔటర్ రింగ్ రోడ్డు వరకు మెట్రో విస్తరిస్తాం

క్రెడాయ్ ప్రాపర్టీ షోలో మంత్రి శ్రీధర్ బాబు



**విశ్వంభర ,తెలంగాణ బ్యూరో :** తూర్పు హైదరాబాద్‌లో మంచి మార్పు తీసుకొస్తామని పరిశ్రమలు ఐటీ శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు హామీ ఇచ్చారు. ఈస్ట్ హైదరాబాద్లో ఐటీ పార్క్ ఏర్పాటుపై కూడా త్వరలోనే నిర్ణయం తీసుకుంటామని ఏ కంపెనీ వచ్చినా ఇటువైపే ఏర్పాటు చేస్తామని,

మిగతా5లో...



### నేటి చికెన్ ధరలు

| ఫామ్ ధర | రిటైల్ |
| --- | --- |
| ₹ 109 | ₹ 131 |
| స్కిన్ | స్కిన్ లెస్ |
| ₹ 190 | ₹ 216 |

### మూగ జీవుల రోదన
## మీకు పట్టదా?

సంచార వాహనాల నిర్వహణ గాలికొదిలేశారు

సీఎం కు మాజీ మంత్రి హరీశ్‌రావు లేఖ



**విశ్వంభర, తెలంగాణ బ్యూరో:** మూగజీవుల మౌనరోదనను తొలగించడంలో ప్రభుత్వం విఫలమైందని మాజీ మంత్రి హరీశ్‌రావు వ్యాఖ్యానించారు. మూగజీవాల సంరక్షణపై నిర్లక్ష్యం వహించడం శోచనీయమని

మిగతా5లో...

### 25 కిలోల బంగారు నగలు ధరించి
## తిరుమల శ్రీవారి దర్శనం

ఆకర్షణగా నిలచిన ముంబయి భక్తులు



05

## కుర్చీలోనే మహిళ ప్రసవం!

నల్గొండ జిల్లా ఆస్పత్రిలో ఘటన

సిబ్బంది నిర్లక్ష్యమే కారణమని ఆరోపణ

05

# రుణమాఫీ కానీ రైతుల కోసం కొత్త యాప్

**విశ్వంభర, తెలంగాణ బ్యూరో:** రుణమాఫీ విషయంలో రైతులకు ఇబ్బందులకు గురికాకుండా గతంలో చోటు చేసుకున్న తప్పిదాలను సరిచేసి రైతులకు అన్ని విధాలుగా మేలు జరిగేలా చూసేందుకు ఒక కొత్త యాప్ ను తీసుకువచ్చినట్లు వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర రావు వెల్లడించారు. ఇందులో రుణమాఫీ అయిన,కాని రైతుల వివరాలు వివరాలు సేకరిస్తున్నట్లు చెప్పారు. రాష్ట్ర స్థాయి వ్యవసాయాధికారులు , కో-అపరేటివ్ అధికారులతో రుణమాఫీ పథకం 2024 గురించి క్షేత్రస్థాయిలో తలెత్తిన సమస్యలను పరిష్కరించే దిశగా చేపట్టిన చర్యలను గురించి శుక్రవారం మంత్రి ఆరాతీశారు.ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ వ్యవసాయాధికారులు స్వయంగా రైతుల ఇళ్ళకు వెళ్ళి కానీ, రైతువేదికలు, కార్యాలయాలలో కానీ అందుబాటులో ఉండి ఫిర్యాదులు స్వీకరిస్తున్నట్లు తెలిపారు. ఇప్పటికే 2 లక్షలలోపు కుటుంబ నిర్ధారణ జరిగిన కుటుంబాలన్నింటికీ మాఫీ చేసి నందున, 2 లక్షలలోపు కుటుంబ నిర్ధారణ లేని 4,24,873 ఖాతాదారుల సమాచారాన్ని సేకరించేందుకు వీలుగా కొత్త యాప్ ను తీసుకువచ్చినట్లు తెలిపారు. అదేవిధంగాగా ఆధార వివరాలు తప్పుగా నమోదైన 1,24,545 ఖాతాలలో ఇప్పటికే 41,322 ఖాతాలను సరిచేయడం జరిగిందని తెలిపారు. ఇప్పటికే వివిధ బ్యాంకులలో ఉన్న ఖాతాదారుల అకౌంట్ లలో ప్రభుత్వం జమ చేసిన మొత్తాలను రైతులకు అందేటట్లు చర్యలు తీసుకోవాల్సిందిగా అదేశించారు. రెన్యూవల్ అయిన ఖాతాలకు సొమ్మును తిరిగి చెల్లించే విధంగా, మాఫీ ఐన ఖాతాలకు సంబంధించి తిరిగి కొత్త రుణాలు మంజూరు వెంటనే చేసే విధంగా బ్యాంకు అధికారులు ఇప్పటికే ఆదేశాలు ఇచ్చామని, రాష్ట్ర ప్రభుత్వం ఆగస్టు 15 లోపు జమ చేసిన 18,000 కోట్ల రూపాయలకు గాను 10400 కోట్లు రైతులకు రుణాలు రూపంలో, నగదు రూపంలో బ్యాంకులు తిరిగి రైతులకు చెల్లించడం జరిగిందని వివరించారు.మిగిలి ఉన్న ఖాతాదారులకు కూడా కొత్త రుణాలు వెంటనే మంజూరు చేయాల్సిందిగా సొసైటీలకు, బ్యాంకు ప్రతినిధులకు సూచించారు. 2 లక్షలకు పైన ఉన్న ఖాతాదారులకు సంబంధించి కూడా త్వరలోనే దశల వారీగా మాఫీని వర్తింప చేస్తామని తెలిపారు. అదే విధంగా సాంకేతిక కారణాలతో మరియు కుటుంబ నిర్ధారణ జరగని రుణమాఫీ అందని రైతులు తమ దగ్గరల్లోని వ్యవసాయాధికారిని సంప్రదించాలను చెప్పారు . రైతుల ఇంటికి అధికారులు వచ్చినప్పుడు వివరాలు అందజేయవల్సిందిగా రైతులకు విజ్ఞప్తి చేశారు. అదే విధంగా వ్యవసాయాధికారులు కుటుంబ నిర్ధారణకు అవసరమైన వివరాల సేకరణ బ్యాంకర్లు తప్పుగా నమోదుచేసిన వివరాలను వెంటనే సమర్పించాలని అదేశించారు. ఈ సమావేశంలో వ్యవసాయ శాఖ డైరెక్టర్ గోపి ,సహకార శాఖ డైరెక్టర్ ఉదయ్ కుమార్ ఆయా శాఖల అధికారులు , సిబ్బంది పాల్గొన్నారు

# 100 రోజుల్లోనే 5 గ్యారంటీలు అమలు చేశాం




(మొదటి పేజీ తరువాయి)

అమలు చేశామన్నారు. గాంధీభవన్‌లో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పాటైన నాటికి రాష్ట్రం రూ.7.19 లక్షల కోట్ల అప్పుల్లో ఉందన్నారు. ధనిక రాష్ట్రమని చెప్పి కేసీఆర్ తెలంగాణ ప్రజలను మోసం చేశారని దుయ్యబట్టారు. ''మేం ఇతర ఖర్చులన్నీ తగ్గించుకొని ప్రజలకు రుణమాఫీ చేశాం. ఇప్పటికే 22 లక్షలమంది రైతులకు రూ.2 లక్షల లోపు రుణలు మాఫీ చేశాం. దేశంలో ఏ రాష్ట్రం కూడా చేయని విధంగా రుణమాఫీ చేశాం. ఇప్పటికే రైతుల ఖాతాల్లో రూ.18 వేల కోట్లు జమయ్యాయి. మిగిలిన రైతుల ఖాతాల్లో మరో రూ.12 వేల కోట్లు త్వరలోనే వేస్తాం. గత కేసీఆర్ ప్రభుత్వంలా మేం మోసం చేయట్లేదు. కేసీఆర్ ప్రభుత్వం ప్రజలను రెండుసార్లు మోసం చేసింది. రూ.లక్ష రుణమాఫీ విడతల వారీగా చేస్తామని చెప్పి ఐదేళ్లలో కూడా చేయకుండా.. ఎన్నికల ముందు కొందరికే రుణమాఫీ చేశారు. చేసిన మంచి పనిని కూడా మేం ప్రచారం చేసుకోలేదు. గత ప్రభుత్వంలా ప్రచారం కోసం రూ.వేల కోట్లు వృథా చేయడం లేదు" అని పొంగులేటి అన్నారు. ''ఉచిత విద్యుత్ కోసం రూ.42 లక్షల దరఖాస్తులు మాత్రమే సరిగా ఉన్నట్లు గుర్తించాం. తప్పులు సవరించి మరో 7 లక్షల మందికిపైగా ఉచిత విద్యుత్ వర్తింప చేస్తున్నాం. ఉచిత కరెంట్, గ్యాస్ రాయితీ లబ్ధిదారుల సంఖ్య నిరంతరం పెరుగుతూనే ఉంది. దరఖాస్తుల్లో తప్పులు సవరించే ప్రక్రియ నిరంతరం కొనసాగుతుంది. వ్యవసాయ రుణం రూ.2 లక్షలకు పైగా ఉన్నవారి ఖాతాల్లో నిధులు వేయలేదు. రూ.2 లక్షలకు పైన ఉన్న మొత్తాన్ని చెల్లించాలని రైతులకు సూచించాం. ధరణి పోర్టల్‌ను బంగాళాఖాతంలో వేస్తామని మేం పదే పదే చెప్పాం. దానిని దృష్టిలో ఉంచుకొని భారాస నాయకులు విమర్శలు చేస్తున్నారు. 18 రాష్ట్రాల రెవెన్యూ చట్టాలను అధ్యయనం చేసి.. కొత్త ఆర్వోఆర్ తీసుకొస్తున్నాం. తెలంగాణ ఆర్వోఆర్.. దేశానికే మోడల్‌గా నిలుస్తుంది" అన్నారు.

**అక్రమం అని తేలితే.. కూల్చేయండి**

"హైడ్రాను మంచి ఉద్దేశంతోనే తెచ్చాం. ఎఫ్‌టీఎల్, బఫర్‌జోన్ పరిధిలోని నిర్మాణాలకు అనుమతించేది లేదన్నారు. అలాంటి కట్టడాలను కూల్చివేస్తున్నాం. అవన్నీ గత ప్రభుత్వ హయాంలో జరిగిన నిర్మాణాలు. హిమాయత్ సాగర్ ప్రాంతంలో ఎఫ్‌టీఎల్ పరిధిలో నా ఫామ్‌హౌజ్ ఉందని బీఆరెస్ మీడియా బురద జల్లుతోంది. కేటీఆర్, హరీశ్‌రావుకు సవాల్ చేస్తున్నా.. నా ఇల్లు అక్రమంగా ఉంటే.. వెంటనే కూల్చివేయాలని హైడ్రా కమిషనర్‌ను ఆదేశిస్తున్నా. మా అధికారులకు బదులు మీరే వెళ్లి కొలవండి. అక్రమం అని తేలితే.. కూల్చేయండి'' అని పొంగులేటి అన్నారు.

# జాతీయ.. అంతర్జాతీయ క్రీడల నిర్వహణకు తెలంగాణకు అవకాశం ఇవ్వండి

**దిల్లీ:** జాతీయ, అంతర్జాతీయ క్రీడల నిర్వహణకు అవసరమైన మౌలిక వసతులన్నీ తెలంగాణలో ఉన్నాయని, భవిష్యత్తులో నిర్వహించనున్న ఒలింపిక్స్‌తో పాటు ఇతర అంతర్జాతీయ, జాతీయ క్రీడలు నిర్వహించే అవకాశాన్ని తెలంగాణకు ఇవ్వాలని కేంద్ర క్రీడలు, యువజన వ్యవహారాల శాఖ మంత్రి మన్‌సుఖ్ ఎల్ మాండవీయకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి విజ్ఞప్తి చేశారు. కేంద్ర మంత్రి మాండవీయను ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, రాష్ట్ర పర్యాటక, ఎక్సైజ్ శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు శుక్రవారం సాయంత్రం కలిశారు. ఈ సందర్భంగా క్రీడా శాఖపై తమకున్న లక్ష్యాలను, ఆకాంక్షలు, తెలంగాణకు ఉన్న ఘనతను కేంద్ర మంత్రికి ముఖ్యమంత్రి వివరించారు. ఒలింపిక్స్‌తో పాటు పలు అంతర్జాతీయ క్రీడల్లో తెలంగాణ క్రీడాకారులు పతకాలు సాధించిన విషయాన్ని కేంద్ర మంత్రి మాండవీయకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గుర్తు చేశారు. అంతర్జాతీయ వేదికలపై క్రీడాకారులు రాణించడానికి అవసరమైన అన్ని వసతుల కల్పనకు తమ ప్రభుత్వం ప్రాధాన్యం ఇస్తోందని కేంద్ర మంత్రికి ముఖ్యమంత్రి తెలియజేశారు. హైదరాబాద్‌లోని గచ్చిబౌలి స్పోర్ట్స్ కాంప్లెక్స్, సరూర్ నగర్ స్టేడియం, ఎల్బీ స్టేడియం, కేవీబీఆర్ ఇండోర్ స్టేడియం, ఓయూ క్యాంపస్, జింఖానా గ్రౌండ్, హుస్సేన్ సాగర్ తదితరాల్లో అంతర్జాతీయ ప్రమాణాలతో కూడిన ఈత కొలనులు,



మల్టీపర్పస్ ఇండోర్ స్టేడియంలు, సింథటిక్ అథ్లెటిక్ ట్రాక్స్, షూటింగ్ రేంజ్, ఫుట్‌బాల్ గ్రౌండ్స్, స్కేటింగ్ ట్రాక్స్, వాటర్ స్పోర్ట్స్ , ఇతర క్రీడలకు వసతులు ఉన్నాయని కేంద్ర మంత్రి మాండవీయకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వివరించారు. రాష్ట్ర రాజధాని హైదరాబాద్ లో వివిధ కేటగిరిల ఫైవ్ స్టార్ హోటళ్లు ఉన్నాయని, విమాన, రైలు సర్వీసులతో అనుసంధానమై ఉందని తెలిపారు. 2002లో నేషనల్ గేమ్స్, 2003లో ఆఫ్రో-ఏషియన్ గేమ్స్, 2007లో ప్రపంచ మిలటరీ గేమ్స్ హైదరాబాద్‌లో నిర్వహించిన విషయాన్ని కేంద్ర మంత్రి మాండవీయకు ముఖ్యమంత్రి గుర్తు చేశారు. వీటన్నింటని పరిగణనలోకి తీసుకొని భవిష్యత్‌లో ఒలింపిక్స్, ఆసియన్ గేమ్స్, కామన్‌వెల్త్ గేమ్స్ తెలంగాణలో నిర్వహించే అవకాశం ఇప్పించాలని, 2025, జనవరిలో నిర్వహించే ఖేలో ఇండియా యూత్ గేమ్స్ కు హైదరాబాద్‌కు అవకాశం ఇవ్వాలని కేంద్ర మంత్రి మాండవీయకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి విజ్ఞప్తి చేశారు. తెలంగాణ యువతలోని క్రీడా నైపుణ్యాలను వెలికితీసేందుకు స్పోర్ట్స్ యూనివర్సిటీ ఏర్పాటు చేయాలని నిర్ణయించినట్లు కేంద్ర మంత్రి మాండవీయకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తెలిపారు. స్పోర్ట్స్ యూనివర్సిటీల్లో అన్ని రకాల క్రీడలకు సంబంధించిన శిక్షణ, పరిశోధనలకు ప్రాధాన్యం ఇవ్వనున్నట్లు కేంద్ర మంత్రి దృష్టికి ముఖ్యమంత్రి తీసుకెళ్లారు. ఈ నేపథ్యంలో స్పోర్ట్స్ యూనివర్సిటీకి అవసరమైన ఆర్థిక సహాయం అందజేయాలని కేంద్ర మంత్రి మాండవీయకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి విజ్ఞప్తి చేశారు. రాష్ట్రంలో క్రీడా మౌలిక వసతుల అభివృద్ధికి ఖేలో ఇండియా పథకం కింద నిధులు విడుదలను పెంచాలని కేంద్ర మంత్రి మాండవీయను ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కోరారు. హైదరాబాద్ గచ్చిబౌలిలోని జీఎంసీ బాలయోగి స్టేడియం, సెంట్రల్ యూనివర్సిటీలోని షూటింగ్ రేంజ్, ఎల్ బీ స్టేడియం, హకీంపేటలోని స్పోర్ట్స్ స్కూల్, సరూర్ నగర్ ఇండోర్ స్టేడియంలలో మౌలిక వసతుల అభివృద్ధికి తాము ఇప్పటికే పంపించిన డీపీఆర్‌లను ఆమోదించాలని కేంద్ర మంత్రికి ముఖ్యమంత్రి విజ్ఞప్తి చేశారు.

# హస్తినలో సీఎం మంతనాలు..భేటీలు

**విశ్వంభర, దిల్లీ:** ఏఐసీసీ కార్యాలయంలో కాంగ్రెస్ జాతీయ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే, అగ్రనేత రాహుల్ గాంధీతో తెలంగాణ సీఎం రేవంత్రెడ్డి భేటీ అయ్యారు. సమావేశంలో ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, పలువురు మంత్రులు, సీనియర్ నేతలు పాల్గొన్నారు. పీసీసీ కొత్త అధ్యక్షుడి ఎంపిక, మంత్రివర్గ విస్తరణపై గతంలో పలుమార్లు చర్చలు జరిగినా కొలిక్కి రాలేదు. ముఖ్య నాయకుల మధ్య ఏకాభిప్రాయం కుదరకపోవడంతో వాయిదా పడుతూ వచ్చింది. ఈ నేపథ్యంలో గంట పాటు సాగిన పీసీసీ అధ్యక్షుడి మార్పు, మంత్రివర్గంలో మార్పులు-చేర్పులు, పెండింగులో ఉన్న నామినేటెడ్ పోస్టుల భర్తీపై ఈ భేటీలో చర్చ జరిగినట్లు సమాచారం. రాజీవ్ గాంధీ విగ్రహావిష్కరణకు రాహుల్, ప్రియాంక, సోనియాగాంధీలను ఆహ్వానించారని, అలాగే రెండు లక్షల రుణ మాఫీ చేసినందుకు వరంగల్‌లో నిర్వహించ తలపెట్టిన కృతజ్ఞత సభకు రాహుల్ గాంధీని ఆహ్వానించినట్లు తెలుస్తోంది.

**మంత్రి వర్గంలో నలుగురికి చోటు?**

రాష్ట్ర మంత్రివర్గంలోకి ఆరుగురిని తీసుకునే అవకాశం ఉండగా, ప్రస్తుతం నలుగురికి చోటు కల్పించవచ్చని తెలుస్తోంది. మాజీ మంత్రి సుదర్శన్ రెడ్డి, కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి, వాకిటి శ్రీహరి ముదిరాజ్, మల్‌రెడ్డి రంగారెడ్డి, ప్రేమ్‌సాగర్రావు, వివేక్‌లలో నలుగురికి అవకాశం లభించవచ్చని భావిస్తున్నారు.

**పీసీసీ పీఠం ఎవరికి?**

పీసీసీ అధ్యక్ష పదవికి బీసీల నుంచి మహేష్ కుమార్డ్, మధుయాస్కీగౌడ్, ఎస్సీల నుంచి సంపత్ కుమార్, లక్ష్మణ్ కుమార్, ఎస్టీల నుంచి ఎంపీ బలరాంనాయక్ పేర్లు పరిశీలనలో ఉన్నాయి. ఎస్సీలకు అవకాశం ఇవ్వాలనుకుంటే వర్గీకరణ తీర్పు నేపథ్యంలో లక్ష్మణ్ కుమార్ కు, ఎస్టీలకు ఇవ్వాలనుకుంటే బలరాంనాయక్‌కు , బీసీలకైతే మహేశ్ కుమార్ గౌడ్‌కు ఎక్కువ అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది. సామాజిక సమీకరణాలను పరిగణనలోకి తీసుకొని మంత్రివర్గం, పీసీసీ చీఫ్, డిప్యూటీ స్పీకర్, చీఫ్ విప్.. ఇలా అన్ని పదవులపై చర్చించి తుది నిర్ణయం తీసుకునే అవకాశం ఉన్నట్లు సమాచారం.

# ఉక్రెయిన్‌లో మోదీ శాంతి సందేశం..

(మొదటి పేజీ తరువాయి)

ఉందని మోదీ పునరుద్ఘాటించనట్లు పేర్కొన్నారు. రెండు రోజుల పోలండ్ పర్యటనను ముగించుకున్న ప్రధాని మోదీ, 10 గంటలు ప్రయాణించి ఉక్రెయిన్ చేరుకున్నారు. అక్కడి భారత సంతతి ప్రజలు రైల్వేస్టేషన్ వద్ద మోదీకి ఘన స్వాగతం పలికారు. అనంతరం రాజధాని కీవ్‌లోని అమరుల స్మారక ప్రాంతానికి చేరుకున్న మోదీకి స్వాగతం పలికిన అధ్యక్షుడు జెలెన్‌స్కీ, ఆత్మీయ ఆలింగనం చేసుకున్నారు. అనంతరం రష్యా దాడిలో మరణించిన చిన్నారులకు మోదీ నివాళి అర్పించారు. ఉక్రెయిన్ ఎదుర్కొన్న అతిపెద్ద సంక్షోభాల ఆనవాళ్లకు సంబంధించి అక్కడి మ్యూజియంలో ఏర్పాటు చేసిన ప్రదర్శనను ఇద్దరు నేతలు వీక్షించారు.

**ఈ సంక్షోభం చిన్నారులకు వినాశకరం: మోదీ**

"అధ్యక్షుడు జెలెన్‌స్కీతో కలిసి అమరుల స్మారకం వద్ద నివాళి అర్పించాం. ప్రస్తుతం కొనసాగుతున్న సంక్షోభం చిన్నారులకు వినాశకరమైంది. ప్రాణాలు కోల్పోయిన చిన్నారుల కుటుంబాలకు నా ప్రగాఢ సానుభూతి. దుఃఖం నుంచి బయటపడే మనోధైర్యాన్ని వారికి ఇవ్వాలని ప్రార్థిస్తున్నా" అని నరేంద్ర మోదీ ఎక్స్‌లో పోస్టు చేశారు.

**రష్యా-ఉక్రెయిన్ సంక్షోభం పరిష్కార మార్గాలపై చర్చ!**

ఫోమిన్ బొటానికల్ గార్డెన్‌కు వెళ్లి గాంధీ విగ్రహానికి నివాళులు అర్పించిన మోదీ, ఆ తర్వాత అధ్యక్ష భవనమైన మారిన్‌స్కీ ప్యాలెస్‌కు జెలన్‌స్కీ మోదీని తీసుకెళ్లారు. కీవ్ పర్యటనలో ఉన్న మోదీతో అధ్యక్షుడు జెలెన్‌స్కీ వ్యక్తిగతంగా, బృంద స్థాయిలో భేటీ అయ్యారు. రష్యా-ఉక్రెయిన్ సంక్షోభం పరిష్కార మార్గాలపై ఇరువురు నేతలు చర్చించారు. 1991లో ఉక్రెయిన్‌కు స్వాతంత్ర్యం వచ్చిన తర్వాత భారత ప్రధాని అక్కడ పర్యటించడం ఇదే తొలిసారి. ఉక్రెయిన్ అధ్యక్షుడు జెలెన్‌స్కీ ఆహ్వానం మేరకు మోదీ ఆ దేశంలో పర్యటిస్తున్నారు. ఆరు వారాల కింద రష్యాలో పర్యటించిన ప్రధానిపై అమెరికా, పశ్చిమ దేశాల నుంచి విమర్శలు వచ్చాయి. యుద్ధంలో భారత్ ఏ పక్షానికీ మద్దతుగా ఉండదని, కేవలం శాంతికి వారధిగా పని చేస్తుందనే సందేశం ఇచ్చేందుకు ప్రధాని ఈ పర్యటనను చేపట్టారు.



# నెలకు రూ.300కే ఇంటర్నెట్, కేబుల్ టీవీ, ఈ-ఎడ్యుకేషన్ సేవలు

**విశ్వంభర, దిల్లీ:** తెలంగాణలోని గ్రామీణ ప్రాంతాల్లోని 63 లక్షల గృహాలు, పట్టణ ప్రాంతాల్లోని 30 లక్షల గృహాలకు నెలకు రూ.300కే ఫైబర్ కనెక్షన్ కల్పించాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు కేంద్ర టెలికం, కమ్యూనికేషన్ల శాఖ మంత్రి జ్యోతిరాదిత్య సింధియాకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తెలియజేశారు. కేంద్ర మంత్రి జ్యోతిరాదిత్య సింధియాను ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క దిల్లీలో శుక్రవారం సాయంత్రం కలిశారు. టి-ఫైబర్ ద్వారా రాష్ట్రంలోని అన్ని గ్రామ పంచాయతీలు, మండలాలు, జిల్లాలకు ఆప్టికల్ ఫైబర్ ప్రాజెక్టు ద్వారా కనెక్టివిటీని కల్పించడం తమ ఉద్దేశమని కేంద్ర మంత్రి సింధియాకు ఆయన వివరించారు. 65,500 ప్రభుత్వ సంస్థలకు జీ2జీ (గవర్నమెంట్ టూ గవర్నమెంట్), జీ2సీ (గవర్నమెంట్ టూ సిటీజన్) కనెక్టివిటీ కల్పించడంతో పాటు రాష్ట్రంలోని గ్రామీణ ప్రాంతాల్లో 63 లక్షల గృహాలు, పట్టణ ప్రాంతాల్లో 30 లక్షల గృహాలకు నెలకు కేవలం రూ. 300 కే ఇంటర్నెట్, కేబుల్ టీవీ, ఈ-ఎడ్యుకేషన్ సేవలు అందించాలని తమ ప్రభుత్వం యోచిస్తున్న విషయాన్ని కేంద్ర మంత్రి దృష్టికి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తీసుకెళ్లారు. రాష్ట్రంలో 300 రైతు వేదికలకు టీ-ఫైబర్ ద్వారా రైతు నేస్తం కార్యక్రమాన్ని ప్రభుత్వం ఇప్పటికే అమలు చేస్తోందని, సాంఘిక సంక్షేమ పాఠశాలలకూ టీ-ఫైబర్ ద్వారా ఇంటర్నెట్ సౌకర్యాన్ని కల్పిస్తున్నామని ముఖ్యమంత్రి కేంద్ర మంత్రి దృష్టికి తీసుకెళ్లారు. రూ. 1779 కోట్ల పెట్టుబడులతో ప్రతిపాదించిన టీ-ఫైబర్ ప్రాజెక్టు అమలుకు రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటికే రూ. 530 కోట్లను వివిధ ఆర్థిక సంస్థల ద్వారా సమీకరించిందని కేంద్ర మంత్రి సింధియాకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తెలియజేశారు. మొత్తం పెట్టుబడి వ్యయం రూ. 1,779 కోట్లను యూనివర్సల్ సర్వీస్ ఆబ్లిగేషన్ ఫండ్ (యూఎస్ఎఫ్ఓ) ద్వారా వడ్డీ లేకుండా దీర్ఘకాలిక రుణంగా ఇవ్వాలని కేంద్ర మంత్రి సింధియాకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి విజ్ఞప్తి చేశారు. జాతీయ ఆప్టికల్ ఫైబర్ నెట్ వర్క్ (ఎన్ఓఎఫ్ఎన్) మొదటి దశ మౌలికసదుపాయాలను రాష్ట్ర ప్రభుత్వానికి సకాలంలో అందించాలని కేంద్ర మంత్రి సింధియాను ముఖ్యమంత్రి కోరారు. ప్రస్తుతం రాష్ట్రంలోని కొన్ని జిల్లాల్లో ఎన్ఓఎఫ్ఎన్ మొదటి దశ లైనియర్ ఆర్కిటెక్చర్ ఆధారంగా నడుస్తుంటే... మిగితా ప్రాంతాల్లో రింగ్ ఆర్కిటెక్చర్ ఆధారంగా టీ-ఫైబర్ నడుస్తోందని కేంద్ర మంత్రికి సీఎం వివరించారు. ఈ రీత్యా నెట్ వర్క్ సమర్థ నిర్వహణ, వినియోగం కోసం సకాలంలో ఎన్ఓఎఫ్ఎన్ మొదటి దశ మౌలిక సదుపాయాలకు అందించాలని ప్రతిపాదించారు. ఎన్ఓఎఫ్ఎన్ మొదటి దశను భారత్ నెట్ – 3 ఆర్కిటెక్చర్ కు మార్చడానికి గతేడాది అక్టోబరులో కేంద్ర ప్రభుత్వానికి రాష్ట్ర ప్రభుత్వం డీపీఆర్ ను పంపించిందని కేంద్ర మంత్రికి ముఖ్యమంత్రి గుర్తు చేశారు. ఆ డీపీఆర్‌ను త్వరగా ఆమోదించాలని విజ్ఞప్తి చేశారు. భారత్ నెట్ – 3 ద్వారా రాష్ట్రంలోని 33 జిల్లాల పౌరులకు ఈ-గవర్నెన్సును అందించగలుగుతామని ముఖ్యమంత్రి అభిప్రాయపడ్డారు. గ్రామీణ ప్రాంతాలకు హై-స్పీడ్ ఇంటర్నెట్ సదుపాయాల కల్పనకు ఉద్దేశించిన భారత్ నెట్ ఉద్యమి పథకాన్ని టీ-ఫైబర్ కు వర్తింపజేయాలని కేంద్ర మంత్రి జ్యోతిరాదిత్య సింధియాను ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కోరారు.

# మా సహనాన్ని పరీక్షిస్తే.. చర్యకు ప్రతిచర్య తప్పదు

**విశ్వంభర, తెలంగాణ బ్యూరో :** మా సహనాన్ని పరీక్షిస్తే.. చర్యకు ప్రతిచర్య తప్పదు అని కాంగ్రెస్ ప్రభుత్వాన్ని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ హెచ్చరించారు. అధికారం ఎవరికీ శాశ్వతం కాదనే విషయాన్ని సీఎం రేవంత్ రెడ్డి గుర్తుంచుకోవాలని కేటీఆర్ సూచించారు. బీఆర్ఎస్ కార్యకర్తలపై కాంగ్రెస్ పార్టీ శ్రేణుల దాడులు, పోలీసు నిర్లక్ష్య వైఖరిపై రాష్ట్ర డీజీపీని కేటీఆర్, సీనియర్ నాయకులు కలిసి శుక్రవారం ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా కేటీఆర్ మాట్లాడుతూ.. ' గురువారం ఒక్క రోజే రెండు ఉదంతాలు చోటు చేసుకున్నాయి. వాటికి సంబంధించి ఆధారాలతో డీజీపీకి ఫిర్యాదు చేశాం. విద్యార్థి నాయకుడు, తుంగతుర్తి మాజీ ఎమ్మెల్యే గాదరి కిషోర్ ఆధ్వర్యంలో ప్రజాస్వామ్య పద్ధతిలో శాంతియుతంగా తిరుమలగిరిలో రైతు నిరసన దీక్ష కార్యక్రమం చేపట్టాం. 50 మంది కాంగ్రెస్ గుండాలు, తాగిన మత్తులో ఆకస్మికంగా రాళ్లు, గుడ్లు, సుతిలి బాంబులతో దాడి చేశారు. మా వాళ్లు తిరగబడి ఉంటే ఆ 50 మంది కాంగ్రెస్ మూకలు ఒక్కరు కూడా మిగిలేవారు కాదు. కానీ శాంతియుతంగా మేం నిరసన తెలపాలని భావించాం. అందుకే ఎలాంటి ప్రతిఘటనకు పాల్పడలేదు. పోలీసులే మా నిరసన దీక్షకు సంబంధించిన టెంట్ కూల్చేయటం ఆశ్చర్యం కలిగించింది' అని కేటీఆర్ తెలిపారు.

**ఆ ఆడబిడ్డలు ఏం తప్పు చేశారు?**

'గురువారం ఇద్దరు మహిళా జర్నలిస్టులు సీఎం సొంత ఊరు కొండారెడ్డిపల్లికి పోయారు. వాళ్ల మీద కాంగ్రెస్ గుండాలు అసభ్యకరంగా దాడి చేశారు. వాళ్లేమైనా ముఖ్యమంత్రి లాగా బజారు భాష మాట్లాడారా? లాగుల తొండలు జొర్రకొడతాం, చెట్టుకు కట్టేసి కొడతాం అన్నారా? రుణమాఫీ అయ్యిందా? లేదా అని తెలుసుకోవటానికి వెళ్లారు. వారిపైన కూడా కాంగ్రెస్ చిల్లరగాళ్లు దాడి చేశారు. కాంగ్రెస్ గుండాలు వారిని వెల్దండ పోలీస్ స్టేషన్ వరకు వెంబడించారు. ఆ ఆడబిడ్డలు ఏం తప్పు చేశారు? వారికి సీఎం క్షమాపణం చెప్పాలి. నీ బండారం బయట పెట్టినందుకా? వారి మీద దాడి చేయించావ్. అంతే కాకుండా వాళ్ల మీద నికృష్టమైన భాషలో సోషల్ మీడియాలో కాంగ్రెస్ చిల్లర మనుషులు ప్రచారాలు చేస్తున్నార'ని కేటీఆర్ మండిపడ్డారు.

**సమాధానం చెప్పలేని దద్దమ్మ ఈ సీఎం రేవంత్ రెడ్డి అని నిలదీశారు**

'రుణమాఫీ విషయంలో వాస్తవాలను ప్రజల్లోకి పోయి సమాధానం చెప్పలేని దద్దమ్మ సీఎం రేవంత్ రెడ్డి. రుణమాఫీపై ఏ ఊరికైనా వెళ్దాం రా అని మేము సవాల్ చేస్తే రాలేదు. కానీ దిల్లీకి 20 సార్లు పోయిండు. క్షేత్రంలో తిరగాల్సిన సీఎం...ఢిల్లీ చుట్టు చక్కర్లు కొడుతున్నారు. సీఎంకు దమ్ముంటే నువ్వు ఏ ఊరికి పోదామో చెప్పు. అక్కడికి వెళ్లి రుణమాఫీ అయ్యిందా అనే విషయాన్ని అడుగుదాం. ఎక్కడ కూడా చారాణ రుణమాఫీ కాలేదు' అని కేటీఆర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. కొంత మంది పోలీసులు మాత్రం అత్యుత్సాహం ప్రదర్శిస్తున్నారు రాష్ట్రంలో మనం పోలీసులను, వ్యవసాయ అధికారులను తప్పుబట్టాల్సిన పని లేదు. తప్పు ముఖ్యమంత్రిది, చేతకాని సన్నాసి సీఎంది. అయితే పోలీసుల మీద మాకు సానుభూతి ఉంది. కానీ కొంత మంది పోలీసులు మాత్రం అత్యుత్సాహం ప్రదర్శిస్తున్నారు అది మంచిది కాదు. జర్నలిస్ట్‌లకే రక్షణ లేకపోతే...రాష్ట్రంలో సామాన్య పౌరుల పరిస్థితి ఏందీ? అని కేటీఆర్ నిలదీశారు. హైదరాబాద్‌లో శాంతి భద్రతలు పూర్తిగా అదుపు తప్పాయన్నారు. 'మంచిర్యాలలో ఎమ్మెల్యే కారణంగా మా నాయకుడు గొంతు కోసుకున్నాడు. మొత్తంగా వ్యవస్థలను అడ్డం పెట్టుకొని ఈ ముఖ్యమంత్రి అధికారం చెలాయించాలనుకుంటే అంతకన్నా మూర్ఖత్వం మరొకటి ఉండదు. హైదరాబాద్‌లో శాంతి భద్రతలు పూర్తిగా అదుపు తప్పాయి. నెల రోజుల్లో 28 హత్యలు అనే వార్తలు వస్తున్నాయి. సోషల్ మీడియాలో పోస్టులు పెడితే కూడా మా పార్టీ యువకులను వేధిస్తున్నారు. ఇంకా ఇలాగే కొనసాగితే మా నుంచి ప్రతిఘటన కూడా తప్పదు. హైదరాబాద్ బ్రాండ్ ఇమేజ్ దెబ్బ తినవద్దనే మేము ఇప్పటి వరకు ఊరుకుంటున్నాం. మా సహనాన్ని, చేతగాని తనం అనుకోవద్దు. మేము ప్రతిఘటిస్తే అప్పుడు మమ్మల్ని నిందించవద్దు. కొంతమంది పోలీసులు మంత్రుల బర్త్ డే కార్యక్రమాల్లో పరవశించి పోతున్నారు. డీజీపీకి



ఇలాంటి పోలీసుల మీద చర్యలు తీసుకోవాలని ఫిర్యాదు చేశాం. ఎఫ్‌టీఎల్, బఫర్ జోన్‌లో ఉన్న అన్ని నిర్మాణాలను కూల్చండి. పొంగులేటి, వివేక్, కేవీపీ, మధుయాష్కీ లాంటి నేతల భవనాలను కూల్చేసి ఆ తర్వాత సామాన్యుల భవనాలను కూల్చేయండి' అని కేటీఆర్ సూచించారు.

# భట్టిని కలిసిన మంద కృష్ణ మాదిగ

## సుప్రీం కోర్టు తీర్పు అమలు చేయాలని విజ్ఞప్తి

**విశ్వంభర, హైదరాబాద్:** ఎస్సీ వర్గీకరణపై భారత దేశ అత్యున్నత న్యాయస్థానం సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పు తెలంగాణ రాష్ట్రంలో త్వరితగతిన అమలుకు కృషి చేయాలని తెలంగాణ రాష్ట్ర ఉపముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్కని శుక్రవారం రాష్ట్ర వైద్య, ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖల మంత్రి దామోదర్ రాజ నర్సింహ ఆధ్వర్యంలో ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షులు మందకృష్ణ మాదిగ, మాదిగ సామాజిక వర్గానికి చెందిన శాసనసభ్యులు, సామాజిక వేత్తలు కలిసి విజ్ఞప్తి చేశారు. ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్కని కలిసిన వారిలో శాసన సభ్యులు ప్రభుత్వ విప్ అడ్లూరి లక్ష్మణ్ కుమార్, డా. కవ్వంపల్లి సత్యనారాయణ, వేముల వీరేశం, కాలే యాదయ్య, మందుల శామ్యూల్, ప్రొఫెసర్ మల్లేశం, ప్రొఫెసర్ ఖాసీం, సీనియర్ కాంగ్రెస్ పార్టీ నాయకులు కొండేటి మల్లయ్య, విజయ్ కుమార్ ముంజగళ్ళ, బాపిరాజు, ఎమ్మార్పీఎస్ నాయకులు మేడి పాపయ్య మాదిగ, గోవింద్ నరేష్‌లు ఉన్నారు.



**మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డిని కలిసిన మందకృష్ణ మాదిగ**

మంద కృష్ణ మాదిగ శుక్రవారం మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డిని బంజారాహిల్స్ లోని మంత్రుల నివాస సముదాయంలో కలిశారు. ఉదయం రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ మంత్రి దామోదర రాజనర్సింహా తో పాటు మంత్రిని కలిసిన మందకృష్ణ.. ఎస్సీ వర్గీకరణపై సుప్రీంకోర్టు తీర్పును అమలు చేయాలని విజ్ఞప్తి చేశారు. ఈ భేటీలో ఎమ్మెల్యే లు అడ్లూరి లక్ష్మణ్, వేముల వీరేశం , కవ్వంపల్లి సత్యనారాయణ , కాలె యాదయ్య , మోత్కుపల్లి నర్సింహులు, మాజీ ఎంపీ పసునూరి దయాకర్ పాల్గొన్నారు.



తెలంగాణ రాష్ట్ర తొలి బీసీ కమిషన్ చైర్మన్, సామాజిక వేత్త, శతాధిక గ్రంథకర్త బీస్ రాములు జన్మదిన వేడుకలు హైదరాబాద్‌లోని రవీద్ర-భారతిలో శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయనను పలువురు ప్రముఖులు సన్మానించి పుట్టినరోజు శుభకాంక్షలు తెలియజేశారు.

- విశ్వంభర, హైదరాబాద్

# ఐక్యూ జెడ్ 9ఎస్ ప్రో 5జీ, ఐక్యూ జెడ్ 9ఎస్ 5జీ విడుదల



**విశ్వంభర, బషీర్ బాగ్:** హై పెర్ఫార్మెన్స్ స్మార్ట్ ఫోన్ బ్రాండ్ అయిన ఐక్యూ తన ఫుల్ లోడెడ్ ఐక్యూ జెడ్ 9ఎస్ సిరీస్ లో ఐక్యూ జెడ్ 9ఎస్ ప్రో 5జీ, ఐక్యూ జెడ్ 9ఎస్ 5జీలను విడుదల చేయడం ద్వారా మరోసారి ఇండస్ట్రీ బెంచ్ మార్క్ ను సెట్ చేసింది. ఐక్యూ జెడ్ 9ఎస్ సిరీస్ 'ఫుల్లీ లోడ్ ఫర్ ది మెగాటాస్కర్స్' ప్రధానంగా కళాశాల విద్యార్థులు, యువ నిపుణులకు వేగవంతమైన కనెక్టివిటీ అంతరాయంలేని వినోదం అవసరం. ఐక్యూ జెడ్ 9ఎస్ సిరీస్ వారిని సులభంగా మల్టీటాస్క్ చేయడానికి శక్తివంతం చేస్తుంది. వారి బిజీ షెడ్యూల్లను సమర్థవంతంగా నిర్వహించడానికి రోజంతా కనెక్ట్ అవ్వడానికి సహాయపడుతుంది. ఐక్యూ జెడ్9స్ ప్రో 5జీ స్నాప్రాగన్ 7 జెన్ 3 ప్రాసెసర్ తో పనిచేస్తుంది. ఇది ఆకట్టుకునే 8 ఎల్ ప్లస్ అన్టూ స్కోర్ తో సెగ్మెంట్ వేగవంతమైన కర్వ్ స్మార్ట్ ఫోన్ నిలిచింది. ఐక్యూ జెడ్9ఎస్ 5జీ మీడియాటెక్ డైమెన్సిటీ 7300తో పనిచేస్తుంది. ఆప్టికల్ ఇమేజ్ స్టెబిలైజేషన్ (ఓఐఎస్)తో కూడిన 50 మెగాపిక్సెల్ సోనీ ఐఎంఎక్స్ 882 సెన్సార్, ఐక్యూ జెడ్9 ఎస్ ప్రో 5జీలో అదనంగా 8 మెగాపిక్సెల్ అల్ట్రావైడ్ లెన్స్ ఉన్నాయి. ఐక్యూ జెడ్ 9ఎస్ సిరీస్ లోని రెండు డివైజ్ లు స్లీక్ 7.49 ఎంఎం బాడీని కలిగి ఉన్నాయి. ఇవి తమ సెగ్మెంట్ లో స్లిమ్ కర్వ్ స్మార్ట్ ఫోన్ లుగా నిలిచాయి. స్లిమ్ డిజైన్ ఉన్నప్పటికీ ఇవి 5500 ఎంఏహెచ్ భారీ బ్యాటరీని ప్యాక్ చేస్తాయి. అద్భుతమైన 3డీ కర్వ్ అమోఎల్ఎడి డిస్ప్లేను కలిగి ఉంటాయి. ఐక్యూ జెడ్9ఎస్ సిరీస్ లో ఐక్యూ జెడ్ 9ఎస్ ప్రో 5జీలో 4500 నిట్స్ లోకల్ పీక్ బ్రైట్ నెస్, ఐక్యూ జెడ్ 9ఎస్ 5జీలో 1800 నిట్స్ లోకల్ పీక్ బ్రైట్ నెస్ ఉన్నాయి. డస్ట్ అండ్ వాటర్ రెసిస్టెన్స్ కోసం ఐపీ64 రేటింగ్ ఉన్న ఈ రెండు ఫోన్లు ఆండ్రాయిడ్ 14 ఆధారిత ఫన్ టచ్ ఓఎస్ 14 ఆపరేటింగ్ సిస్టంపై పనిచేస్తాయి. ఐక్యూ జెడ్ 9ఎస్ ప్రో ధర ప్లస్128. 24,999, ప్లస్ 256 4 5. 26,999, 124 ప్లస్ 256 రూ.28,999 లక్స్ మార్బుల్, ఆరెంజ్ అనే రెండు ఆకర్షణీయమైన కలర్ వేరియంట్లలో ఆగస్టు 23వ తేదీ మధ్యాహ్నం 12 గంటల నుంచి లభ్యం కానుంది.




## ఎన్‌టీఆర్ స్టేడియం, ఇందిరా పార్క్ వద్ద

# చేనేత కాటన్, సిల్క్ ఎక్స్ పో ప్రారంభం

**విశ్వంభర, హైదరాబాద్:** శ్రావణ మాసం, వినాయక చవితి, దసరా సందర్భంగా శ్రీ సాయి చేనేత కాటన్, సిల్క్ ఎక్స్‌పోను తెలంగాణ హ్యాండి క్రాఫ్ట్ డెవలప్మెంట్ కార్పొరేషన్ చైర్మన్ సత్యనారాయణ నాయుడు ప్రారంభించారు. శ్రీ సాయి స్వశక్తి మహిళ సాధికారత కమిటీ ఆధ్వర్యంలో జరుగుచున్న డ్వాక్రా, చేనేత హస్తకళా ప్రదర్శన. 23 ఆగస్టు 2024 నుంచి 29 సెప్టెంబర్ 2024 వరకు ప్రతిరోజు ఉ. 10 గం.ల నుంచి రాత్రి 9గం.ల వరకు హైదరాబాద్ లో ఎన్.టీ.ఆర్. స్టేడియం, ఇందిరా పార్క్ వద్ద అన్ని సెలవు దినాలలో కూడా అమ్మకాలు జరుతాయని నిర్వాహకులు తెలిపారు. దేశంలోని పలు రాష్ట్రాల నుండి చేనేత, డ్వాక్రా మహిళలు ఈ ప్రదర్శన పాల్గొంటారు. ఈ ప్రదర్శనలో తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ లోని అన్ని జిల్లాల డ్వాక్రా, చేనేత కార్మికులచే తయారు చేసిన ఉత్పత్తులను నేరుగా అమ్మకాలు నిర్వహించబడుచున్నవని తెలిపారు. ప్రపంచ ప్రఖ్యాతిగాంచిన గద్వాల్, వెంకటగిరి, ధర్మవరం, పోచంపల్లి, ఉప్పాడ పట్టుచీరలు, చీరాల, ఫ్యాన్సీ, ఖాదీ, కాటన్ ప్రింటెడ్, పోచంపల్లి బెడ్ షీట్స్, చీరల డ్రస్ మెటీరియల్స్ మంగళగిరి కాటన్ చీరలు, వరంగల్ టవల్స్, పెడన కలంకారి, వరంగల్



దర్రీస్, మంగళగిరి డ్రస్ మెటీరియల్స్, పొందూరు ఖద్దర్, బెంగాల్, సిల్క్ కాంత వర్క్ కాటన్, భాగల్పూర్ సిల్క్, బాంధ్న సిల్క్ గుజరాత్ డిజైన్ టాప్స్, లక్నో చికాన్ వర్క్ మురాదాబాద్ బ్రాస అండ్ లక్నో దుప్పట్లు, చందేరి, మహేశ్వరి ఇంకా మరెన్నో రకాల చేనేత వస్త్రలన్నీ ఒకే చోట ప్రదర్శన, అమ్మకాలు జరుగుతాయని అన్నారు. కొండపల్లి బొమ్మలు, ఏటికొప్పాక బొమ్మలు, డోర్కర్టనర్సి, డోర్ మ్యాట్స్, స్టోన్ జూవెలరీ, ముత్యాలు 1 గ్రా. గోల్డ్ ఆయుర్వేద ఉత్పత్తులు లభించును. ఈ ప్రదర్శనను నాయుడు సత్యనారాయణ, ప్రదర్శన కంభంపాటి పద్మజ నిర్వహణలో కొనసాగుతుందని తెలిపారు.

# నారాయణ గూడ తపస్య డిగ్రీ కాలేజి ఆధ్వర్యంలో ర్యాలీ

**విశ్వంభర, హైదరాబాద్:** ఇటీవల మహిళలపై తరచూ జరుగుతున్న అన్యాయాలు, అత్యాచారాలు, దాడులకు నిరసనగా శుక్రవారం నారాయణగూడ తపస్య కళాశాల విద్యార్థులు భారీ ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో నారాయణగూడా తపస్య డిగ్రీ కళాశాల ఛైర్మెన్ ముప్పాలా శ్రీధర్, డైరెక్టర్ శ్రీనివాస్, డిప్యూటీ డైరెక్టర్ శ్రీహరి, ప్రిన్సిపుల్ రమా రవీందర్, అధ్యాపక బృందం పాల్గొన్నారు. "ఉమెన్ ఎమ్ పవర్ మెంట్" మీద రాలి నిర్వహించారు. డిగ్రీ విద్యార్థినీ, విద్యార్తులు ర్యాలీలో పాల్గొన్నారు. ఈ రోజులలో ఆడవారికి కావలసిన ఆత్మస్థైర్యం మీదా, వారిపట్ల జరుగుతున్న అమానుష చర్యం పై అవగాహన ర్యాలిని విజయవంతంగా నిర్వహించారు. హాజరైన అతిథులు మహిళలపై జరుగుతున్న దాడులను ఖండిస్తూ భవిష్యత్తులో మహిళలపై దాడులు జరగకుండా ప్రభుత్వం పలు కఠినమైన చర్యలు చేపట్టాలని, మహిళలు, విద్యార్థినిలు సైతం ఇలాంటి వాటిపై నిత్యం అప్రమత్తంగా ఉండాలని, ఒడిదుడుకులు ఎదురైనప్పుడు తమ వంతు బాధ్యతగా దారుడ్యతను పెంపొందించుకునే విధంగా పలు యోగాసనాలు, కరాటే లాంటి ఆత్మస్థైర్యాన్ని పెంపొందించే ప్రావీణ్యాన్ని పెంపొందించుకోవాలని హాజరైన అతిథులు సూచించారు.









# జల సంరక్షణ సామాజిక బాధ్యత

## ప్రపంచ నీటి వారోత్సవాల సందర్భంగా..

**ప్రతి సంవత్సరం ఆగస్టు 23 నుండి సెప్టెంబర్ 1 వరకు ప్రపంచ నీటి వారోత్సవాలను పాటిస్తారు. నీరు ప్రకృతిలో ఉన్న సమస్త జీవులకు ప్రాణాధారం. ప్రకృతి ప్రసాదించిన ఒక అపరూపమైన పదార్థం. మనిషి జీవించడానికి గాలి ఎంత అవసరమో నీరూ అంతే అవసరం. నీరే లేకపోతే పచ్చని చెట్లు, పారే నదులు, జీవులు, మహాసముద్రాలు ఏమీ ఉండవు. ఇవేమీ లేకుండా ఎండిపోయిన మట్టి గడ్డలా ఉంటుంది భూమి. భూమిమీద వృక్షాలు, జంతువులు, మానవాళి మనుగడకు, వాటి పెరుగుదలకు గాలి తరువాత ముఖ్యమైనది నీరు.**

నీరు మూడు రూపాలలో... ఘన రూపం అంటే మంచు గడ్డల రూపంలోను, ద్రవ రూపం, సముద్రాలు, నదులు, చెరువులు మొదలగునవి, వాయు రూపంలో భూమండలం పై 71 శాతానికి పైగా ఆవరించి ఉంది. కొత్త సమ్మేళన పదార్థాల తోను, విష పూరిత రసాయన పదార్థాల తోనూ నీరు కలుషితమవుతోంది. అలా కలుషితమైన జలం జల చక్రం ద్వారా తిరిగి ఆవిరి రూపం ధరిస్తుంది. ఈ క్రమంలో ఆ జలం తనలోని ఇతర కలుషిత పదార్థాలను, అనగా రసాయన పదార్థాలను కూడా కలుపుకొని వాయు రూపంలో మేఘాలుగా మారి అక్కడి వాతావరణం అనుకూలించ గానే ద్రవించి తిరిగి వర్ష రూపంలో తిరిగి భూమిని చేరుతుంది. ఆ కలుషిత మేఘాలు వర్షించినపుడు రంగులలో వర్షము కురవడం, ఆమ్ల వర్షాలు కురవడం సర్వ సాధారణం. దాంతో ప్రకృతికి అపార నష్టం జరుగుతోంది. నీటి ఎద్దడిని ప్రపంచంలో 80 దేశాలు ఎదుర్కొంటున్నాయి. గొంతు తడుపుకొనే చుక్క నీటికోసం మైళ్లకు మైళ్లు నడిచి పోవాల్సిన పరిస్థితిలో కూడా ప్రజలు ఉన్నారు. మంచి నీళ్లు దొరకక కుంటల్లో, గుంటల్లో అడుగు బొడుగు మురికి నీటినే తాగాల్సిన దుస్థితిలో ఎంతో మంది ఉన్నారు. వేసవిలో చాలా చోట్ల నీటి కొరత మూలంగా, కనీసం తాగు నీరు దొరకక ఎంతో మంది బిందెలతో బహు దూరం కిలో మీటర్ల వరకు నడిచి వెళ్లి త్రాగు నీటిని తెచ్చుకునే అనివార్య పరిస్థితులను చూస్తూనే ఉన్నాం.



మంచినీటి కంటే సముద్రపు నీరు చాలా ఎక్కువ పరిమాణంలో ఉంది. మనం నివసించే భూగోళంలో ఉన్న నీటి వనరులలో 99% ఉన్నది ఉప్పునీరే. ఇది 97% సముద్రాల్లోనే ఉంది. మిగతాది నదులు, చెరువుల్లో ఉంది తాగడానికి పనికొచ్చే నీరు 1% మాత్రమే. ఇందులో చెరువుల్లో 0.86%, నదుల్లో 0.02% ఉండగా మిగిలినవి భూగర్భ జలాలు. ప్రపంచ వ్యాప్తంగా తాగడానికి ఉపయోగపడే నీరు 0.3% మాత్రమే.

నీటితో జీవం అంకురించింది. ప్రకృతి మనుగడ నీటితోనే కొనసాగుతోంది. జీవవైవిధ్య పరిరక్షణ. జీవం జలంతోనే సాధ్యమవుతుంది. ఇవన్నీ తెలిసినా..నీటిని వృథా చేస్తున్నాం..నీటి వనరుల్ని వ్యర్థాలతో కలుషితం చేస్తున్నాం. ప్రపంచంలో కోట్లాది మంది తాగడానికి నీరు లేక దాహంతో అల్లాడి పోతుంటే..మనకు అందుబాటులో ఉన్న నీటిని వృథా చేస్తున్నాం.

ఈ పరిస్థితి ఇలాగే కొనసాగితే..2050 నాటికి ఈ భూమ్మీద తాగడానికి పుష్కలమైన నీరు ఉండనే ఉండదని, ప్రజలు స్నానాలు చేయడం మానేసి శరీరానికి రసాయనిక లేపనాలు రాసుకుంటారనీ (కెమికల్ బాత్), వాటితోనే స్నానాలు చేస్తారనీ.. దేశ సరిహద్దుల్లో కాపలా కాయాల్సిన సైనికులు నీటి వనరుల చుట్టు కాపలా కాసే పరిస్థితి ఉంటుందని.. తలంటు కోవడానికి నీరు సరిపోక ప్రజలందరూ బోడి గుండుతో జీవిస్తారనీ, స్త్రీ పురుషులందరూ రోజు తల షేవ్ చేసుకునే పరిస్థితి వస్తుందని దివంగత మాజీ రాష్ట్రపతి అబ్దుల్ కలాం వ్యాఖ్యానించారంటే పరిస్థితి ఎలా ఉంటుందో అంచనా వేయొచ్చు.

భారత్‌లో సింధు నాగరికత, ఈజిప్టులో నైలు నది నాగరికత ఇలా ప్రపంచ నాగరికతలు నదీ తీరాలు, నీటి వనరులకు సమీప ప్రాంతంలో విలసిల్లాయి. భారత చరిత్రంతా జలవనరుల తోనే ముడిపడి ఉంది. నీటిని పరిరక్షించుకోవాలనే నినాదాన్ని ప్రాచీన నాగరికతలు వెల్లడించాయి.

భారతీయులకు నీటి విలువ తెలుసు కనుకే నదులను పూజించే ఆచారం ఉంది. నీటిని పూజించి, నదులకు, చెరువులకు, జలాశయాలకు హారతులిస్తారు. నారం అంటే నీరు. నీటిలో ఉంటాడు కాబట్టి శ్రీమహావిష్ణువుకు నారాయణుడు అని పేరు. నీటినే రూపంగా స్వీకరించి విష్ణువు నీటి విలువను చెప్తున్నాడు. శివుడు ఏకంగా గంగను తన తలపై ధరించి గంగాధరుడయ్యాడు. నీటిని వృథా చేయడం సృష్టికి, భగవత్తత్వానికి, సమస్త ప్రాణకోటికి వ్యతిరేకమని పురాణాలు, ప్రాచీన గ్రంథాలు స్పష్టం చేస్తున్నాయి.

నీటి సంరక్షణ చర్యల్లో భాగంగా.. ఉన్న నీటిని సద్వినియోగం చేసు కోవడం, వృథాను అరికట్టడం, పొదుపుగా వాడటం, పునర్వి నియోగం..తదితరాలన్నింటికీ ప్రాధాన్య మివ్వాలి.



# సాహితీ వాచస్పతి దాశరథి

### నేడు (ఆగస్టు 24) దాశరథి రంగాచార్య జయంతి

తెలుగు జాతి గర్వించదగిన సాహితీవేత్త దాశరథి రంగాచార్య. అయన చేసిన బహుముఖ రచనలు అనన్య సామాన్యాలు. అసాధారణ మేధోసంపత్తికి ప్రతిరూపాలు. రంగాచార్య రచనల్లో తెలంగాణదనం నిండుగా పరుచుకొని ఉంటుంది. ప్రగతి శీల భావం ఉప్పొంగుతుంది. వేద విజ్ఞానం ఆధ్యాత్మికతను తట్టి లేపుతుంది. తెలంగాణ గ్రామీణ జన జీవనం సాక్షాత్కరిస్తుంది. అందుకే తెలంగాణ ప్రజలు, పోరాట యోధులు, తీవ్రవాదులు, పీడిత తాడిత ప్రజలు, నిరంకుశ పాలన బాధితులు, చరిత్రకారులు, భాగవతోత్తములు... ఒక్కొక్కరికీ ఒక్కొక్క రీతిలో ఆయన ఆత్మీయ రచయితగా నిలిచారు.

ఆయన రచయిత, జీవిత చరిత్రకారుడు మాత్రమే కాదు. తెలుగు, సంస్కృతం, ద్రావిడం, హిందీ, ఉర్దూ, ఇంగ్లీషు భాషలలో గొప్ప పండితుడు, కవి, విమర్శకులు, నాటకకర్త. గొప్ప వక్త. ఏ అంశాన్నైనా అలవోకగా అవలీలగా వీనులకు ఇంపుగా చెప్పగలిగిన వ్యాఖ్యాత. తొలితరం ఉద్యమ రచయిత, తెలంగాణ అజ్ఞాత సాయుధ పోరాట యోధుడు.

దాశరథి రంగాచార్యులు 1928, ఆగస్టు 24 న నాటి మహబూబా బాదు జిల్లా, చిన్నగూడూర్ మండలం, చిన్నగూడూర్ లో విద్వాన్ వెంకటాచర్య- వెంకటమ్మ దంపతులకు జన్మించారు. పుట్టింది పండిత కుటుంబమే అయినా అనేక ఉద్యమాల్లో పాల్గొన్నారు దాశరథి. ఆయన అగ్రజుడు దాశరథి కృష్ణమాచార్యుల నుండి అభ్యుదయ, విప్లవ భావాలను అలవర్చుకున్నారు. తెలంగాణ సాయుధ పోరాటంలో ఇద్దరూ కలిసి పనిచేశారు. భూమి కోసం, భుక్తి కోసం, వెట్టి చాకిరి విముక్తి కోసం నిజాం సర్కార్ కు వ్యతిరేకంగా పోరాడారు. తెలంగాణ ఉద్యమ జీవితాన్ని సాహిత్య రూపంలో ప్రజలకు అందించారు రంగాచార్య. తెలంగాణ చరిత్ర, ఉద్యమాలు, ప్రజల జీవితం, సాహిత్యం, సంస్కృతి.. ఇలా తెలంగాణకు సంబంధించిన అన్ని అంశాలను రచనల్లో స్పృశించిన సాటిలేని మేటి రచయిత ఆయన.

మూడు కావ్యేతిహాసాలను – శ్రీమద్రామాయణము, శ్రీమదాంధ్ర మహాభారతము, శ్రీమద్భాగ వతము, వేదాలు – రుగ్వేదము, కృష్ణ యజుర్వేదము, శుక్ల యజుర్వేదము, సామవేదము, అధర్వణవేదము ఒకే ఒక్కరుగా సంస్కృతం నుంచి వ్యాఖ్యాన సహితంగా ప్రతి కృతి చేసిన ఏకైక రచయిత దాశరథి. ఆరవ తరగతి చదువుతున్నప్పుడే తోటి విద్యార్థులను కూడగట్టి నిజాంకు వ్యతిరేకంగా సమ్మె చేశారు. నిజాం రాజ్యం ఆచంద్రార్కం నిలిచి ఉండాలని పాఠశాలల్లో చేసే ప్రార్థన ను తాను చేయడానికి రంగాచార్య నిరాకరించి, నిబంధన మేరకు వారి లాగే కుచ్చు రూమీ టోపీ ధరించడానికి తిరస్కరించి బడి నుండి బహిష్కృతులు అయ్యాడు. ఎక్కడా చదువుకోకుండా నిజాం ప్రభుత్వం ఫర్మానా జారీ చేసింది కూడా.

పోలీసు నిర్బంధం, చిత్రహింసల నుంచి తప్పించుకుని అజ్ఞాతంలోకి వెళ్ళి నిజాం వ్యతిరేక పోరాటం క్రియాశీలంగా జరిపారు. తర్వాత నిజాం ప్రభుత్వం వారంటు జారీ చేసినా, రంగాచార్య జాడ కనుక్కోలేక పోయింది. నేరుగా సాయుధ పోరాటంలో పాల్గొన్నారు. పగలు బడిలో పిల్లలకు పాఠాలు చెబుతూనే, రాత్రుళ్లు రైతు కూలీలకు ఉద్యమ బోధ చేసేవారు.

తొలి నవల 'చిల్లరదేవుళ్లు'ను 1969లో వెలువరించారు. ఈ నవల 1974లో చలన చిత్రంగా వచ్చింది. 'చిల్లరదేవుళ్లు' 1938కి పూర్వపు తెలంగాణ ప్రజల జీవనాన్ని చిత్రిస్తే, తెలంగాణ సాయుధ పోరాటంలోని 1942-48 సంవత్సరాల మధ్య కాలాన్ని 'మోదుగు పూలు' నవల వర్ణిస్తుంది.

చిల్లరదేవుళ్లు', 'మోదుగు పూలు' వంటి నవల్లో తెలంగాణ పలుకుబడులను – నుడికారాన్ని పలికించారు. స్వాతంత్ర్యం తరువాత రెండు దశాబ్దాల సుదీర్ఘ కాలాన్ని 'జనపదం' నవలలో చిత్రించారు. బుద్ధుని జీవిత చరిత్రను 'బుద్ధ భానుడు' పేరుతో అపురూపమైన రచనను 2010 సంవత్సరంలో వెలువరించారు.1994లో హరివంశ సహిత 'మహా భారతం' రచించారు.1940ల్లో కోల్ కతాలో వచ్చిన కరువు రక్కసి గురించి ప్రఖ్యాత భారతీయ ఆంగ్ల రచయిత భవానీ భట్టాచార్య రాసిన నవల 'He who rides A tiger'ను 'దేవుని పేరిట' పేరుతో తెలుగులో అనువదించారు. తొలినాళ్ళలో రంగాచార్య పిల్లలకోసం 'వివేకనందుడు', 'మహాత్ముడు', 'కాళిదాసు' అనే మూడు నాటకాలు రచించారు. 1974లో 'శ్రీ వేంకటేశ్వర లీలలు' రచించారు. వేదాలు సామాన్యుడికి సైతం అందించాలనే ఆలోచనతో 70 ఏళ్ళ వయస్సులో బృహత్ కార్యాచరణకు శ్రీకారం చుట్టారు. విస్తృత సాహిత్యాన్ని సరళమైన తెలుగులోకి తేవడం, ముద్రణ, పంపిణీ, వ్యాప్తి కళ్ళార చూడడం రంగాచార్య చేసిన శ్రమఫలం, చేసుకున్న అదృష్టం. ఒక జీవితకాలంలో ఇంత చేసినవారు, ఎదిగినవారు మరొకరులేరు.

తెలంగాణ జీవితాన్ని లోకానికి తెలియ జెప్పాలనే చారిత్రక దృష్టితో, దృఢ సంకల్పంతో, తెలంగాణ మీద అభిమానంతో, అందమైన శైలిలో రచనా వ్యాసంగాన్ని ఆయన సాగించారు.

1951లో ఉపాధ్యాయ వృత్తిలో ప్రవేశించారు. తరువాత 1957లో సికింద్రాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ లో చేరి, ఉద్యోగం చేస్తూనే బీఏ, ఎల్ఎల్‌బీ చేశారు. 32 సంవత్సరాల పాటు పనిచే చేసి, 1988లో అసిస్టెంట్ కమిషనర్‌గా ఉద్యోగ విరమణ చేశారు. రంగాచార్య 2015 జూన్ 8వ తేదీన కన్ను మూశారు.

### నేడు (ఆగస్టు 24) బండి రాజన్ బాబు వర్ధంతి

# కెమెరాకే ట్రిక్కులు నేర్పిన మాంత్రికుడు

**అద్భుతమైన జ్ఞాపకాలు, తియ్యటి అనుభూతులు, మధుర ఘట్టాలు, గొప్ప సన్నివేశాలు, అపురూప సంఘటనలు, మనసు దోచే దృశ్యాలు, ఆలోచింప జేసే రూపాలు... అరుదైన చిత్రాలు...వెరసి ఫొటోగ్రఫీ. వెలకట్టలేని దృశ్యాలను పదికాలాల పాటు పదిలంగా మన కళ్ల ముందు ఉంచేది ఫొటో. వంద మాటలతో చెప్పలేనిది ఒక్క ఫొటోతో చెప్పడం సాధ్యం. అంతటి శక్తివంతమైనది ఫొటోగ్రఫీ. అలాంటి శక్తిని వశం చేసుకుని ఫొటోతో అద్భుతాలు సృష్టించిన కెమెరా మాంత్రికుడు బండి రాజన్ బాబు. కెమెరాకే ట్రిక్కులు నేర్పిన నేర్పరి రాజన్ బాబు. అంతర్జాతీయ ఖ్యాతి గడించిన రాజన్ బాబు తెలంగాణకు చెందిన వారు కావడం గర్వకారణం.**







బండి రాజన్ బాబు (ఫిబ్రవరి 9, 1939 - ఆగస్టు 24, 2011) ప్రఖ్యాత ఛాయా చిత్రకారులు. ఛాయా గ్రహణంలో పేరు తెచ్చుకొన్న బండి రాజన్ బాబు 1939, ఫిబ్రవరి 9 న కరీంనగర్ జిల్లా కోరుట్లలో జన్మించారు. రాజన్ బాబంటే తొలుత గుర్తుకు వచ్చేవి అరకు లోయల్లో తీసిన బొండా గిరిజన మహిళల అగణిత ఛాయా చిత్రాలు.

బాల్యంలో రంగులు వేయడం, చిత్రాలను గీయడం పట్ల ఆసక్తిని కనబరిచిన రాజన్ బాబు, మంచి చిత్రకారుడు కావల్సి ఉండగా, కుంచె నుండి కెమేరాకు మారడం యాదృచ్ఛికం. బాల్యం నుంచి చిత్రకళ పై మక్కువ ఉన్న రాజన్, 7వ తరగతి చదువు తున్నప్పుడు తన కజిన్ బహుకరించిన సాధారణ కొడాక్ 620 కెమేరాతో తీసిన చిత్రాలు పెక్కుమంది ప్రశంసలు అందుకొని రాజన్ లోని ఛాయాగ్రాహకుడిని వెలికి తీసింది. హైదరాబాదులోని జేఎన్టీయూ ఫైన్ ఆర్ట్స్ కళాశాలలో కమర్షియల్ ఆర్ట్ (వ్యాపార చిత్రకళ) లో డిప్లొమా కోర్స్ లో చేరిన సమయంలో, రాజన్ బాబు ప్రఖ్యాత ఛాయాగ్రహకుడు దివంగత రాజా త్రయంబక్ రాజా బహదూర్ ను కలిశారు. కుంచె స్థానంలో కెమేరా పట్టుకోమన్నఆయన సలహా రాజన్ జీవితాన్ని మలుపు తిప్పింది. 5 సంవత్సరాల డిప్లొమా చేసి, కళాశాలలో డిస్టింక్షన్ లో ఉత్తీర్ణుడయ్యారు. కళాశాల యాజమాన్యం మెప్పు పొంది అదే కళాశాలలో అధ్యాపకుడిగా చేరారు. తరువాత ఇక్రిశాట్ లో సైంటిఫిక్ ఫొటొగ్రాఫర్ గా పనిచేశారు. 1978 లో తన ఫొటో స్టుడియో స్థాపించి, రాజన్ స్కూల్ ఆఫ్ ఫోటోగ్రఫీ ప్రారంభించి ఎందరో విద్యార్థులను నిపుణులైన ఛాయా గ్రహకులుగా తీర్చిదిద్దారు.

ఛాయాగ్రహణంలో రాజన్ తొక్కిన కొత్త పుంతలు తనకు దేశీయ, అంతర్జాతీయ గుర్తింపు తెచ్చింది. 1987లో నగ్న చిత్రాలపై ఛాయాచిత్ర కళాకృతులను సమర్పించి రాయల్ ఫోటోగ్రఫీ సొసైటీ ఫెలోషిప్ పొందారు. ఆంధ్రప్రదేశ్ స్టేట్ అకాడెమీ ఆఫ్ ఫోటోగ్రఫీ కార్యదర్శిగా ఉంటూ, భగవాన్ దాస్ తర్వాత లెన్స్ లైట్ అనే ఛాయాగ్రాహక పత్రికకు సంపాదకత్వం వహించారు.

డిజిటల్ ఛాయాగ్రహణానికి ముందు ఛాయాచిత్రాలు డార్క్‌రూం (చీకటి గది) లోనే స్థిర రూపం దాల్చేవి. నెగటివ్ లు వృద్ధి చేయటానికి, స్థిరపరచడానికై రాజన్ తానే రూపొందించుకొన్న రసాయనిక సూత్రం పై ద్రావణాలు కలిపి డెవలపర్ తయారు చేసి, నెగటివ్ లను స్థిరపరిచేవారు. ఈ విధానంలో... చిత్రంలో, నలుపు, తెలుపులను ప్రస్ఫుటంగా చూపే హైడ్రోక్వినాన్ లేకుండా కేవలం మెటల్ తోనే ఫిల్మ్ ను వృద్ధిపరచి, స్థిరపరచి, నలుపు తెలుపులో ఎన్నో కళాఖండాలు సృష్టించారు. ఇది రాజన్ ప్రతిభకు నిదర్శనం. ఫొటొషాప్ లాంటి సాఫ్ట్‌వేర్లు లేని సమయంలో కూడా రాజన్ అద్భుతాలు చేశారు. తన కళా నైపుణ్యంతో తన ఛాయా చిత్రాలను పలు మార్లు వన్ మాన్ షో లో ప్రదర్శించి ప్రశంసలందుకున్నారు. రాజన్ తీసిన నగ్న చిత్రాలలో రసికత ఉంటుంది కాని అసభ్యతకు చోటు ఉండదు. అందుకే అవి రసజ్ఞుల ప్రశంసలు పొందాయి. కొడాక్ 620 తో మొదలుపెట్టిన రాజన్, తన విద్యార్థులకు ఛాయా గ్రహణ పాఠాలలో భాగంగా బోధించ టానికై, చాలా కెమేరాలు సేకరించారు. వాటిలో ఛాయాచిత్ర కారులలో హోదాకు చిహ్నమైన Hasselblad-medium-format camera కూడా ఉంది. ఫిల్మ్ కెమేరా Asahi Pentax నుంచి, ఛాయాగ్రహణం డిజిటల్ దిశగా సాగిన పయనంలో రాజన్ Canon 400D వాడే వారు. ఛాయాగ్రహణ శాఖలలో ఒకటైన ఇండస్ట్రియల్ ఫోటోగ్రఫీలో కూడా రాజన్ తన సత్తా చూపారు. నగ్న చిత్రాలకు, అసభ్య చిత్రాలకు మధ్య ఒక గీత ఉంటుంది అనేవారు ఆయన. ఛాయాగ్రహణం ఒక భాషైతే, అందులోని వ్యాకరణమే Composition, Color, Space, Form, Proper Exposure, Angle and Light అని వివరించే వారు. ఈ మెలకువ గ్రహించిన వాడు మంచి ఛాయా గ్రాహకు డవుతాడని రాజన్ అంటుండే వారు. పిక్టోరియల్ ఫొటొగ్రఫీలో తనదైన ముద్ర వేసిన రాజన్ బాబు 2011, ఆగస్టు 24 న తన 73వ ఏట, అనారోగ్యంతో, హైదరా బాదులో మరణించారు. రాష్ట్ర, జాతీయ అంతర్జాతీయ వేదికలపై ఫోటో ప్రదర్శనలు ఏర్పాటు చేసి, లెక్కకు మించిన అవార్డులు, బహుమతులు సొంతం చేసుకున్న రాజన్ బాబు ఫోటోగ్రఫీ కళా కారునిగా చిరకాలం గుర్తుండి పోతారు.



-రామ కిష్టయ్య సంగన భట్ల...
9440595494



# ఇబ్బందులు తొలగించేందుకే కొత్త ఆర్ఓఆర్ చట్టం

**విశ్వంభర, నల్గొండ:** ప్రస్తుత 2020 రెవెన్యూ (ఆర్ ఓ ఆర్) చట్టం వల్ల కలిగే ఇబ్బందులను తొలగించి రైతులకు ఉపయోగకరమైన చట్టాన్నితీసుకొచ్చేందుకుగాను రాష్ట్ర ప్రభుత్వం నూతన ఆర్ఓఆర్ చట్టం - 2024 తీసుకువచ్చేందుకు కృషి చేస్తున్నట్లు రాష్ట్ర శాసనమండలి ఛైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి తెలిపారు. శుక్రవారం నల్గొండ జిల్లా కలెక్టర్ కార్యాలయంలోని సమావేశ మందిరంలో "తెలంగాణ హక్కుల రికార్డు బిల్లు- 2024" ముసాయిదా పై ఏర్పాటు చేసిన సదస్సు, చర్చ కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. రైతుకు కలిగే ఇబ్బందులను పరిష్కరించే అవకాశం చట్టంలో ఉండాలని, అలాగే తప్పులు సవరించే అవకాశం చట్టం కల్పించాలని, 2020 లో ఏర్పాటు చేసిన చట్టంలో అప్పీళ్లకు అవకాశం లేదన్నారు. కొత్త చట్టంలో వాటికి స్థానం కల్పించనున్నట్లు, ఎక్కడైనా పొరపాటు జరిగితే సవరించే అవకాశం సైతం నూతన ప్రతిపాదిత చట్టంలో ఉందన్నారు. రానున్న అసెంబ్లీ, శాసనమండలి సమావేశాలలో కొత్త చట్టాన్ని ప్రవేశపెట్టి అమలులోకి తీసుకొచ్చేందుకు అవకాశం ఉందని ఆయన తెలిపారు. ప్రస్తుతం వేల సంఖ్యలో బోగస్ పాస్ పుస్తకాలు ఉన్నాయని ,పాసు పుస్తకాలు ఉన్నవాళ్లకు భూములు లేవని ,ఇలాంటివన్ని తొలగించి పారదర్శక చట్టాన్ని తీసుకువచ్చేందుకు చేస్తున్న ప్రయత్నంలో భాగంగా నల్గొండ జిల్లా తిరుమలగిరి సాగర్ మండలాన్ని పైలట్ మండలం ఎంపిక చేయడం జరిగిందని, చట్టాలు మారడం వల్ల వ్యవస్థలు కూలిపోకూడదని ఆయన అన్నారు. నూతన రెవెన్యూ చట్టంపై అన్ని జిల్లాలలో రాష్ట్రవ్యాప్తంగా అభిప్రాయాలను సేకరించి కొత్త చట్టం తెచ్చేందుకు కృషి చేయడం జరుగుతున్నదని, కొత్త చట్టం పట్ల చాలామంది అభినందిస్తున్నారని, మార్పులు ,చేర్పులు సూచిస్తున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ సి.నారాయణరెడ్డి ,ఎమ్మెల్సీ నర్సిరెడ్డి ,స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ టీ. పూర్ణచంద్ర, తిప్పర్తి మాజీ జడ్పీటీసీ పాశం రాం రెడ్డి, కలెక్టర్ కార్యాలయ ఏ ఓ మోతిలాల్, వివిధ వర్గాల ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

# 25 కిలోల బంగారు నగలు ధరించి తిరుమల శ్రీవారి దర్శనం

**విశ్వంభర, తిరుపతి:** శ్రీవారిని దర్శించుకునేందుకు నిత్యం వేలాది మంది భక్తులు తిరుమల సందర్శిస్తారు. భక్తులతో తిరుమల కొండలు ఎప్పుడూ ఆధ్యాత్మిక భావనతో అలరారుతుంటాయి. భక్తులు తాము తెచ్చిన ముడుపులను వెంకటేశ్వరునికి సమర్పిస్తుంటారు. నిత్యం ధనరాశులతో తూగే శ్రీవారిని దర్శించుకోవడానికి ఓ బంగారు కుటుంబం తిరుమలకు వచ్చింది. ముంబయికి చెందిన ఆ కుటుంబం సుమారు 25 కేజీల బరువుండే బంగారు ఆభరణాలను ధరించి స్వామి వారిని దర్శించుకున్నారు. అనంతరం ఆలయ పరిసరాల్లో కలియ తిరిగారు. వారిలో ఇద్దరు 10 కిలోల చొప్పున బంగారాన్ని ధరించగా, మరొకరు 5 కేజీల బంగారాన్ని అలకరించుకున్నారు. ఈ బంగారు ఆభరణాల విలువ సుమారు రూ.15 కోట్లుగా ఉంటుందని అంచనా. ఇంత భారీ మొత్తంలో బంగారు ఆభరణాలు ధరించి శ్రీవారి దర్శనానికి రావడంతో తిరుమల గిరులపై దర్శనానికి వెళ్లిన భక్తులు ఆశ్చర్యానికి గురయ్యారు. వారిని ఆసక్తిగా తిలకించారు. ఇంత బంగారమా అంటూ తీక్షణంగా చూశారు. ఆలయం ఎదుట ఉన్న భక్తులు వారిని చూసి సెల్ఫీలు దిగడానికి ప్రయత్నించారు. వారు అడిగిన వారందరికీ సెల్ఫీలు ఇస్తూ చిరునవ్వులు చిందించారు. వారి బంగారు ఆభరణాలు ఎవరైనా పట్టుకొని వెళ్లిపోతారన్న భయం వారిలో కనిపించలేదు. వారి రక్షణ కోసమే సుమారు 15 మంది సెక్యూరిటీ సిబ్బంది రావడం మరో విశేషం.

# తూర్పు హైదరాబాద్‌లో మంచి మార్పు తీసుకొస్తాం

(మొదటి పేజీ తరువాయి)

ఐటీ హబ్‌లు కూడా వచ్చేలా చూస్తామని స్పష్టం చేశారు. ఇక్కడ 5 స్టార్ హోటల్‌తో పాటు కన్వెన్షన్ సెంటర్ ఏర్పాటుపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని సంప్రదించి నిర్ణయం తీసుకుంటామన్నారు. మెట్రో రైలును ఔటర్ రింగ్ రోడ్ వరకు విస్తరిస్తామని, కాలుష్యం లేని పరిశ్రమలు తీసుకొస్తామన్నారు. కాంగ్రెస్ ప్రజాపాలనలో తక్కువ మాట్లాడి ఎక్కువ పని చేస్తామన్నారు. నాగోల్‌లో క్రెడాయ్ ఏర్పాటు చేసిన ప్రాపర్టీ షోను శుక్రవారం మంత్రి ప్రారంభించారు. అనంతరం ఆయన స్టాళ్లను పరిశీలించారు. ఈ సందర్భంగా శ్రీధర్ బాబు మాట్లాడుతూ.. క్రెడాయ్ ఈస్ట్ హైదరాబాద్ ప్రాపర్టీ షో చాలా మంచిదని, తమ ప్రభుత్వం క్రెడాయ్‌కి పూర్తిగా సహకరిస్తుందని అన్నారు. రాబోయే కాలంలో ఈస్ట్‌లో ఉన్న వినియోగదారులకు వారి ఆర్థిక శక్తిని దృష్టిలో ఉంచుకుని బిల్డర్స్ ముందుకు వెళ్ళాలని సూచించారు. సామాన్యులకు ఎలాంటి ధరలకు ఇళ్లు ఇవ్వాలనేది ఈ ప్రాపర్టీ షోలో క్రెడాయ్ వివరిస్తోందన్నారు. స్కిల్ యూనివర్సిటీ లో క్రెడాయ్ సభ్యులు కూడా శిక్షణ ఇవ్వడం అనేది చాలా సంతోషమని ఆనందం వ్యక్తం చేశారు. గత నెలలో క్రెడాయ్ ప్రాపర్టీ షో ఏర్పాటు చేస్తే .. రాష్ట్రంలో 270 కోట్ల రూపాయల అమ్మకాలు జరిగాయని గుర్తు చేశారు. హైదరాబాద్‌లో అన్ని రకాల వసతులున్నాయని.. డెవలపర్స్ ఈ సదుపాయాలను ఉపయోగించుకోవాలని సూచించారు. రాష్ట్రంలో ఉన్న గ్రామీణ ప్రాంతాలు, పట్టణ ప్రాంతాల్లో నిర్మాణాలు చేపట్టాలని పిలుపునిచ్చారు. తమ ప్రభుత్వం రాజకీయాలు పక్కనపెట్టి అభివృద్ధిపై దృష్టి సారించిందని స్పష్టం చేశారు. గత ప్రభుత్వం లాగా మేం మాట మార్చమని.. ఇచ్చిన మాట నిలబెట్టుకుంటామన్నారు శ్రీధర్ బాబు. ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ఏర్పాటు చేయనున్న ఫోర్త్ సిటీలో నిరుద్యోగులకు ఉపాధి కల్పనే లక్ష్యంగా స్కిల్ యూనివర్శిటీ ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు.

# 28 హాస్టళ్లలో ఫుడ్ సేఫ్టీ తనిఖీలు



**విశ్వంభర, హైదరాబాద్:** హైదరాబాద్ నగర వ్యాప్తంగా ఉన్న ప్రభుత్వ, ప్రైవేటు రెసిడెన్షియల్ పాఠశాలలు, కళాశాలలో శుక్రవారం ఫుడ్ సేఫ్టీ అధికారులు తనిఖీలు నిర్వహించారు. జీహెచ్ఎంసీ కమిషనర్ ఆమ్రపాలి ఆదేశాల మేరకు ఫీడ్ సేఫ్టీ అధికారులు నగరంలోని పలు ప్రాంతాల్లో ఉన్న కళాశాలలు, హాస్టళ్లను తనిఖీ చేశారు. తనిఖీల్లో వంటగది, వంట సామాగ్రి, స్టోరేజ్ ఏరియా, తయారు చేసిన ఫుడ్ ఐటమ్స్, రా మెటీరియల్ తో పాటు పారిశుద్ధ్య నిర్వహణ తదితరాలను ఫుడ్ సేఫ్టీ అధికారులు తనిఖీలు నిర్వహించారు. ఈ నేపథ్యంలో గ్రేటర్ లో 21వ తేదీ నుండి ఇప్పటి వరకు మొత్తం 28 ప్రైవేటు, ప్రభుత్వ రెసిడెన్షియల్ హాస్టళ్లను తనిఖీ చేశారు. ఎల్బీనగర్ జోన్ లో 4 రెసిడెన్షియల్ హాస్టళ్లు, చార్మినార్ 6, ఖైరతాబాద్ 5, శేరిలింగంపల్లి 5, కూకట్ పల్లి 4, సికింద్రాబాద్ జోన్ లో 4 ప్రైవేటు, ప్రభుత్వ రెసిడెన్షియల్ హాస్టళ్లను తనిఖీ చేశారు

# పాతబస్తీ మెట్రో స్థల సేకరణ వేగవంతం

- 1200 ఆస్తుల నుంచి స్థలాల సేకరణ
- 400 ఆస్తుకు నోటీసుల జారీ
- 103 మతపరమైన కట్టడాల గుర్తింపు
- వాటికి ముప్పు కలగకుండా వినూత్నమైన ఇంజనీరింగ్ నైపుణ్యంతో పనులు
- స్థల సేకరణకు 8 నెలల సమయం
- హైదరాబాద్ మెట్రో రైల్ ఎండీ డాక్టర్ ఎన్వీఎస్ రెడ్డి స్పష్టీకరణ



**విశ్వంభర, హైదరాబాద్:** హైదరాబాద్ నగర వాసులకు ఆధునిక మెట్రో రైల్ సేవలను అందుబాటులోకి తెచ్చేందుకు ప్రతిపాదించిన మొదటి దశ మెట్రో రైల్ ప్రాజెక్టులో భాగంగా మిగిలిపోయిన ఎంజీబీఎస్-చాంద్రాయణగుట్ట కారిడార్ పనులకు స్థల సేకరణ వేగవంతం అయినట్లు హైదరాబాద్ మెట్రో రైల్ ఎండీ డాక్టర్ ఎన్వీఎస్ రెడ్డి తెలిపారు. ఎంజీబీఎస్- చాంద్రాయణ గుట్ట మధ్య 7.5 కిలోమీటర్ల పొడవునా ఏర్పాటు చేయనున్న ఈ కారిడార్ నిర్మాణానికి రోడ్డు విస్తరణ, స్టేషన్ల నిర్మాణానికి దాదాపు 1200 ఆస్తులపై ప్రభావం ఉంటుందని ఆయన తెలిపారు. ఇందుకు గాను ఇప్పటికే భూసేకరణ చట్టం కింద 400 ఆస్తులకు సంబంధించిన భూసేకరణ నోటిఫికేషన్లు జారీ చేశామని వెల్లడించారు. జీహెచ్ఎంసీ మాస్టర్ ప్లాన్ ప్రకారం 100 అడుగుల వెడల్పుతో రహదారి విస్తరణ జరుగుతుందని ఆయన చెప్పారు. అయితే స్టేషన్ల వద్ద మాత్రం 120 అడుగుల వెడల్పులో విస్తరణ జరుగుతుందన్నారు. దారుల్షిఫా జంక్షన్ నుండి శాలిబండ జంక్షన్ వరకు ప్రస్తుతం రహదారి వెడల్పు 50 అడుగుల నుండి 60 అడుగుల వరకు, శాలిబండ జంక్షన్ నుండి చాంద్రాయణ గుట్ట జంక్షన్ వరకు 80 అడుగుల వెడల్పు ఉందని తెలిపారు. అందువల్ల దారుల్షిఫా - శాలిబండ మధ్య చాల ఆస్తుల విషయంలో ఒక్కొక్కటి 20 నుండి 25 అడుగుల చొప్పున విస్తరణ చేయాల్సి ఉంటుందని, అలాగే శాలిబండ నుండి చాంద్రాయణగుట్ట మధ్య ఒక్కో ఆస్తి 10 అడుగుల వరకు విస్తరణ చేయాల్సి ఉంటుందని ఆయన స్పష్టం చేసారు. స్టేషన్లు, వంపు అధికంగా ఉన్న ప్రాంతాల్లోని ఆస్తుల విషయంలో మాత్రం రహదారి విస్తరణ కాస్త ఎక్కువగా ఉంటుందనీ వివరించారు.

**రాడార్ డ్రోన్ సర్వే**

సాంప్రదాయంగా వస్తున్న సర్వే పద్ధతులతో పాటు 3డీలో వీక్షించే విధంగా రాడార్ డ్రోన్ సర్వే కూడా చేసినట్టు రెడ్డి వెల్లడించారు. దీని వల్ల ప్రభావితం అయ్యే ఆస్తులతో పాటు చుట్టుపక్కల ఉన్న ఆస్తులను కూడా వీక్షించే అవకాశం ఉన్నట్లు వివరించారు. ప్రభావిత నిర్మాణాల విలువను అంచనా వేసేందుకు హైదరాబాద్ ఎయిర్పోర్ట్ మెట్రో రైల్ లిమిటెడ్ (హెచ్ ఏ ఎం ఎల్) ఇంజినీర్లు, సిబ్బంది క్షేత్ర స్థాయిలో సర్వే నిర్వహిస్తున్నారని ఆయన తెలిపారు. ఈ మెట్రో మార్గం వెంబడి ఉండే 103 మతపరమైన, సున్నితమైన కట్టడాల పరిరక్షణ విషయంలో అదనపు జాగ్రత్తలు తీసుకుంటున్నామని చెప్పారు. ఈ నిర్మాణాలను అత్యాధునికమైన వినూత్న ఇంజినీరింగ్ పద్ధతుల ద్వారా సంరక్షించేలా, పిల్లర్లు, స్టేషన్ల వద్ద జాగ్రత్తగా సర్దుబాటు చేస్తూ కార్యక్రమాన్ని ముందుకు తీసుకెళ్తామని ఎండీ వెల్లడించారు. ప్రభావిత ఆస్తులకు సంబంధించిన యజమానులు హెచ్ఏఎంఎల్ భూ సేకరణ అధికారి కార్యాలయం వద్ద నిర్దిష్ట గడువులోగా తమ అభ్యంతరాలు దాఖలు చేయవచ్చని, వివరాలు పొందవచ్చని ఆయన చెప్పారు. భూ సేకరణ చట్టం అనుసరించి చేపడుతున్న ఈ భూసేకరణ కార్యక్రమం 8 నెలల్లో పూర్తి కావచ్చని ఎండీ రెడ్డి వెల్లడించారు.

# మూగ జీవుల రోదన మీకు పట్టదా?

(మొదటి పేజీ తరువాయి)

పేర్కొన్నారు పశువైద్యశాలల్లో 9 నెలలుగా మందుల కొరత ఉందని తెలిపారు. సకాలంలో వైద్యం అందక పశువులు చనిపోతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. పశువైద్యశాలల్లో మందుల కొరతపై శుక్రవారం ఈ మేరకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి ఆయన లేఖ రాశారు. పశువైద్య సంచార వాహన సేవల్లో అంతరాయంపై ఆ లేఖలో వివరించారు. పశుసంవర్ధక శాఖ మీవద్దే వద్దే ఉన్నప్పటికీ మూగజీవాల మౌనరోదనను మాత్రం పట్టించుకోవడం లేదని వ్యాఖ్యానించారు. రాష్ట్రంలో ఆవులు, గేదెలు, గొర్రెలు, మేకలకు వ్యాధులు సోకితే తగిన వైద్యం అందించేందుకు ప్రభుత్వ పశువైద్యశాలల్లో మందులు లేని దుస్థితి నెలకొందని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎమర్జెన్సీ మందులు సహా పెయిన్ కిల్లర్స్, విటమిన్స్, యాంటీ బయాటిక్స్ వంటి అన్ని రకాల మందుల సరఫరా తొమ్మిది నెలలుగా నిలిచిపోయిందని మండిపడ్డారు.

**మందుల కొరత కారణంగా మూగజీవాల మృత్యువాత ..**

పాలిచ్చే జీవులకు పొదుగు వాపు, గాలి కుంటు వ్యాధులు సోకితే ఒక్కో మూగ జీవిపై పాడి రైతులు రూ.2 వేల దాకా ఖర్చు చేయాల్సి వస్తున్నదని హరీశ్‌రావు వాపోయారు. ఇది వారికి అదనపు ఆ ర్థిక భారమవుతున్నదని పేర్కొన్నారు. 9 నెలల నుంచి నట్టల నివారణ మందులు సరఫరా చేయకపోవడంతో కాలేయం, జీర్ణాశయం, చిన్నపేగు భాగాల్లో పరాన్న జీవులు చేరి రక్తహీనతకు గురి చేస్తున్నాయని తెలిపారు. దీని వల్ల రోగ నిరోధకశక్తి తగ్గి మూగజీవాలు బలహీనంగా మారుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. దీంతో వ్యాధుల బారిన పడ్డ జీవులు ఆసుపత్రుల్లో మందుల కొరత కారణంగా సకాలంలో వైద్యం అందక మృత్యువాత పడుతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. పశువైద్యశాలల్లో మందులు లేకపోవడంతో మూగజీవాలకు చికిత్స అందించలేకపోతున్నామని, తప్పనిసరి పరిస్థితిలో మందులు బయట కొనుగోలు చేసుకోవాలని సూచిస్తున్నట్లు వెటర్నరీ డాక్టర్లు సైతం ఆవేదన వ్యక్తం చేస్తున్నారని హరీశ్‌రావు తెలిపారు. అనారోగ్యం పాలైన మూగజీవాల వద్దకే వైద్య సిబ్బంది వచ్చి తక్షణ చికిత్స అందించేందుకుగాను 1962 నంబర్ తో పశువైద్య సంచార వాహనాలను తమ ప్రభుత్వం ఏర్పాటు చేసిందని గుర్తుచేశారు. అధికారంలోకి వచ్చిన నాటి నుంచి ఇప్పటి వరకు మంత్రులుగాని, ఉన్నతాధికారులు గానీ ఒక్కసారి కూడా సమీక్ష నిర్వహించకపోవడం మూగజీవుల సంరక్షణ పట్ల రాష్ట్ర ప్రభుత్వానికి ఉన్న చిత్తశుద్ధిని నిరూపిస్తున్నదని మండిపడ్డారు.



# కుర్చీలోనే మహిళ ప్రసవం!

**విశ్వంభర , నల్గొండ:** ఆసుపత్రికి వెళ్లిన మహిళ కుర్చీలోనే ప్రసవించిన ఉదంతమిది. నల్గొండ జిల్లా నేరేడుగొమ్మ మండలానికి చెందిన అశ్విని తన భర్తతో కలిసి గురువారం రాత్రి 10 గంటల సమయంలో మూడో కాన్పు కోసం దేవరకొండ ప్రభుత్వాసుపత్రికి వెళ్లింది. అక్కడి సిబ్బంది వైద్యులు అందుబాటులో లేరని, జిల్లా ఆస్పత్రికి వెళ్లాలని సిఫార్సు చేశారు. అక్కడ నుంచి అర్ధరాత్రి అంబులెన్స్‌లో నల్గొండలోని మాతా శిశు ఆరోగ్య కేంద్రానికి వచ్చింది. పరీక్షించిన వైద్యులు ప్రసవానికి ఇంకా సమయం పడుతుందని చెప్పారు. ఈ క్రమంలో పురిటి నొప్పులు వచ్చి బయట కుర్చీలోనే కూర్చుని శిశువుకు జన్మనిచ్చింది. గమనించిన సిబ్బంది ఆమెను వార్డులోకి తీసుకెళ్లి చికిత్స అందించారు. ఘటనపై జిల్లా అదనపు కలెక్టర్ పూర్ణచందర్ విచారణ చేపట్టారు. ఈ ఘటన పై విచారణ చేపట్టామని అనంతరం బాధితులపై చర్యలు తీసుకుంటామని నల్గొండ జిల్లా అదనపు కలెక్టర్ పూర్ణచందర్ చెప్పారు. వైద్యుల తీరుపై కుటుంబసభ్యుల మండిపాటు : దేవరకొండ ప్రభుత్వ ఆస్పత్రికి తీసుకెళ్లగా అక్కడ వైద్య సిబ్బంది నిర్లక్ష్యంగా వ్యవహరించారని, నల్గొండ వస్తే ఇక్కడి వైద్యులు కూడా నిర్లక్ష్యంగానే ఉన్నారని కుటుంబసభ్యులు ఆగ్రహం వ్యక్తం చేశారు. వైద్యుల తీరుపై మండిపడ్డారు. ప్రభుత్వ ఆస్పత్రికి వచ్చే వారికి మెరుగైన వైద్యం అందించాలని బాధితులు కోరుతున్నారు.

# ఆ గ్యాంగ్ మాటలు నమ్మితే నిండా ముంచేస్తారు

- డబుల్ బెడ్‌రూం ఇళ్ల పేరుతో రూ.1.29 కోట్లు దోచేశారు
- రాచకొండ సీపీ సుధీర్‌బాబు వెల్లడి

**విశ్వంభర , తెలంగాణ బ్యూరో:** ప్రభుత్వ పెద్దల అండదండలు ఉన్నాయని.. రెండు పడక గదుల ఇళ్లను మంజూరు చేస్తామని, సర్కారు ఉద్యోగులకు పదోన్నతలు కల్పిస్తామని, ప్రభుత్వ ఉద్యోగాలు ఇప్పిస్తామని చెబుతూ పలువురిని నిలువునా మోసం చేసిన ఆరుగురు సభ్యుల ఘరానా ముఠాను రాచకొండ ఎస్వోటీ, కీసర పోలీసులు అరెస్టు చేశారు. ముఠా సభ్యులు మాయ మాటలతో పలువురిని మభ్య పెట్టి ఏకంగా 1.29 కోట్ల రూపాయలు దండుకున్నారు. నిందితులు మూడు రకాల నేరాలకు పాల్పడి 108 మందిని మోసం చేసినట్టు పోలీసుల దర్యాప్తులో తేలింది. ఈ కేసులో కుషాయిగూడకు చెందిన సురేందర్‌రెడ్డి మోసాలకు తెర తీసినట్టు రాచకొండ పోలీసు కమిషనర్ సుధీర్‌బాబు తెలిపారు. ముఠాలోని అనుగు హర్షిణి రెడ్డి తాను ఆర్డీఓ అంటూ.. రెండు పడక గదుల ఇళ్లు కేటాయిస్తానని పలువురిని నమ్మించిందని ఆయన చెప్పారు. ఈ విధంగా 98 మంది వద్ద డబ్బులు వసూలు చేశారు. ఇళ్లు ఇవ్వడంలో జాప్యం జరగడంతో బాధితులు వారిని ప్రశ్నించగా, ఎన్నికలు వచ్చినందున కోడ్ అమల్లో ఉందని అందుకే జాప్యం జరుగుతోందని ముఠా సభ్యులు వెల్లడించినట్టు పోలీసులు తెలిపారు.

**తీగ లాగితే డొంక కదలింది**

కొందరికి రెండు పడక గదులు కేటాయించినట్టు నకిలీ మంజూరు పత్రాలు కూడా నిందితులు అందజేశారు. మరోవైపు సీఎం రేవంత్‌రెడ్డి సలహాదారుడు వేం నరేందర్‌రెడ్డితో తనకు బాగా పరిచయముందని చెబుతూ ప్రభుత్వ ఉద్యోగాలు సులభంగా ఇప్పిస్తానని ప్రధాన నిందితులు సురేందర్‌రెడ్డి పలువురిని నమ్మించి రూ.18.5 లక్షలు దండుకున్నట్టు సీపీ సుధీర్‌బాబు మీడియా సమావేశంలో తెలిపారు. దీంతో పాటు నిందితులను మరికొందరు ప్రభుత్వ ఉద్యోగులు తమను బదిలీ చేయాలని సంప్రదించారు. వారి వద్ద నుంచి 7 లక్షల రూపాయలు నిందితులు స్వాహా చేశారు. ప్రధాన నిందితుడు సురేందర్‌రెడ్డి దాదాపు కోటి రూపాయలతో క్రికెట్ బెట్టింగ్ నిర్వహించినట్టు సీపీ వివరించారు. అయితే గురుకులాల కార్యదర్శికి నిందితుల విషయం తెలిసింది. వీరు మోసం చేస్తున్నారని కార్యదర్శికి అనుమానం రావడంతో పోలీసులకు సమాచారం ఇవ్వగా తీగ లాగితే డొంక కదలింది. ముఠా ఆగడాలు మొత్తం బయటపడ్డాయి. నిందితుల్లో ఇద్దరు మహిళలు కూడా ఉండడం గమనార్హం. ఆరుగురిని అరెస్టు చేసిన పోలీసులు వారి వద్ద నుంచి 98 నకిలీ రెండు పడక గదుల మంజూరు పత్రాలు, ఆర్డీఓ నకిలీ రబ్బరు స్టాంపులు, రూ.1.97 లక్షలు స్వాధీనం చేసుకున్నారు.

# వృద్ధాప్యంలో చక్కటి నేస్తం కల్చరల్ సెంటర్

- మాససిక ఒత్తిళ్లు దూరం చేసేవి ఇలాంటి కేంద్రాలే
- మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి



**విశ్వంభర, హైదరాబాద్:** ఎన్ని ఆస్తిపాస్తులున్నా వృద్ధాప్యంలో వయోవృద్ధులకు చక్కని నేస్తం ఎంపీ ఎమ్మెల్యే కాలనీలో ఏర్పాటు చేసిన కల్చర్ సెంటరని మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి వ్యాఖ్యానించారు. సమాజంలో పెరిగిపోతున్న మానసిక ఒత్తిళ్లు, యాంత్రిక జీవనానికి పరిష్కారం చూపించేవి ఇలాంటి కల్చరల్ సెంటర్లేనని అన్నారు. రోడ్ నెంబర్ -10, జూబ్లీహిల్స్ లోని ఎంపీ, ఎమ్మెల్యే కాలనీ కల్చరల్‌సెంటర్ ను ఆయన శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ఆనాడు కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన 3 ఎకరాల్లోనే ఇంతటి అద్భుతమైన కల్చరల్ సెంటర్ భవనాన్ని నిర్మించుకోవడం చాలా సంతోషాన్ని కలిగిస్తుందన్నారు. సమాజంలో చిన్న కుటుంబాలు పెరిగాక ఆత్మహత్యల శాతం పెరుగుతుందని, తెలుగు సినిమా పరిశ్రమలో మంచి నటుడిగా పేరు సంపాదించుకున్న నటుడు రంగనాథ్ ఆత్మహత్య ఇందుకు ప్రధాన ఉదాహరణ అని ఆయన అన్నారు. ఆయనకు జీవితాంతం బతకడానికి సరిపడేంత డబ్బు, ఆస్తులున్నా, పిల్లలు విదేశాల్లో స్థిరపడినా, వృద్ధాప్యంలో ఆయన బాగోగులు చూసుకునే వారు దగ్గర లేక ఒంటరితనంతో ఆత్మహత్య చేసుకున్నారని, ఇది అత్యంత బాధ కలిగించిందని ఆయన అన్నారు. ఒంటరితనం వల్ల ఇబ్బందులుపడుతున్న పెద్ద వయసువారికి ఇలాంటి కల్చరల్ సెంటర్లు ఒక మార్గం చూపించాలని ఆయన ఆకాంక్షించారు. ఈ కల్చరల్ సెంటర్ కు సంబంధించి ప్రభుత్వం తరపున ఎదైనా మౌలిక సదుపాయలు అవసరం ఉంటే జీహెచ్ఎంసి అధికారులతో మాట్లాడి అవసరం మేరకు వసతులు కల్పిస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న కథానాయకుడు, పద్మవిభూషణ్ చిరంజీవికి హార్ధిక జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు. చిరంజీవి మరింత ఉన్నత స్థానానికి చేరుకోవాలని మంత్రి కోమటిరెడ్డి ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర అటవీశాఖ మంత్రి కొండా సురేఖ,, ఎంపీ మల్లురవి, ఎమ్మెల్యే దానం నాగేందర్, మాజీ ఎంపీ రంజిత్ రెడ్డి, మాజీమంత్రి ఇనుగాల పెద్దిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# జైలులో నన్ను చిత్ర హింసలు పెట్టారు

**విశ్వంభర, తెలంగాణ బ్యూరో:** జైల్లో తనను చిత్రహింసలు పెట్టారని దిల్లీ యూనివర్సిటీ మాజీ ప్రొఫెసర్ సాయిబాబు చెప్పారు . జైలు నుంచి బయటికి వచ్చిన 5 నెలల తర్వాత సాయిబాబా శుక్రవారం మీడియాతో మాట్లాడారు. 10 ఏళ్ల తర్వాత తాను స్వేచ్ఛగా తెలంగాణలో మాట్లాడుతున్నానని చెప్పారు. దిల్లీలో కిడ్నాప్ చేసి అక్రమంగా అరెస్టు చేశారని చెప్పారు. వికలాంగుడని కూడా చూడకుండా జైల్లో తనను చిత్ర హింసలు పెట్టారని చెప్పారు. తనకు 21 రకాల ఆరోగ్య సమస్యలు ఉన్నాయన్నారు. జైల్లో అండా సెల్ లో ప్రత్యేకమైన ఒక రూమ్ లో నిర్బంధించి వీల్ ఛైర్ కూడా ఇవ్వలేదన్నారు అమ్మ చనిపోయినా అంత్యక్రియలకు కూడా అనుమతివ్వలేదన్నారు. తనకు కోర్టులు కూడా న్యాయం చేయలేదని ఆవేదన వ్యక్తం చేశారు. నార్త్ ఇండియన్ జైల్లో కుల వ్యవస్థ విచ్చలవిడిగా ఉందన్నారు. కులాన్ని చూసి జాబ్ ఇస్తారని చెప్పారు. జైల్ మ్యాన్యువల్ లో కులాన్ని బట్టి పని ఇస్తారని చెప్పారు. మావోయిస్టులతో సంబంధం ఉందన్న కేసులో జైలు శిక్ష అనుభవించిన మాజీ ప్రొఫెసర్ సాయిబాబా 2024 మార్చి7 న నాగ్ పూర్ జైలు నుంచి విడుదలయ్యారు. నక్సలైట్లతో చేతులు కలిపి ప్రభుత్వానికి వ్యతిరేకంగా పోరాటం చేస్తున్నారని 2014లో మహారాష్ట్ర పోలీసులు ఆయనని అరెస్ట్ చేశారు. ఆయనతో పాటు మరో ఆరుగురికి 2017లో గడ్చిరోలి సెషన్స్ కోర్టు జీవిత ఖైదు విధించింది. అప్పటి నుంచి వీల్ ఛైర్ కి పరిమితమైన సాయిబాబా జైలులోనే శిక్షను అనుభవించారు. సుప్రీం కోర్టు ఆదేశంతో నాగ్ పూర్ హైకోర్టు ఈ కేసును విచారించి సాయిబాబా నిర్దోషి అని తేల్చి చెప్పింది. ఆయన్ని వెంటనే విడుదల చేయాలని మార్చి 5న 2024న తీర్పు ఇచ్చింది.

# మహిళా జర్నలిస్టుల పై దాడి చేసిన వారిపై కఠినమైన చర్యలు తీసుకోవాలి

## డీజీపీని కోరిన టీయూడబ్ల్యూజే

**విశ్వంభర, హైదరాబాద్:** నాగర్ కర్నూల్ జిల్లా కొండారెడ్డి పల్లి, వెల్దండ గ్రామాల్లో గురువారం మహిళా జర్నలిస్టులు సరితా, విజయ రెడ్డిల పై దాడి చేసి కెమెరాలు, సెల్ ఫోన్లు లాక్కొని, పోలీసు స్టేషన్ లోనే దాడికి యత్నించిన వారిపై చట్టపరంగా కఠిన చర్యలు తీసుకోవాలని రాష్ట్ర డీజీపీ జితేందర్ ను కలిసి ఫిర్యాదు చేసినట్లు టీయూడబ్ల్యూజే ప్రకటించింది. రుణమాఫీ పై గ్రౌండ్ రిపోర్టుకు వెళ్లిన మహిళాజర్నలిస్టుల పట్ల కొందరు వ్యక్తులు ప్రవర్తించిన తీరు సభ్యసమాజం తలదించుకునేలా ఉందని వివరించామని టీయూడబ్ల్యూజే నేతలు తెలిపారు. ఇలాంటి చర్యలు పునరావృతం కాకుండా చర్యలు తీసుకోవాలని, రాష్ట్రంలో పత్రికా స్వేచ్ఛను కాపాడాలని కోరామన్నారు. ఈ అంశంపై స్పందించిన డీజీపీ జితేందర్ ఇలాంటి సంఘటనలను ఉపేక్షించేదిలేదని, చట్టపరంగా కఠిన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారని నేతలు తెలిపారు. డీజీపీని కలిసిన వారిలో తీ టీయుడబ్ల్యూజే రాష్ట్ర ఉపాధ్యక్షులు ఎ.రమణ కుమార్, హైదరాబాద్ ప్రధాన కార్యదర్శి యార నవీన్ కుమార్, ఐజేయు సభ్యుడు అవ్వారి భాస్కర్, మహిళా జర్నలిస్టులు సరితా, విజయ రెడ్డి, పలువురు జర్నలిస్టు సంఘం నాయకులు ఉన్నారు.



# సంక్షేమ ఫలాలు ప్రతిఒక్కరికీ అందించే భాధ్యత అదికారులదే

## - శాసన సభ సభాపతి గడ్డం ప్రసాద్




**విశ్వంభర,వికారాబాద్:** కలెక్టరేట్ లోని సమావేశ మందిరంలో తెలంగాణ హక్కుల రికార్డు బిల్లు-2024 ముసాయిదా బిల్లు, ఎల్ఆర్ఎస్ పై అవగాహన కార్యక్రమంతో పాటు జిల్లాలో చేపడుతున్న సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలపై సమీక్ష నిర్వహించారు స్పీకర్ గడ్డం ప్రసాద్. ఈ సందర్భంగా అధికారులను ఉద్దేశించి సభాపతి మాట్లాడుతూ... సామాన్య ప్రజానిక సమస్యల పరిష్కారానికి ప్రజా ప్రతినిధులు, అధికారులు స్నేహపూర్వకంగా, సమన్వయంతో, కలిసికట్టుగా పనిచేసి జిల్లా అభివృద్ధికి కృషి చేయాలని అన్నారు. ప్రజా ప్రతినిధులు, అధికారులు రెండు కళ్ళల్లాగా ఉండి ప్రజలకు సేవలు అందించాలని తెలిపారు. రాబోయే ఐదు సంవత్సరాలలో జిల్లా ఎంతగానో అభివృద్ధి దిశగా వెళ్తుందని ఆయన తెలిపారు. జిల్లాలో పరిశ్రమలు, విద్యారంగా అభివృద్ధితో పాటు 400 కోట్ల నిధులతో అనంతగిరిని పర్యాటక కేంద్రంగా అభివృద్ధి చేసేందుకు ప్రభుత్వం రూపకల్పన జరిగిందని తెలిపారు. రాష్ట్రం ఎంతో ఆర్థిక సంక్షోభంలో ఉన్నప్పటికీ ఉద్యోగులకు ప్రతినెల క్రమం తప్పకుండా జీతాలు చెల్లించడం జరుగుతుందని ఆయన అన్నారు. జిల్లాలో వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో వ్యవసాయం, ఆరోగ్యానికి అధిక ప్రాధాన్యత కల్పించాలని సభాపతి తెలిపారు. వర్షాల వల్ల పంట నష్టం జరిగినట్లయితే నివేదిక సమర్పించాలని అధికారులకు సూచించారు. ప్రతి నెల ముఖ్యమైన శాఖలపై సమీక్షలు నిర్వహించడం జరుగుతుందని ఆయన ఈ సందర్భంగా తెలిపారు. గతంలో ధరణి ద్వారా ఎంతో మంది రైతులు ఇబ్బందులకు గురయ్యారన్నారు. భూముల సమస్యలను సత్వర పరిష్కారానికి భూమాత చట్టాన్ని తీసుకువస్తున్నట్లు సభాపతి తెలిపారు. భూమాత చట్టమును పటిష్టంగా నిర్వహించేందుకు ప్రజాప్రతినిధులు, అధికారులు, మేధావి వర్గం, న్యాయవాదులు, స్వచ్ఛంద సంస్థల సలహాలను పరిగణనలోకి తీసుకుని భూమాత చట్టం ద్వారా భూముల సమస్యలను పరిష్కరించేందుకు చర్యలు చేపడతామన్నారు. సమస్యల పరిష్కార నిమిత్తం కోర్టుల చుట్టూ తిరుగకుండా కింది స్థాయిలోనే సమస్యలను పరిష్కార దిశగా భూమాత ద్వారా సాధ్యమవుతుందని ఆయన అన్నారు. 2014 కంటే ముందు వున్న సాదా బైనమా సమస్యలను పరిష్కరించే అవకాశం ఉందని ఆయన తెలిపారు. జిల్లాలో చేపడుతున్న నిర్మాణ పనులను వేగవంతం చేయాలని సభాపతి తెలిపారు. వర్షాకాలంలో చెరువులు, కుంటలు ఎన్ని నిండాయి, ఎన్ని ఎకరాలకు సాగునీరు ఇవ్వగలుతామో క్షేత్ర స్థాయిలో పర్యటించి నివేదికలను సమర్పించాలని స్పీకర్ అధికారులను ఆదేశించారు. పశు సంపదను సంరక్షించుకునే బాధ్యతలో భాగంగా పశువులకు వాక్సినేషన్ కు చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారికి సూచించారు. గురుకుల పాఠశాలలు, అమ్మ ఆదర్శ పాఠశాలలు, ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ సంక్షేమ వసతి గృహాల్లో మౌలిక సదుపాయాలు కల్పించేందుకు చర్యలు చేపట్టాలన్నారు. ప్రజలకు మంచి నీటిని సమృద్ధిగా అందేలా, స్వచ్ఛమైన నీటిని అందేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు. కాగ్నా నది ద్వార మంచి నీరును అందించే దిశగా మిషన్ భగీరథ, జిల్లా పంచాయతీ అధికారులు సమన్వయంతో పనిచేయాలని అధికారులకు సూచించారు. వైద్య ఆరోగ్య, వి ద్యుత్తు, మైనింగ్, అమ్మ ఆదర్శ పాఠశాలలో చేపడుతున్న పనులు, ఆర్ అండ్ బి, పంచాయతీరాజ్ శాఖలకు సంబంధించిన పనులపై సమీక్షించారు. అవగాహణ, సమీక్షా కార్యక్ర మంలో పార్లమెంటరీ సభ్యులు కొండా విశ్వేశ్వర్ రెడ్డి, జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్, జిల్లా ఎస్పీ కే.నారాయణ రెడ్డి, శాసనమండలిసభ్యులు పట్నం మహేందర్‌రెడ్డి, పరిగి, తాండూర్, చేవెళ్ల శాసనసభ్యులు రామ్మో హన్ రెడ్డి, బుయ్యాని మనోహర్ రెడ్డి, కాలేయాదయ్య, అదనపు కలెక్టర్లు లింగ్యానాయక్, సుధీర్,అసిస్టెంట్ కలెక్టర్ ఉమా హారతి, మున్సిపల్‌కమిషనర్లు మంజులరమేష్, స్వప్నపరిమల్, కమిషనర్లు,తహసీల్దార్లు, ఎంపీడీవో లు పాల్గొన్నారు.

# తెలంగాణ ఎన్జీవో భవనంలో టీఈజేఏసీ స్టీరింగ్ కమిటీ సమావేశం




**విశ్వంభర, హైదరాబాద్:** హైదరాబాద్ నాంపల్లి తెలంగాణ ఎన్జీవో కేంద్ర సంఘ భవనంలో తెలంగాణ ఉద్యోగుల జేఏసీ స్టీరింగ్ కమిటీ 27 మంది సభ్యులతో ఏర్పడింది. ఉద్యోగ సంఘాల జేఏసీ చైర్మన్ శ్రీ మారం జగదీశ్వర్ అధ్యక్షతన మరియు సెక్రటరీ జనరల్ శ్రీ ఏలూరు శ్రీనివాసరావు నేతృత్వంలో టీఈజేఏసీ స్టీరింగ్ కమిటీ సమావేశం శుక్రవారం జరిగింది. టీఈజేఏసీ స్టీరింగ్ కమిటీ తీర్మానాలను ప్రవేశపెట్టారు. అవి సెప్టెంబర్ ఒకటిన పెన్షన్ విద్రోహ దినంగా ప్రకటించింది. కనుక సెప్టెంబర్ ఒకటిన రాష్ట్ర ఉద్యోగుల జేఏసీ ఆధ్వర్యంలో ఉదయం 11 గంటలకు అమరవీరుల స్థూపం వద్ద, జిల్లా కేంద్రాల్లో జిల్లా జేఏసీ ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమాలు నిర్వహించడానికి నిర్ణయించింది. ఉద్యోగుల జేఏసీ ఆధ్వర్యంలో సెప్టెంబర్ 6న ఉదయం.9 గంటల నుండి 1 గంట వరకు ప్రొఫెసర్ కోదండ రామ్ కు అభినందన సభ రవీంద్ర భారతిలో జరిపేందుకు నిర్ణయించింది. మహిళలపై జరుగుతున్న హత్యాచారలకు నిరసనగా సెప్టెంబరులో నిరసన కార్యక్రమాలు నిర్వహించాలని నిర్ణయించింది. టీఈజేఏసీ స్టీరింగ్ కమిటీ సమావేశంలో ఈ తీర్మణాలను చేసింది. ఈసందర్భంగా జేఏసీ చైర్మన్ మారం జగదీశ్వర్ మాట్లాడుతూ శుక్రవారం జేఏసీ లో 27 సంఘాలతో స్టీరింగ్ కమిటీ ఏర్పాటు చేసుకున్నామని, అన్ని సమస్యల పరిష్కారం కోసం జేఏసీ ఏర్పాటు చేస్తున్నామని, అనేక సమస్యలు పెండింగ్‌లో ఉన్నాయని, గత ప్రభుత్వంలో మూడు డీఏలు పెండింగ్ లో ఉన్నాయని అన్నారు. కొత్తగా వచ్చిన ప్రభుత్వం అందరికీ దశల వారీగా మూడు డీఏలు ఇస్తున్నారని తెలిపారు. ఇప్పటి వరకు నాలుగు డీఏ లు పెండింగ్‌లో ఉన్నాయని, వాటిని ప్రభుత్వం వెంటనే విడుదల చేయాలని కోరారు. సీపీఎస్ తొలగిస్తామని మనిఫెస్టిలో పెట్టారు. అమలు దిశగా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

# అర్హులైన రైతులందరికీ రుణమాఫీ

## - ఏడీఏ శ్రీలక్ష్మి



**విశ్వంభర, చింతపల్లి:** చింతపల్లి మండల కేంద్రంలో వున్న ప్రాథమిక సహకార కేంద్రం (పీఏసీఎస్), ఎస్బీఐ బ్యాంక్‌లను సందర్శించిన డివిజన్ సహాయ వ్యవసాయ సంచాలకులు శ్రీలక్ష్మి సంబంధిత అధికారులను రైతుల రుణమాఫీ, రెన్యువల్స్ గురించి వివరాలు అడిగి తెలుసుకున్నారు. రైతులను ఉద్దేశించి రెండు లక్షల రుణాలు దాటిన రైతులదరికి రుణమాఫీ జరుగుతుందని దానికి సంబందించిన నిబంధనలు ప్రభుత్వం నుండి త్వరలో వస్తాయని తెలిపారు. రైతులకు రుణమాఫీకి సంబంచిన ఏమైనా సందేహాలు వుంటే మండల వ్యవసాయ అధికారికి దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఈ సందర్భంగా ఆమె చింతపల్లి రైతు వేదికను సందర్శించారు. మండలంలో రైతులకు సరిపడ ఎరువులు అందుబాటులో ఉన్నాయని వారు రైతులకు సూచించారు. ఆమె వెంట మండల వ్యవసాయ అధికారిని శ్రావణ కుమారి, ఏఈఓ మౌనిక, ఎస్బీఐ బ్యాంక్ మేనేజర్, పీఏసీఎస్ సీఈవో ఉన్నారు.

# జూబ్లీహిల్స్ పాస్టర్స్ ఫెలోషిప్

## నూతన కమిటి ఎన్నిక



**విశ్వంభర, బషీర్ బాగ్:** జూబ్లీహిల్స్ పాస్టర్స్ ఫెలోషిప్ నూతన కమిటీని శుక్రవారం జరిగిన సమావేశంలో ఎన్నుకున్నట్లు ఫౌండర్ కృపాసన్నిధి తెలిపారు. జూబ్లీహిల్స్ పాస్టర్స్ ఫెలోషిప్ ప్రెసిడెంట్ గా కే.ఎం. ఆంధ్రూపాల్, జనరల్ సెక్రెటరీ స్వామిదాసు, కోశాధికారి ఎన్. సత్యానందం, వైస్ ప్రెసిడెంట్స్ గా పీ.మోజెస్, టీ.ప్రభాకర్, ఎన్ శ్రీనివాస్, నేహెమ్యా రాజు, సీహెచ్ ఫరంజ్యోతి, జాయింట్ సెక్రెటరీ కే. వినోద్ కుమార్, వీ. ఆశీర్వాదం, టీ. చంద్రయ్య, సామెల్ లు ఎన్నికయ్యారని తెలిపారు. ఈ సందర్భంగా ప్రెసిడెంట్ గా కే.ఎం. ఆంధ్రూపాల్, జనరల్ సెక్రెటరీ స్వామిదాసు లు మాట్లాడుతూ ఫాస్టర్స్ ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి నిరంతరం కృషి చేస్తామని అన్నారు. పాస్టర్ల పై జరుగుతున్న దాడులను అరికట్టేలా ప్రభుత్వం పటిష్ట చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు.

# తెలంగాణ ఆర్థిక దృక్పథం 2024 పుస్తకం ఆవిష్కరణ



**విశ్వంభర, భూపాలపల్లి:** ఆర్థిక వృద్ధి, సామాజిక అభివృద్ధి, కీలక ఆర్థిక సూచికలను క్రోడీకరించి ఆర్థిక వ్యవస్థలోని వివిధ రంగాలలో మన రాష్ట్రం ఎలా పురోగమిస్తోందో తెలంగాణ సామాజిక ఆర్థిక దృక్పథం 2024 తెలియచేస్తుందని జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ తెలిపారు. శుక్రవారం కలెక్టర్ ఛాంబర్‌లో ముఖ్య ప్రణాళిక శాఖ ఆధ్వర్యంలో తెలంగాణ సామాజిక ఆర్థిక దృక్పథం 2024 పుస్తకాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఈ పుస్తకంలో అభివృద్ధి, సంక్షేమానికి సంబంధించిన సమగ్ర సమాచారం పొందుపరిచినట్లు పేర్కొన్నారు. వ్యవసాయం, ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ, ఫార్మాస్యూటికల్స్‌తో సహా విభిన్న రంగాల ద్వారా రాష్ట్ర ఆర్థిక స్థితిని, రాష్ట్రం యొక్క వ్యూహాత్మక స్థానం, నైపుణ్యం కలిగిన శ్రామికశక్తి, సహాయక విధానాలు గణనీయమైన పెట్టుబడులు, ఆర్థిక వృద్ధి, ఉపాధి అవకాశాలను తెలియ చేస్తూ ప్రణాళికా శాఖ ఈ పుస్తకాన్ని తయారు చేసినట్లు ఆయన తెలిపారు. ప్రభుత్వ ఉద్యోగాలు సాధనలో వివిధ పోటీ పరీక్షలకు సన్నద్ధం అయ్యే అభ్యర్థులకు ఈ పుస్తకం చాలా ఉపయోగ పడుతుందని అన్నారు. సమగ్ర సమాచారంతో పుస్తక రూపకల్పనలో భాగస్వాములైన అన్ని విభాగాల అధికారులను, సిబ్బందిని కలెక్టర్ అభినందించారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ వెంకటేశ్వర్లు, ముఖ్య ప్రణాళిక అధికారి శామ్యూల్, గణాంక అధికారి బీ.జవహర్ లాల్, ఉప గణాంక అధికారులు కే.అలివేలు, కే.వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

# నూతన వధూవరులను ఆశీర్వదించిన బీఆర్ఎస్ నాయకులు



**విశ్వంభర,చింతపల్లి:** చింతపల్లి మండలం మాల్ ఎస్వీఆర్ గార్డెన్స్ లో జరిగిన వింజమూరు గ్రామానికి చెందిన బీఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు ముద్దం వెంకటరమణ సావిత్రి కుమార్తె ముద్దం మౌనిక వివాహానికి బీఆర్ఎస్ పార్టీ చింతపల్లి మండల సహాయ కార్యదర్శి దండేటికార్ ప్రసాద్ హాజరై నూతన వధూవరులను ఆశీర్వదించారు. ఆయన వెంట బీఆర్ఎస్ పార్టీ నాయకులు పందుల సత్తయ్య, దండేటికార్ నర్సింగ్, ఆరెకంటి రాధాకృష్ణ, కంటాల శ్రీనివాస్, ఏర్పుల జంగయ్య, నిమ్మ శంకరయ్య, సీత ఎల్లయ్య, ఆరేకంటి జగన్, బీఆర్ఎస్వీ అధ్యక్షులు ఆరెకంటి మురళి, మల్లం కృష్ణయ్య పాల్గొన్నారు.

# దొంగిలించిన సెల్ ఫోన్‌లను బాధితులకు అందజేసిన డీసీపీ



**విశ్వంభర, కుత్బుల్లాపూర్:** మేడ్చల్ జిల్లా కుత్బుల్లాపూర్ నియోజక వర్గం పేట్ బషీరాబాద్ లో మేడ్చల్ డీసీపీ మీడియా సమావేశం నిర్వహించారు. మేడ్చల్ జోన్ లోని పలు పోలీస్ స్టేషన్ల పరిధిలో గత మూడు నెలలుగా పలు కారణాల వల్ల పోగొట్టుకున్న చరవాణిలను సీఈఐఆర్(సెంట్రల్ ఎక్వీప్ మెంట్ ఐడెంటిటీ పోర్టల్) పోర్టల్ సహాయంతో ట్రేస్ చేసి, 130 సెల్ ఫోన్ల ను రికవరీ చేసారు. సెల్ పోన్లు పోయిన వారు పోలీస్ స్టేషన్లలో చేసిన పిర్యాదు మేరకు బాధితులను స్టేషన్ కు రప్పించి వారి ఫోన్లను వారికి అందించారు. వివిధ కారణాలతో సెల్ ఫోన్లు పోగొట్టుకున్న వారు స్థానిక పోలీస్ స్టేషన్ల లో పిర్యాదు చేయడం వల్ల తిరిగి వారి ఫోన్లను పొందే అవకాశం ఉంటుందని డీసీపీ తెలిపారు. పోగొట్టుకున్న విలువైన పోన్లు తిరిగి తమకు అందడం, అందులోని సమాచారం లభించడం సెల్ పోన్ల బాధితులు పోలీసులకు కృతజ్ఞతలు తెలిపారు.

# క్రీడలతోనే మానసిక ఉల్లాసం లభిస్తుంది

## - ఎమ్మెల్యే బాలునాయక్



**విశ్వంభర చింతపల్లి:** చింతపల్లి మండలం కుర్మపల్లి జెడ్పీహెచ్ఎస్ పాఠశాలలో జరిగిన 68వ మండల స్థాయి ఎస్జీఎఫ్ క్రీడా పోటీల ప్రారంభోత్సవ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా దేవరకొండ ఎమ్మెల్యే నేనావత్ బాలునాయక్ హాజరై జ్యోతి ప్రజ్వలన చేసి మండల స్థాయి ఎస్జీఎఫ్ క్రీడా పోటీలను ప్రారంభించారు. పాఠశాల ఉపాధ్యాయ బృందం ఎమ్మెల్యేను శాలువాతో సత్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ క్రీడా పోటీల్లో పాల్గొనడం వల్ల స్నేహభావం పెంపొందుతుందని తెలిపారు. క్రీడలు దేహదారుఢ్యానికి దోహదం చేస్తాయని, ప్రతి క్రీడాకారుడు క్రీడా స్ఫూర్తితో ఆడి, గెలుపోటములను సమానంగా స్వీకరించాలని ఆయన తెలిపారు. ఓటమి గెలుపునకు నాంది పలుకుతుందని గుర్తుచేశారు. ఈ సందర్భంగా కొద్దిసేపు క్రీడాకారులతో కలిసి కబడ్డీ, వాలీబాల్ ఆడి విద్యార్థిని, విద్యార్థులను ఉత్తేజపరిచారు. ప్రతిభకు పేదరికం అడ్డు కాదని, కృషి పట్టుదల ఉంటే యువత ఉన్నత శిఖరాన్ని చేరకోవచ్చు అని ఆయన పేర్కొన్నారు. యువత ఎలాంటి చెడు వ్యసనాల బారిన పడకుండా సన్మార్గంలో పనిచేయాలని ఆయన సూచించారు. రానున్న భవిష్యత్తు అంతా భావి భారత పౌరులు యువత దేనని, భారతదేశానికి మూల స్తంభంలాంటి వారని ఎమ్మెల్యే అన్నారు. మండల ప్రజా ప్రతినిధులు, నాయకులు, వివిధ అనుబంధ సంఘాల నాయకులు, ఉపాధ్యాయ బృందం, విద్యార్థులు పాల్గొన్నారు.

# నల్ల పోచమ్మ, రేణుక ఎల్లమ్మ తల్లీ ఆలయ విగ్రహ ప్రతిష్టాపన




**విశ్వంభర, కుత్బుల్లాపూర్:** కుత్బుల్లాపూర్ నియోజక వర్గం 125 వ డివిజన్ గాజుల రామారంలోని నల్ల పోచమ్మ తల్లి, రేణుక ఎల్లమ్మ దేవస్థాన విగ్రహ పున: ప్రతిష్ఠ మహోత్సవానికి మాజీ ఎమ్మెల్యే కూన శ్రీశైలం గౌడ్ హాజరై అమ్మ వారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ సభ్యులు శ్రీశైలం గౌడ్ ను ఘనంగా సత్కరించారు. ఆలయ విగ్రహ పున: ప్రతిష్టా మహోత్సవంలో పాల్గొనడం చాల సంతో షంగా ఉందని, అమ్మ వారి ఆశీస్సులు ప్రజలందరిపై ఉండాలని మాజీ ఎమ్మెల్యే ఆకాంక్షిం చారు. ఆలయ కమిటీ సభ్యులు, మహిళలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

# ఆదివాసి ఎరుకల సంఘం ఉపాధ్యక్షుడిగా దుగ్యాల రాము




**విశ్వంభర, భూపాలపల్లి:** జయశంకర్ భూపాలపల్లి జిల్లా ఆదివాసి ఎరుకల సంఘం ఉపాధ్యక్షుడిగా దుగ్యాల రాము ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు భూపాలపల్లి జిల్లా అధ్యక్షులు కేతిరి సుభాష్ తెలిపారు. శుక్రవారం కాళేశ్వరంలో ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేసుకొని దుగ్యల రామును ఎన్నుకున్నామన్నారు. అనంతరం జిల్లా అధ్యక్షులు మాట్లాడుతూ ఆదివాసి ఎరుకల సంఘమును గ్రామ గ్రామాన కమిటీలు వేసి ఎరుకల కులస్తులను అభివృద్ధి చేయడానికి రాము కృషి చేయాలనీ కోరారు. ఎరుకల కులస్తులను అగ్రవర్ణాలు కులస్తులు ప్రతి గ్రామాన అనగతొక్కలని చూస్తున్నారన్నారు. ఎక్కడైనా ఎరుకల కులస్తులకు అవమానం జరిగితే ఎస్సీ ఎస్టీ కేసులు పెడితే రాజకీయ నాయకులు అండదండలతో ప్రజలను బెదిరించి కేసు వాపసు తీసుకునే విధంగా చేస్తున్నారని అన్నారు. అలాంటి ఇబ్బందులు ఎక్కడైనా జరుగుతే మా దృష్టికి తీసుకురావాలని కేతిరి సుభాష్ సూచించారు. మేము వారి వెంట ఉండి వారి తరఫున పోరాటం చేస్తానని తెలిపారు. అనంతరం సన్మాన కార్యక్రమం నిర్వహించారు. సమావేశం లో ముఖ్య అతిధి మంచిర్యాల జిల్లా దుగ్యాల బాపు, జిల్లా యూత్ అధ్యక్షులు అంగిడి ప్రశాంత్, మహారాష్ట్ర గడిచిరోలి జిల్లా సిరివంచ మండలం ఎరుకల సంఘం అధ్యక్షులు నగేష్, మహాదేవ్‌పూర్ మండలం అధ్యక్షులు శ్రీరాముల పోషలు, కోశాధికారి సుధాకర్, జిల్లా ఉపాధ్యక్షులు కుర్ర రవి, నాయకులు కేతిరి బాపూరావు, అంగిడి సుధాకర్, రాజమౌళి, బిక్షపతి, దేవర కొండా నాగరాజు, శ్రీరాముల సమ్మన్న, నాగరాజు, అనిల్ సమీర్ దుగ్యల, సందీప్ ఉన్నారు.

## అనాద జంటలకు వైభవంగా వివాహం



**విశ్వంభర, ఎల్బీనగర్:** జ్యోతి-పవన్, మానస-నరసింహా రెండు అనాద జంటలకు సైదాబాద్ లోని ఆర్య ఈవెంట్స్ లో వివాహాలను వేద పండితులు వైభవంగా నిర్వహించారు. వధూవరులను రూపాయి ఫౌండేషన్ చైర్మన్ అనిల్ కుమార్, అరుణ దంపతులు, జగిని పర్నిచర్ నిర్వాహకులు, జగిని శ్రీనివాస్, యడవల్లి బాలరాజ్ వధూవరులకు అవసరమైన వస్తువులు, గృహ సామగ్రిని అందజేశారు. వారు మాట్లాడుతూ ఆదర్శ వివాహాన్ని దాతలు అందించే ఒక్క రూపాయి సహకారం తో జరిపిస్తున్నామని తెలిపారు.ు

## ఆలయ కమిటీ సభ్యుల సంకల్పానికి దేవాలయ నిర్మాణం

### ఎమ్మెల్యే కే.పీ. వివేకానంద



**విశ్వంభర, కుత్బుల్లాపూర్:** కుత్బుల్లాపూర్ నియోజక వర్గం 125 డివిజన్ లో ఘనంగా గాజులరామారం నల్ల పోచమ్మ రేణుక ఎల్లమ్మ దేవాలయ పునః ప్రతిష్టాపన కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమానికి ఎమ్మెల్యే కే.పీ. వివేకానంద ముఖ్యఅతిథిగా హాజరై అమ్మవారికి విశేష పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ దైవారాధనతో మానసిక ప్రశాంతత చేకూరుతుందని, అమ్మవారి కృపా కటాక్షాలతో ప్రజలంతా సుఖసంతోషాలు, అష్టైశ్వర్యాలు, ఆయురారోగ్యాలతో జీవించాలని కోరారు. ఆలయ నిర్మాణం అంటేనే ఎంతో శ్రమ, త్యాగంతో కూడుకున్న పని అని అన్నారు. ఇంత పెద్ద దేవాలయ నిర్మాణం చేపట్టాలంటే ఆలయ కమిటీ సభ్యుల సంకల్పానికి అమ్మవారి అనుగ్రహం తోడైనప్పుడే ఇంతటి నిర్మాణం సాధ్యం అవుతుందన్నారు. అనంతరం ఆలయ కమిటీ సభ్యులు ఎమ్మెల్యే కే.పీ. వివేకానందని అమ్మవారి ఫోటో, శాలువాలతో ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో పాక్స్ డైరెక్టర్ పరిశే శ్రీనివాస్ యాదవ్, డివిజన్ అధ్యక్షులు విజయ్ రాంరెడ్డి, సీనియర్ నాయకులు కస్తూరి బాల్ రాజ్, ఇబ్రహీం ఖాన్, మూసా ఖాన్, గోవర్ధన్ రెడ్డి, ఇబ్రహీం బేగ్, వాహీద్, బొయిని మహేష్, ప్రసాద్, శ్రీశైలం, జునైద్, ఆలయ కమిటీ సభ్యులు శ్రీశైలం, విజయ్ కుమార్, జ్ఞానేశ్వర్, కిరణ్, రవి, జగన్, ఆలయ కమిటీ సభ్యులు, భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

## కామినేని హాస్పిటల్, ఉప్పల ట్రస్ట్ సౌజన్యంతో ఉచిత వైద్య శిబిరం



**విశ్వంభర, తలకొండపల్లి:** వర్షకాలం సీజనల్ వ్యాధులు గ్రామాలలో వ్యాపిస్తున్న క్రమంలో తలకొండపల్లి మండలం గట్టు ఇప్పలపల్లి గ్రామంలో మాజీ మిషన్ భగీరథ వైస్ చైర్మన్, మాజీ జెడ్పీటీసీ ఉప్పల వెంకటేష్, కామినేని హాస్పిటల్ ఆధ్వర్యంలో శుక్రవారం ఉచిత వైద్య ఆరోగ్య శిబిరం ఏర్పాటు చేశారు. గ్రామంలో బీపీ, షుగర్ టెస్టులు చేసి 416 మందికి డెంగ్యూ, మలేరియా, టైఫాయిడ్, జలుబు, దగ్గు వైరల్ ఫీవర్, వంటి వ్యాధుల బారిన పడిన వారికి ఉప్పల చారిటబుల్ ట్రస్ట్ ద్వారా మందులు పంపిణీ చేసి తగిన జాగ్రత్తలు తీసుకోవాలని వైద్యులు తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ జయమ్మ వెంకటయ్య, గౌడ సంఘం తాలూకా కన్వీనర్ అశోక్ గౌడ్, నూనె రాఘవేందర్, బొల్లి కృష్ణ, ఆంజనేయులు గౌడ్, చంద్రశేఖర్ రెడ్డి, మాజీ వైస్ ఎంపీపీ శ్రీనివాస్ రెడ్డి, కిషన్ రెడ్డి, మాజీ సర్పంచ్ మైసయ్య, పాపిరెడ్డి, మండల్ కృష్ణయ్య, రేణు రెడ్డి, నాగరాజు, చెన్నయ్య, బుచ్చిబాబు, అంజయ్య, భాస్కర్, శ్రీశైలం పాల్గొన్నారు.

## ప్రత్యంగిరా మహాదేవి దివ్య శాంతి మహా యజ్ఞం



**విశ్వంభర, ఆమనగల్లు:** ఆమనగల్లు మండల కేంద్రంలోని సురసముద్ర చెరువు కట్టపై వెలిసిన కట్ట మైసమ్మ దేవాలయంలో విగ్రహ ప్రతిష్ట కార్యక్రమంలో భాగంగా మూడవరోజు కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణ రెడ్డి పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం కమిటీ ఆధ్వర్యంలో బ్రాహ్మణోత్తములచే మహాదేవి దివ్య శాంతి మహాయజ్ఞం సుగంధద్రవ్యాలు, ఎండు మిరపకాయల తో పెద్ద ఎత్తున నిర్వహించారు. ఈ యజ్ఞం పట్టణవాసులందరిని ఆకర్షించేలా చేశారు. ఈ కార్యక్రమంలో పొల్యూషన్ బోర్డ్ మెంబర్ బాలాజీ సింగ్, ఆమనగల్ ఎస్సై వెంకటేష్, ఆలయ కమిటీ అధ్యక్షులు ముక్తాల వెంకటయ్య, ఆయిళ్ల శ్రీనివాస్ గౌడ్, యాట నరసింహ, సంఘ సేవకులు పాపిశెట్టి రాము, చిన్న వెంకటయ్య, అంజయ్య, కేకే శీను, రాజు మహిళలు పాల్గొన్నారు.

# చట్టా విరుద్ధంగా నడుపుతున్న స్కూల్ ని సీజ్ చేయాలి



**విశ్వంభర, భద్రాద్రి కొత్తగూడెం:** భద్రాచలం పట్టణంలో త్రివేణి విద్యా సంస్థ ఆగస్టు 15న జాతీయ జెండాని ఫుట్ పాత్ పై ఎగరవేశారని, త్రివేణి విద్యా సంస్థకి సంబంధించిన ప్రభుత్వ అనుమతులు లేనప్పటికీ విద్యాసంస్థని నడుపుతున్నారని పీ.డీ.ఎస్.యూ భద్రాచలం డివిజన్ కార్యదర్శి మునిగేలా శివ ప్రశాంత్ తెలిపారు. ఈ సందర్భంగా మునిగేలా శివ ప్రశాంత్ మాట్లాడుతూ. ఇప్పటి వరకు త్రివేణి విద్యా సంస్థపై చర్యలు తీసుకోకుండా విద్యాశాఖ అధికారులు నిర్లక్ష్యం చేస్తున్నారని ఆయన అన్నారు. త్రివేణి విద్యా సంస్థకి ఏజెన్సీ చట్టాలని పక్క దారి పట్టించి స్కూల్ పర్మిషన్స్ తీసుకోకుండా ఆర్థిక బలంతో, రాజకీయ బలంతో అధికారులను మేనేజ్ చేస్తూ స్కూల్ నడుపుతున్నారని ఆయన ఆరోపణ చేశారు. విద్యాశాఖ అధికారులు ఆస్కూల్ పై ఎందుకు అంత ప్రేమ చూపిస్తున్నారని గల కారణాలు ఏంటో ప్రజానీకానికి తెలియజేయాలని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. ఎంఈఓ, డీఈఓ లు ప్రవేట్ విద్యాసంస్థలు ఇస్తున్న ఆర్థిక సంబంధాలు పెట్టుకుని ఏజెన్సీ చట్టాలను ప్రజల్ని మోసం చేస్తూ కాలయాపన చేస్తున్నారన్నారు. అందుకోసమని త్రివేణి విద్యా సంస్థపై చర్యలు తీసుకోవడం లేదని ఆయన అన్నారు. త్రివేణి విద్యా సంస్థకి ఆట స్థలం లేకుండా పర్మిషన్ ఎలా ఇచ్చారో విద్యాశాఖ అధికారులకే తెలియాలని అన్నారు. ఏజెన్సీ లో విద్య హక్కు చట్టాన్ని అమలు చేయకుండా విద్యార్థుల తల్లిదండ్రుల దగ్గర నుండి వేల రూపాయల ఫీజులను వసూలు చేస్తున్నా రని తెలిపారు. బుక్స్, యూనిఫామ్ లు, పార్టీల పేరుతో అనేక ఫీజులను వసూలు చేస్తున్నారని అన్నారు ఈ విషయం ఎంఈఓ, డీఈఓ లకు తెలిసిన ఏమాత్రం పట్టించుకోకుండా కాలయాపన చేస్తున్నారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వ చట్టాల్ని ఉల్లంఘిస్తున్న త్రివేణి విద్యా సంస్థపై చర్యలు తీసుకోవాలని జాతీయ జెండాని ఫుట్పాత్ పై ఎగరవేసినందుకు స్కూలు సీజ్ చేయాలని ఆయన అన్నారు. లేనియెడల విద్యార్థులను ఐక్యం చేసి ఉద్యమాలు చేపడతామని ప్రభుత్వాన్ని, అధికారులను హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సంజు, మోషన్, మల్లయ్య, సంపత్ పాల్గొన్నారు

## తప్పును కప్పిపుచ్చుకోవడానికి చూస్తున్న మావోయిస్టు పార్టీ



అమాయకురాలైన బండి రాధఏనీల్సో ను అతికిరాతకంగా చంపి చర్ల మండలం చెన్నాపురం గ్రామ శివారులో మృత దేహాన్ని రోడ్డుపై పడవేసిన మావోయిస్టు పార్టీ నాయకులు వారి తప్పును కప్పిపుచ్చుకోవడానికి మాయ మాటలు చెబుతూ పత్రికా ప్రకటనలు చేయడం వారి క్రూరత్వానికి నిదర్శనంగా కనబడుతుందని భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ఎస్పీ పేర్కొన్నారు. ఉన్నత చదువులు చదువుకొని సమాజంలో ఒక విలువైన జీవితాన్ని గడపాలనుకున్న రాధను బలవంతంగా మావోయిస్టు పార్టీలోకి చేర్చుకొని ఆమె భవిష్యత్తును అంధకారంలోకి నెట్టేసి చివరికి జీవితాన్నే లేకుండా చేసిన మావోయిస్టు పార్టీ నాయకులకు మానవత్వమే లేదనేది ఈ విషయం ద్వారా ప్రతి ఒక్కరికి అర్థమవుతుందని ఆయన అన్నారు. దళితురాలైన రాధా అనతికాలంలోనే పట్టుదలతో తమ పార్టీలో నాయకత్వం వహించే స్థాయికి చేరిందని పొగుడుతున్నారు కదా! అలాంటప్పుడు చంపవలసిన అవసరం ఏమి ఉంది ? ఆమెను అతికిరాతకంగా చంపేసి, తప్పును కప్పిపుచ్చుకోవటానికి పోలీసులు భాద్యత వహించాలని ప్రకటన విడుదల చేయడం ఎంతవరకు సమంజసం? తమ సొంత పార్టీ చేతిలోనే హత్యకు గురైన రాధను శారీరకంగా, మానసికంగా ఇబ్బందులకు గురిచేసి, ఆమెను లైంగికంగా వేధిస్తూ, కులం పేరుతో దూషించి, చిత్రహింసలకు గురి చేశారని ఆమె సోదరుడు కూడా ఆరోపించారని ఎస్పీ తెలిపారు. ఆమెను చంపకుండా ప్రత్యామ్నాయ మార్గాలు ఉన్నప్పటికీ, దారుణంగా చంపి, బాధ్యతలు నెరవేర్చామంటున్నారు. అదీగాక తనే మరణశిక్షను అంగీకరించిందన్నారు. ఆమె అంగీకరిస్తే వీళ్ళు చంపేయడమేనా? చాలా నిర్లక్ష్యంగా, నిస్సిగ్గుగా ప్రకటనను విడుదల చేశారని ఎస్పీ తప్పు పట్టారు. తమ స్వార్థ ప్రయోజనాల కోసం అమాయకులైన యువతీ యువకులను పార్టీలోకి చేర్చుకొని వారిచేత చట్టవ్యతిరేక కార్యకలాపాలు చేయిస్తూ మావోయిస్టు పార్టీ అగ్ర నాయకులు తమ పబ్బం గడుపుకుంటున్నారు. పీడిత ప్రజల పక్షాన పోరాడుతున్నామని చెబుతూనే వారిని బలవంతంగా పార్టీలోకి చేర్చుకొని చిత్రహింసలకు గురి చేస్తున్న మావోయిస్టు పార్టీ ప్రజలలో ఎప్పుడో ఆదరణ కోల్పోయిందని తెలిపారు. తమ ఉనికిని చాటుకోవడానికి లొంగిపోవడానికి సిద్ధమైన అమాయకుల ప్రాణాలను బలి తీసుకుంటూ ఆకృత్యాలకు పాల్పడుతున్నారు. మావోయిస్టు పార్టీలో కీలక పాత్ర పోషించిన రాధ లాంటి దళిత మహిళను పోలీస్ ఇన్ఫార్మర్ అని ముద్రవేయడం అగ్ర నాయకుల నీచమైన ఆలోచనలకు నిదర్శనమన్నారు. తమ కూతురిని బలవంతంగా తీసుకెళ్లి మావోయిస్టు పార్టీలోకి చేర్చుకున్నారని రాధ తల్లి పల్లెపాటి పోచమ్మ 2022 జనవరిలో విశాఖపట్నం జిల్లా, పెద్దబయలు పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేయడం జరిగిందని ఎస్పీ తెలిపారు. ఇట్టి విషయంలో తేదీ 03 జనవరి 2022న .01/2022 ప్రకారం పోలీసులు కేసు నమోదు చేయడం జరిగింది. కేవలం నిషేధితమావోయిస్టు పార్టీ నాయకులు విలాసవంతమైన జీవితాలను గడపడానికే అమాయకులైన ఆదివాసి ప్రజలను బానిసలుగా మార్చు కుని, వారిని అభివృద్ధికి దూరం చేస్తూ భవిష్యత్తును నాశ నం చేస్తున్నారని విమర్శించారు. ప్రజలు, యువత, మహిళలు, మేధావులు, షెడ్యూలు కులాల, షెడ్యూలు తెగలు, ప్రజా సంఘాలు ఈ అనాగరికమైన హత్యను తీవ్రంగా ఖండించాల్సిన అవసరం ఉందని భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ఎస్పీ అన్నారు

## నేరాల నియంత్రణకు సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలి: ఎస్పీ కిరణ్ ఖరే



**విశ్వంభర, భూపాలపల్లి:** నేరాల నియంత్రణలో సీసీ కెమెరాలు కీలక పాత్ర పోషిస్తాయని, వీటితో నేరాలను కట్టడి చేయవచ్చని జయశంకర్ భూపాలపల్లి జిల్లా ఎస్పీ కిరణ్ ఖరే అన్నారు. శుక్రవారం మొగుళ్లపల్లి మండలం రంగాపూర్ లో గ్రామస్తులు, దాతల సహకారంతో సుమారు రూ. 5 లక్షల వ్యయంతో ఏర్పాటు చేసిన 50 సీసీ కెమెరాలను భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావుతో కలిసి ఎస్పీ శుక్రవారం ప్రారంభించారు. అనంతరం ఎస్పీ మాట్లాడుతూ శాంతి భద్రతలు ఎక్కడైతే పటిష్టంగా ఉంటాయో, అక్కడే అభివృద్ధి సాధ్యమని, ప్రజల రక్షణ, భద్రత గురించి పోలీసులు ఎల్లవేళలా పనిచేస్తున్నారన్నారని ఎస్పీ పేర్కొన్నారు. సీసీ కెమెరాల వల్ల ఎన్నో ఉపయోగాలు ఉన్నాయని, ఏ చిన్న సంఘటన జరిగినా వెంటనే తెలుసుకోవచ్చన్నారు. గ్రామాల్లో సీసీ కెమెరాలు మరింత భద్రత కల్పిస్తాయని తెలిపారు. సీసీ కెమెరాలతో నేరాలను అదుపు చేయవచ్చని, నేరస్థులు సీసీ కెమెరాలు ఉన్న ప్రదేశాలలో నేరం చేసేందుకు వెనుకడుగు వేస్తారని తెలిపారు. పటిష్టమైన సీసీ కెమెరాల రక్షణ వ్యవస్థ ఉండడంతో ప్రజల్లో భరోసా ఉంటుందన్నారు. దొంగతనాలు, ఇతర నేరాలను, అలాగే రోడ్డు ప్రమాదాలు, నిందితులను అరెస్టు చేయడంలో కెమెరాలు సహాయపడతాయని తెలిపారు. ముఖ్యంగా గంజాయి, డ్రగ్స్ తమ గ్రామాల్లో ఉంటే పోలీసు అధికారులకు తెలియజేయాలని ఎస్పీ కిరణ్ ఖరే సూచించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ రంగాపూర్ గ్రామస్తులు, దాతలు, రూ. 5 లక్షలతో సీసీ కెమెరాలను భద్రత కోసం ఏర్పాటు చేయడం అందరికి ఆదర్శనీయమన్నారు. అన్ని గ్రామాల ప్రజలు ఇలాగే సీసీ టీవీ కెమెరాలను అమర్చుకోవాలని కోరారు. నేరాల నివారణతో పాటు కేసుల గుర్తింపులో సీసీ కెమెరాలు కీలకపాత్ర పోషిస్తాయని, నేరాలను అదుపు చేసేందుకు సీసీ కెమెరాల ఏర్పాటుకు ప్రజలు, వ్యాపారస్తులు, ముందుకు రావాలని పిలుపునిచ్చారు. భూపాలపల్లి డీఎస్పీ సంపత్ రావు, చిట్యాల సీఐ మల్లేష్, మొగుళ్ళపల్లి ఎస్సై అశోక్ కుమార్, రంగాపూర్ గ్రామ ప్రజాప్రతినిధులు, సీసీ కెమెరాల దాతలు బల్గురి సంతోష్ రావు, లింగరావు పాల్గొన్నారు.

## ఎల్ ఆర్ ఎస్ విచారణ ప్రక్రియపై పవర్ పాయింట్ ప్రజెంటేషన్

**విశ్వంభర భూపాలపల్లి ఆగస్టు 23:** ఎల్ఆర్ఎస్ 2020లో ఎవరైతే దరఖాస్తు చేసుకున్నారో క్షేత్రస్థాయి లో విచారణ ప్రక్రియ చేపట్టనున్నట్లు భూపాలపల్లి జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ తెలిపారు. శుక్రవారం ఎల్ ఆర్ ఎస్ దరఖాస్తులు విచారణ ప్రక్రియ నిర్వహణకు ఏర్పాటు చేసిన రెవెన్యూ, మున్సిపల్, గ్రామ పంచాయతి, ఇరిగే షన్ అధికారులకు పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా అవగాహన కార్య క్రమం నిర్వహించారు. ఈ సంద ర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లా లో 8310 మంది దరఖాస్తు చేసుకు న్నారని తెలిపారు. అట్టి దరఖాస్తుల లో ఎవరైనా సక్రమంగా డాక్యుమెం ట్లు పోర్టల్ లో అప్లోడ్ చేయనట్లయితే ప్రభుత్వం తిరిగి మరలా మొబైల్, మీ సేవా కేంద్రాల ద్వారా కాని రిజిస్టర్ డాక్యుమెంట్స్ అప్లోడ్ చేయడానికి అవకాశం కల్పించినట్లు తెలిపారు. ఈ ఎల్ఆర్ఎస్ దరఖాస్తులు వెరిఫికేషన్ కోసం రెవెన్యూ, మున్సిపల్, పంచాయతి రాజ్, ఇరిగేషన్ శాఖల ద్వారా 56 టీములు ఏర్పాటు చేయడం జరిగిందని అన్నారు. సోమ, మంగ ళవారం నుంచి ఏర్పాటు చేసిన టీములు గ్రామాలలో, మున్సిపాలిటీలలో ఎల్ఆర్ఎస్ దరఖాస్తులు విచారణ నిర్వహణకు వస్తారని పేర్కొన్నారు. విచారణకు వచ్చిన అధికారులకు డాక్యుమెంట్లు అందచేయాలని అట్టి దరఖాస్తులను ఆన్లైన్లో అప్లోడ్ చేస్తారని ఆయన తెలిపారు. దరఖాస్తుదారులు సంబంధిత డాక్యుమెంట్లను అందుబాటులో ఉంచుకోవాలని, విచారణ ప్రక్రియ సజావుగా, సక్రమంగా నిష్పక్షపాతంగా పూర్తి చేయుటకు సహకరించాలని ఆయన సూచించారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ వెంకటేశ్వర్లు, డిపిఓ నారాయణ రావు, మున్సిపల్ కమిషనర్ రాజేశ్వరరావు, రెవెన్యూ, ఇరిగేషన్, మున్సిపల్ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## ఆడబిడ్డ పెళ్లికి ఆర్థిక సాయం చేసిన ఎమ్మెల్యే రాజగోపాల్ రెడ్డి



**విశ్వంభర, నారాయణపురం:** సంస్థాన్ నారాయణపురం మండలం జనగాం గ్రామానికి చెందిన అనమోని లింగస్వామి కొద్ది రోజుల క్రితం అనారోగ్యంతో మృతి చెందాడు. లింగస్వామి కూతురు వివాహం శుక్రవారం చౌటుప్పల్ లోని జయశ్రీ గార్డెన్లో జరిగింది. ఈ వివాహానికి హాజరైన మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి నిరుపేద ఆడబిడ్డ పెండ్లికి రూ. 50వేల ఆర్థిక సహాయం అందజేసి మానవత్వాన్ని చాటుకున్నారు. ఎమ్మెల్యేతో పాటు నారాయణపూర్ కాంగ్రెస్ మండల నాయకులు ఉప్పల లింగస్వామి ఉన్నారు.

## రైతులకు ఉపయోగపడేలా నూతన భూ చట్టం



**విశ్వంభర, భూపాలపల్లి:** రాష్ట్రంలో రైతులకు ఉపయోగపడేలా నూతన భూ చట్టాన్ని తెచ్చేందుకు ప్రభుత్వం కృషి చేస్తున్నట్లు భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు తెలిపారు. శుక్రవారం భూపాలపల్లి కలెక్టరేట్ కార్యాలయం ఐడీఓసీ కాన్ఫరెన్స్ హాల్ లో జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ, అడిషనల్ కలెక్టర్ వెంకటేశ్వర్లు ఇతర అన్ని శాఖల అధికారులు, రైతులతో ఏర్పాటు చేసిన నూతన తెలంగాణ హక్కుల రికార్డు బిల్లు 2024, అభిప్రాయ సేకరణలో ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ దాదాపు 70 సంవత్సరాల నుండి సాగు చేసుకుంటున్న రైతుల భూములకు పట్టాదారు పాస్ పుస్తకం లేదన్నారు. గత ప్రభుత్వం హయాంలో నిరుపేదలకు ఇచ్చిన అసైన్డ్ భూములల్లో పల్లె ప్రకృతి వనాలు, స్మశాన వాటికలు ఏర్పాటు చేశారని గుర్తు చేశారు. తద్వారా వాళ్ళ జీవనాధారం కోల్పోయారని ఆవేదన వ్యక్తం చేశారు. రైతుల ఇబ్బందులను గుర్తించిన కాంగ్రెస్ ప్రభుత్వం అందరితో సమాలోచనలు చేసి నూతన చట్టం తెచ్చేందుకు రాష్ట్ర వ్యాప్తంగా అన్ని జిల్లాలల్లో ఈ చర్చా వేదిక కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. నూతన చట్టం తేవడం ద్వారా రైతుల ఇబ్బందులు తొలగించేందుకు ప్రభుత్వం చర్యలు చేపట్టినట్లు ఎమ్మెల్యే తెలిపారు. ప్రతీ గ్రామం, జిల్లాలో మోకా మీద సాగు చేసుకుంటున్న రైతుల సర్వే నెంబర్ మీద వేరే వ్యక్తి వస్తున్నాడని, రైతు ఉండే పరిస్థితి లేకుండా పోయిందని పేర్కొన్నారు. పదేళ్ల నుండి గ్రామస్థాయిలో వీఆర్వో, తహశీల్దార్ పరిష్కరించాల్సిన విషయాలను పరిష్కరించకుండా రెవెన్యూ వ్యవస్థను నిర్వీర్యం చేసి రైతుల పొట్ట కొట్టారని అన్నారు. ప్రస్తుతం వీఆర్వోలు, సర్వేయర్లు ఉండాలని అన్నారు. మండలాల్లో సర్వేయర్ల కొరత ఉందని సర్వేయర్లను త్వరలోనే నియామకం చేసేలా ప్రభుత్వం చూస్తుందని అన్నారు. అదే విధంగా, వీఆర్వోల నియామకానికి చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. గతంలో గ్రామాల్లో జమాబంది నిర్వహించి పది మంది రైతులను అడిగి భూములకు హక్కు పత్రాలు కల్పించే వాళ్లని, నేడు ఆ పరిస్థితి లేకుండా పోయిందని ఆవేదన వ్యక్తం చేశారు. గ్రామాలాల్లో వీఆర్వో జమాబంధీ నిర్వహించడం వల్ల రైతు ఉన్నాడా? లేదా? అనేది స్పష్టంగా తెలిసేదని తెలిపారు. రామప్ప చెరువు ఆయకట్టులో సుమారు ఐదు వేల ఎకరాల విస్తీర్ణానికి హక్కులు లేకుండా పోయాయని, రైతులు అనేకసార్లు కార్యాలయాల చుట్టూ తిరుగుతూ దరఖాస్తులు అందజేస్తున్నారని గుర్తుచేశారు. అసైన్డ్ భూములు అందజేసి దున్నుకునే హక్కు కలిపిస్తే దున్నుకునే రైతు నోట్లో గత ప్రభుత్వం మట్టి కొట్టిందని తెలిపారు. రైతుల ఇబ్బందులు గమనించిన ప్రజా ప్రభుత్వం చట్టం రూపకల్పనలో క్షేత్రస్థాయిలో ప్రజల సూచనలు, సలహాలను తీసుకోవాలని భావించి చర్చా కార్యక్రమం నిర్వహిస్తూ అట్టి సలహాలు, సూచనలు ప్రభుత్వానికి పంపనున్నట్లు ఆయన తెలిపారు. క్రింది స్థాయి ఆలోచనతో చట్టం చేసేందుకు ప్రభుత్వం ప్రజలకు రైతులుకు అందుబాటులో ఉండేందుకు చర్యలు చేపడుతున్నట్లు పేర్కొన్నారు. 60 సంవత్సరాల నుంచి దున్నుకున్న భూములకు కూడా పట్టాదారు పాస్ పుస్తకం రాకపోవడంతో బ్యాంకు నుంచి రుణాలు రాక రైతుల అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని అన్నారు. క్రింది స్థాయిలో వీఆర్ఓ తప్పు చేస్తే తహసీల్దార్ చర్యలు తీసుకోవడం, తహసీల్దార్ తప్పు చేస్తే ఆర్డీఓ చర్యలు తీసుకోవడం, ఆర్డీవో తప్పు చేస్తే ఆ పైన కలెక్టర్ చర్యలు తీసుకునే విధంగా కొత్త చట్టంలో పొందుపరుస్తున్నట్లు ఎమ్మెల్యే తెలిపారు.

# ప్రపంచంలోనే రెండో అతిపెద్ద వజ్రం



**విశ్వంభర, హైదరాబాద్:** బోట్స్వానాలోని కరోవే గనిలో 2,492 క్యారెట్ల వజ్రం లభ్యమైంది. ఇది ప్రపంచంలోనే రెండో అతిపెద్ద వజ్రమని లుకారా డైమండ్ కార్పొరేషన్ ప్రకటించింది. దీనిని గుర్తించడానికి ఎక్స్-రే డిటెక్షన్ టెక్నాలజీని ఉపయోగించారు. 1905లో దక్షిణాఫ్రికాలో వెలికితీసిన 3,106 క్యారెట్ల కల్లినన్ వజ్రం ప్రపంచంలోనే అతి పెద్దదిగా ఉంది. తాజాగా దొరికిన వజ్రం విలువ ప్రకటించాల్సి ఉంది

# దేశంలో "సజ్జనార్లే" ఉండాలి

## కోల్కత్తా ఘటనపై మహిళల వ్యాఖ్యలు..?



**విశ్వంభర, ఖమ్మం:** ప్రస్తుతం ఎక్కడ చూసినా కోల్‌కతా డాక్టర్ రేప్ కేసు గురించి చర్చ జరుగుతుంది. ఈ ఘటన జరిగాక కూడా నర్సుపై అత్యాచారం, చిన్నారులపై లైంగిక వేదింపులు ఇలా దేశవ్యాప్తంగా జరుగుతున్న చాలా సంఘటనలు ఆడపిల్లల తల్లిదండ్రుల్లో ఆందోళన కలిగిస్తున్నాయి. ఈ క్రమంలో హైదరాబాద్ లో 2019లో జరిగిన వెటర్నరీ డాక్టర్ హత్యాచారం కేసుపై చర్చ జరుగుతుంది. ఈ కేసు విషయంలో వీసీ సజ్జనార్ సత్వర న్యాయం జరిపారని, ఆయన లెజెండ్ అని పొగిడేస్తున్నారు. నేడు ఇలాంటి లెజెండ్స్ మన సమాజానికి చాలా అవసరమని అంటున్నారు. కాగా 2019 నవంబర్ లో శంషాబాద్ లో 26 ఏళ్ల అమ్మాయిపై గ్యాంగ్ రేప్ అండ్ మర్డర్ జరిగింది. ఒకరోజు తర్వాత ఆమె బాడీ షాద్ నగర్ లో లభ్యమైంది. నలుగురు నిందితులను అదుపులోకి తీసుకున్న పోలీసులు విచారించారు. డిసెంబర్ 6న కేసు రిక్రియేషన్ గురించి నిందితులను తీసుకెళ్లిన పోలీసులు హైదరాబాద్ - బెంగళూరు జాతీయ రహదారిపై సమీపంలో ఎన్‌కౌంటర్ చేశారు. పోలీసులపైకి గన్స్ తో ఎటాక్ చేసే క్రమంలో ప్రాణ రక్షణ కొరకు ఇలా చేసినట్లు తెలిపారు. దీంతో దేశ వ్యాప్తంగా సజ్జనార్ పై ప్రశంసల వర్షం కురిసింది. ఈ విధంగా న్యాయం చేసిందందుకు చాలా మంది అమ్మాయిలు ఆనాడు 100కు డయల్ చేసి థాంక్స్ చెప్పారు. ఈ విషయంలో అక్కడ సజ్జనారు లాంటి ఆఫీసర్ లేరా అని నిరసన కార్యక్రమాలలో పాల్గొన్న మహిళలు అంటున్నారు.

# తెలంగాణ రేషన్ కార్డుదారులకు శుభవార్త

## ఇకపై రాయితీపైనే వస్తువులు.!



**విశ్వంభర, హైదరాబాద్:** తెలంగాణ రాష్ట్ర రేషన్ కార్డుదారులకు అదిరిపోయే శుభవార్త చెప్పింది రేవంత్ రెడ్డి ప్రభుత్వం. రేషన్ కార్డులు ఉన్నవారికి రాయితీ పైన గోధుమలను పంపిణీ చేయాలని రేవంత్ రెడ్డి ప్రభుత్వం ఓ నిర్ణయానికి వచ్చింది. ప్రస్తుతానికి అయితే హైదరాబాద్ మహానగరంలో మాత్రమే గోధుమలను డిస్కౌంట్ ధరలో రేషన్ కార్డుదారులకు అందిస్తుంది తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం. అయితే ఇకపై తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా హైదరాబాద్ మాదిరిగానే పంపిణీ చేయాలని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి కీలక ఆదేశాలు ఇవ్వడం జరిగింది. 500 రూపాయలకు గ్యాస్ సిలిండర్ల పంపిణీ పైన కూడా ఆయన సమీక్ష నిర్వహించడం జరిగింది. సిలిండర్ కొనుగోలు చేసిన వినియోగదారులకు 48 గంటల సమయంలోనే వారి డబ్బులను అకౌంట్లో వేయాలని తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది.

# ఆర్టీసీ బస్సుకు త్రుటిలో తప్పిన ఘోర ప్రమాదం



**విశ్వంభర, కామారెడ్డి:** తెలంగాణలో ఆర్టీసీ బస్సులకు ఏమైంది..? నిన్న గాక మొన్ననే రన్నింగ్‌లో ఉన్న బస్సు వెనక రెండు టైర్లు ఊడిపోగా ఇప్పుడు మరో ప్రమాదం సంభవించింది. కామారెడ్డి జిల్లాలో ఆర్టీసీ బస్సుకు ఘోర ప్రమాదం త్రుటిలో తప్పింది. రన్నింగ్‌లో ఉన్న ఆర్టీసీ బస్సు స్టీరింగ్ విరిగిపోయింది. బస్సును డ్రైవర్ చాకచక్యంగా నిలిపివేయటంతో పెద్ద ప్రమాదమే తప్పింది. రామారెడ్డి మండలం మద్దికుంట గ్రామం నుంచి కామారెడ్డి వైపు వెళ్తున్న ఆర్టీసీ బస్సు స్టీరింగ్ ఒక్కసారిగా విరిగిపోయింది. అయితే.. స్టీరింగ్ విరిగిపోయిన సమయంలో బస్సులో సుమారు 120 మంది ప్రయాణికులు ఉన్నట్టు సమాచారం. స్టీరింగ్ విరిగిపోవటంతో ప్రయాణికులంతా ఒక్కసారిగా భయాందోళనకు గురయ్యారు. డ్రైవర్ శ్రీనివాస్ మాత్రం చాకచక్యంగా వ్యవహరించి బస్సును సురక్షితంగా ఆపేశాడు. దీంతో అందరూ ఊపిరి పీల్చుకున్నారు. ఈ ప్రమాదం జరిగిన ప్రాంతానికి కొద్దిపాటి దూరంలోనే వాగు కూడా ఉందని తెలిసి చాలా పెద్ద ప్రమాదం తప్పిందని స్థానికులు, ప్రయాణికులు ఊపిరిపీల్చుకున్నారు. అదే సమయంలో రామారెడ్డి మండలం వైపు వెళ్తున్న కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ బస్సులో ఉన్న ప్రయాణికుల క్షేమాలను అడిగి తెలుసుకున్నారు. ఇదిలా ఉంటే నాలుగు రోజుల క్రితం ఆగస్టు 18న నిర్మల్ డిపోకు చెందిన ఓ పల్లెవెలుగు బస్సు జగిత్యాల నుంచి నిర్మల్‌కు వెళ్తున్న క్రమంలో బస్సు వెనుక టైర్లు ఒక్కసారిగా ఊడిపోయాయి. దీంతో బస్సు బాడీ రోడ్డుపై పడి ముందుకు దూసుకెళ్లింది. డ్రైవర్ అప్రమత్తమై చాకచక్యంగా బస్సును కంట్రోల్ చేసి ఆపేయటంతో పెద్ద ప్రమాదమే తప్పింది. ప్రమాద సమయంలో బస్సులో కెపాసిటీకి మించి ఏకంగా 170 మంది ప్రయాణికులు ఉన్నట్టుగా వార్తలు వచ్చాయి. ఈ ఘటనపై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ కూడా స్పందిస్తూ ఆగ్రహం వ్యక్తం చేశారు.

# రుణాలు తీసుకున్న రైతులందరికీ రుణమాఫీ చేయాలి

**విశ్వంభర, ఆత్మకూరు(ఎం):** వివిధ బ్యాంకుల్లో రైతులు తీసుకున్న పంట రుణాలను ఎలాంటి షరతులు లేకుండా మాఫీ చేయాలని రైతు సంఘం జిల్లా సహాయ కార్యదర్శి కోమటిరెడ్డి చంద్రారెడ్డి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శుక్రవారం యాదాద్రి భువనగిరి జిల్లా ఆత్మకూరు(ఎం)మండల కేంద్రంలో గ్రామీణ వికాస బ్యాంక్ ముందు రైతులు ధర్నా నిర్వహించారు. అనంతరం తహసీ ల్దార్ కార్యాలయంలో డిప్యూటీ తహసీల్దార్ సఫియోద్దీన్ కు వినతి పత్రం ఇచ్చారు. ఈ సందర్భంగా చంద్రారెడ్డి మాట్లాడుతూ ప్రభుత్వం తెచ్చిన మార్గదర్శకాలను తక్షణమే సవరించాలని అన్నారు. రేషన్ కార్డులు, ఐటీ రిటర్న్, రీ షెడ్యూల్ లాంటి వాటిని పరిగణలోకి తీసుకోవద్దని అన్నారు. రుణాలు పూర్తిగా చెల్లించిన వారికి రుణమాఫీ చేయాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం చెప్పిన విధంగా 31 వేల కోట్ల రూపాయలను తక్షణమే విడుదల చేయాలన్నారు. బ్యాంకుల చుట్టూ, వ్యవసాయ అధికారుల చుట్టూ పనులు మానుకొని తిరుగుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. వ్యవసాయ అధికారులు రైతు వేదికల ద్వారా కాకుండా గ్రామ వేదికల ద్వారా రైతుల యొక్క టెక్నికల్ సమస్యలను పరిష్కరించాలని అన్నారు. ఎన్నికల మేనిఫెస్టోలో పెట్టిన విధంగా కాంగ్రెస్ ప్రభుత్వం మాఫీ చేయాలన్నారు. రైతుల ఖాతాల్లో రుణ మాఫీ డబ్బులను జమ చేసిన తర్వాత వడ్డీ డబ్బులను రికవరీ చేసుకోవాలని ప్రభుత్వానికి సూచించారు. ఈనెల 27న భువనగిరి జిల్లా కలెక్టరేట్ వద్ద జరిగే ధర్నాలో రాజకీయాల కతీతంగా రైతులు పెద్ద సంఖ్యలో పాల్గొనాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సీపీఎం మండల కార్యదర్శి వేముల భిక్షం, సీఐటీయూ మండల నాయకులు రచ్చ గోవర్ధన్, సీపీఎం గ్రామ శాఖ కార్యదర్శి రాచమల్ల సత్తయ్య, రైతు సంఘం మండల కార్యదర్శి తుమ్మల సత్యనారాయణ రెడ్డి, రైతులు పల్లెర్ల బుచ్చయ్య, వాకంటి మల్లారెడ్డి, కృష్ణారెడ్డి, మాధ రవి, మత్స్యగిరి, పులిగిల్ల చంద్రయ్య,




మర్రి సిద్దయ్య, వెంకటయ్య, సుజాత, కృష్ణమ్మ, లక్ష్మి, పద్మ, సత్తయ్య, కనకయ్య, యాకూబ్ రెడ్డి పాల్గొన్నారు.

# బదిలీల్లో జరిగిన అవకతవకలపై విచారణ జరిపిస్తాం

**- కమ్గర్ యూనియన్ అధ్యక్షులు మొగుళ్ళు రాజిరెడ్డి**



**విశ్వంభర, భూపాలపల్లి:** కమ్గర్ యూనియన్ అధ్యక్షులు మొగుళ్ళు రాజిరెడ్డి తన కార్యవర్గంతో జలమండలి మేనేజింగ్ డైరెక్టర్ ని కలసి ఉద్యోగుల సమస్యలపై చర్చించారు. అనంతరం ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ కు, డైరెక్టర్ పర్సనల్, ఛీఫ్ జనరల్ మేనేజర్ పర్సనల్ కి తగు అదేశాలు జారిచేశారు. పర్సనల్ డిపార్ట్మెంట్ లో పెండింగ్ లో ఉన్న జూనియర్ అసిస్టెంట్ ట్రాన్స్ఫర్స్ బై అప్పాయింట్ మెంట్, జూనియర్ అసిస్టెంట్ నుంచి సీనియర్ అసిస్టెంట్ ప్రమోషన్స్, జలమండలి ఉద్యోగులందరికీ ఈ.హెచ్.ఎస్, ప్రభుత్వ హెల్త్ కార్డులు ఇప్పించే ఏర్పాట్లు చేయాలని, క్వాలిటీ వింగ్ (క్యూఏటీ) జూనియర్ టెక్నికల్ ఆఫీసర్స్ కి అసిస్టెంట్ టెక్నికల్ ఆఫీసర్స్ (క్యూఏటీ) గా ప్రమోషన్స్ కు తగు ఆదేశాలు జారిచేయాలనీ, లోగడ జరిగిన బదిలీల అవకతవకలపై విచారణ జరిపి తగు చర్యలు తీసికొని, న్యాయం చేస్తానని కమ్గర్ యూనియన్ అధ్యక్షులు మొగుళ్ళు రాజిరెడ్డి హామీ ఇచ్చారు.

# మధ్యాహ్న భోజనం వంటశాలకు అదనపు రేకుల షెడ్



**విశ్వంభర, ఆత్మకూరు(ఎం):** యాదాద్రి భువనగిరి జిల్లా ఆత్మకూరు(ఎం) మండలం కోరటికల్ గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మధ్యాహ్న భోజన వంటశాలకు అదనంగా రేకుల షెడ్ నిర్మాణాన్ని పెద్ది సత్తయ్య జ్ఞాపకార్థం ఆయన కుమారుడు ఉపాధ్యాయులు బిక్షం 16,000 వేల రూపాయలు విరాళంతో చేయించారని పాఠశాల ప్రధానోపాధ్యాయులు డి.వెంకన్న తెలిపినారు. దాతలు, పూర్వ విద్యార్థులు సహకరించి పాఠశాల అభివృద్ధికి తోడ్పడాలని కోరారు. అమ్మ అధర్య పాఠశాల ఛైర్ పర్సన్ సత్యలక్ష్మి, ఉపాధ్యాయులు స్వామీ, రవి, వరప్రసాద్, శ్రీనివాస చారి, అనురాధ, వెంకటేశంలు పాల్గొన్నారు.

# బాధితునికి ఎల్ఓసీ అందజేసిన ఎమ్మెల్సీ దయానంద్ గుప్తా



**విశ్వంభర, ఎల్బీనగర్:** మహేశ్వరం నియోజకవర్గం మీర్పేట మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని ఓల్డ్ బాలాజీ నగర్ లో నివాసం ఉండే శ్యామ్ రావు కిడ్నీ వ్యాధితో బాధపడుతూ ఆస్పత్రిలో చేరారు. పరీక్షలు చేసిన నిమ్స్ ఆసుపత్రి వైద్యులు కిడ్నీ ట్రాన్స్లేట్ చేయాలని వైద్యానికి ఐదు లక్షల రూపాయలు ఖర్చు అవుతుందని తెలిపారు. శ్యామ్ రావు మహేశ్వరం నియోజకవర్గ సీనియర్ కాంగ్రెస్ పార్టీ నాయకులు బేర బాలకిషన్ ని సంప్రదించారు. కిడ్నీ వ్యాధితో బాధపడుతున్న దంపతులను శాసనమండలి సభ్యులు బుగ్గారపు దయానంద్ గుప్తా దృష్టికి తీసుకురాగా వెంటనే రాష్ట్ర ప్రభుత్వం ద్వారా శ్యామ్ రావుకి రూ .2,50,000 ఎల్ఓసీని మంజూరు చేయించి శుక్రవారం శ్యాంరావుకి అందజేశారు. ఈ సందర్భంగా శాసనమండలి సభ్యులు బుగ్గారపు దయానంద్ గుప్తా మాట్లాడుతూ ఇబ్బందుల్లో ఉన్నవారు ఎవరు వచ్చినా తాను ఎల్లవేళలా అందుబాటులో ఉంటానని, ప్రభుత్వం నుంచి వచ్చే సంక్షేమ ఫలాలను పేద ప్రజలందరూ ఉపయోగించుకోవాలని తెలిపారు.

# అడిగినంత లోను ఇవ్వలేదని గుండె ఆగి బ్యాంకులోనే రైతు మృతి



**విశ్వంభర, రామన్నపేట:** రామన్నపేట ఇస్కిల్ల గ్రామానికి చెందిన రైతు పొలిమేర గోపాల్ రుణమాఫీ అయ్యింది. కానీ కొత్త లోన్ ఇస్తలేరు అన్న బాధతో రైతు పొలిమేర గోపాల్ అక్కడికక్కడే అపస్మార్క స్థితిలోకి వెళ్లి చనిపోయాడు. రామన్నపేట మండలం ఇస్కిల్ల గ్రామనికి చెందిన పొలిమేర గోపాల్ మూడు ఎకరాల 35 గుంటల పొలానికి 1,30,000 రుణమాఫీ అయ్యింది. కొత్త లోన్ కోసం బ్యాంకు అధికారుల చుట్టూ తిరగగా నీకు ఏజ్ ఎక్కువగా ఉన్నది, నీ కుటుంబ సభ్యులను తీసుకునిరా అని ఇబ్బందులకు గురి చేశారు. ఇలా ఎన్నో మార్లు బ్యాంకుల చుట్టూ ప్రదక్షిణలు చేయించారు. నానా అవస్థలు పడిన తర్వాత 40,000 లోన్ ఇస్తానని అతను కోరుకున్న రెండు లక్షలు లోన్ ఇవ్వనందున మనోవేదనకు గురై బ్యాంకు లోనే చనిపోవడం జరిగిందని కుటుంబ సభ్యులు తెలిపారు. అతను చనిపోయిన తర్వాత బ్యాంకు అధికారి 80,000 లోను సాంక్షన్ చేశాడు. అంత్యక్రియల కోసం 40 వేలు, తర్వాత 40 వేల రూపాయలు ఇస్తానని మాట ఇచ్చారు.

# నూతన డీసీసీబీ చైర్మన్ విష్ణువర్ధన్ రెడ్డికి సన్మానం




**విశ్వంభర, ఆమనగల్లు:** ఉమ్మడి మహబూబ్ నగర్ జిల్లా డీసీసీబీ చైర్మన్ గా కొల్లాపూర్ నియోజకవర్గానికి చెందిన విష్ణువర్ధన్ రెడ్డి శుక్రవారం ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. మహబూబ్ నగర్ జిల్లా కేంద్రం డీసీసీబీ కార్యాలయంలో జరిగిన సమావేశంలో ఉమ్మడి జిల్లాకు చెందిన డైరెక్టర్లందరూ నూతన చైర్మన్ ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు తెలిపారు. ఇంతకుముందు డీసీసీబీ చైర్మన్ గా పనిచేసిన నిజాం పాషా అనారోగ్య కారణంగా రాజీనామా చేయడంతో ఎన్నికలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఉమ్మడి మహబూబ్ నగర్ జిల్లా డీసీసీబీ డైరెక్టర్ ఆమనగల్లు, కడ్తాల మండలాల సింగల్ విండో చైర్మన్ గంప వెంకటేష్ గుప్తా నూతనంగా ఎన్నికైన చైర్మన్ విష్ణువర్ధన్ రెడ్డిని శాలువాతో ఘనంగా సన్మానించి అభినందించారు. నూతనంగా ఎన్నికైన చైర్మన్ విష్ణువర్ధన్ రెడ్డి రైతుల సమస్యలను గుర్తించి ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి వాటి పరిష్కారానికి కృషి చేయాలన్నారు. సింగల్ విండోల ద్వారా, సహకార బ్యాంకుల ద్వారా రైతులకు అందే రుణాలను అర్హులైన ప్రతి రైతుకు అందే విధంగా కృషి చేయాలని కోరారు. రైతుల అభివృద్ధి, సంక్షేమమే ధ్యేయంగా పనిచేయాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో డీసీసీబీ వైస్ చైర్మన్ వెంకటయ్య, డైరెక్టర్లు రంగారెడ్డి, వంశీ రెడ్డి, భీమ్ రెడ్డి, నరసింహారెడ్డి, భూపాల్ రావు, నరసింహ, లక్ష్మీనారాయణ, జక్కు రఘునందన్ రెడ్డి, చంద్రు నాయక్, డీసీసీబీ సీఈవో లక్ష్మీనారాయణ, జీఎం పురుషోత్తం పాల్గొన్నారు.

# ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఎదుట ఎస్ఎఫ్ఐ నిరసన




**విశ్వంభర, భూపాలపల్లి:** భారత విద్యార్థి ఫెడరేషన్ ఎస్ఎఫ్ఐ జయశంకర్ భూపాలపల్లి జిల్లా కమిటీ ఆధ్వర్యంలో జిల్లా కేంద్రంలో ఉన్నటువంటి ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఎదుట డిగ్రీ మొదటి సంవత్సరంలో జాయిన్ అయ్యే విద్యార్థులకు స్పెషల్ పేస్ 2 నిర్వహించాలని నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ భూపాలపల్లి జిల్లా ప్రధాన కార్యదర్శి కుమ్మరి రాజు మాట్లాడుతూ డిగ్రీ విద్యార్థులకు సంబంధించి స్పెషల్ ఫేస్ టు నిర్వహించాలని వారు డిమాండ్ చేశారు. పోయిన సంవత్సరం లాగా ఈ సంవత్సరం కూడా మొదటి సంవత్సరంలో డిగ్రీలో జాయిన్ అయ్యే విద్యార్థులకు అవకాశం స్పెషల్ ఫేస్ టు ద్వారా కేటాయించాలని డిమాండ్ చేశారు. అదేవిధంగా ఇప్పటి వరకు కూడా ఇంకా డిగ్రీలో జాయిన్ అవ్వడానికి చాలా మంది విద్యార్థులు ఉన్నారు. ఈ సమస్యలను దృష్టిలో ఉంచుకొని తక్షణమే డిగ్రీ విద్యార్థులకు మొదటి సంవత్సరంలో జాయిన్ అయ్యే డిగ్రీ విద్యార్థులకు స్పెషల్ ఫేస్ టు నిర్వహించేలాగా చర్యలు తీసుకోవాలని ఎస్ఎఫ్ఐ భూపాలపల్లి జిల్లా కమిటీ ఆధ్వర్యంలో డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ హాస్టల్ కమిటీ సభ్యులు, రాజు డిగ్రీ విద్యార్థులు పాల్గొన్నారు.

# యాదాద్రి అపవిత్రం అయిందని నీటితో శుద్ది

**విశ్వంభర, యాదాద్రి:** హరీష్ రావు రాకతో యాదాద్రి అపవిత్రం అయిందని ఆలయ పరిసరాలను కాంగ్రెస్ ఎమ్మెల్యే నీటితో శుద్ధి చేశారు. యాదగిరిగుట్ట కొండపైన ఆలయ పరిసరాలను నీటితో శుద్ధి చేస్తున్న ఆలేరు ఎమ్మెల్యే ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య. మాజీ మంత్రి హరీష్ రావు కొండపైన సంకల్పం చేయడంతో ఆలయం అపవిత్రం ఆయిందంటూ కొండపైన ప్రధానాలయ ప్రాంగణం, మాడ వీధులను ఆలేరు ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య కాంగ్రెస్ నాయకులు నీటితో శుద్ధి చేశారు.



**(విశ్వంభర, హైదరాబాద్):** హైదరాబాద్ నార్సింగ్ లో జరిగిన తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సోదరుడు ఎనుముల జగదీశ్వర్ రెడ్డి కుమార్తె రిత్వికా రెడ్డి వివాహ నిశ్చితార్థ కార్యక్రమంలో గౌరవ తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి, తెలంగాణ రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ మంత్రి దామోదర రాజనర్సింహతో కలిసి పాల్గొన్న నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశం.




## వైద్యురాలిపై అత్యాచారం నిందితుడికి 14 రోజుల కస్టడీ

**విశ్వంభర, కోల్‌కత :** కోల్‌కతాలో మహిళా వైద్యురాలిపై అత్యాచారం, హత్య కేసులో విచారణ వేగవంతంగా జరుగుతున్నది. ఈ కేసులో ప్రధాన నిందితుడు అయిన సంజయ్ రాయ్‌ని ఇప్పటికే అరెస్ట్ చేసిన సీబీఐ అధికారులు కోర్టులో హాజరుపర్చగా కస్టడీకి అప్పగించింది. నేటితో సీబీఐ కస్టడీ ముగియడంతో సీబీఐ అధికారులు నిందితుడిని మరోసారి కోల్‌కతాలోని సిల్దా కోర్టులో హాజరుపర్చారు. దాంతో కోర్టు నిందితుడు సంజయ్ రాయ్‌కి 14 రోజుల జ్యుడీషియల్ కస్టడీ విధించింది. కాగా ఆగస్టు 8న కోల్‌కతాలోని ఆర్‌జీ కర్ ఆస్పత్రిలో నైట్ డ్యూటీలో ఉన్న ట్రెయినీ వైద్యురాలు.. ఆగస్టు 9న తెల్లవారుజామున విశ్రాంతి తీసుకుంటుండగా నిందితుడు సంజయ్ రాయ్ అత్యాచారానికి పాల్పడి, హత్య చేశాడు. ఘటనా ప్రాంతంలో దొరికిన నిందితుడి హెడ్‌సెట్ ఆధారంగా పోలీసులు అతడిని అదుపులోకి తీసుకున్నారు. ఈ ఘటనపై దేశవ్యాప్తంగా తీవ్ర నిరసనలు వ్యక్తమయ్యాయి. పశ్చిమబెంగాల్ ప్రభుత్వంతోపాటు కేంద్ర సర్కారు కూడా ముందుగా ఈ ఘటనపై విచారణ విషయంలో నిర్లక్ష్యం వహించడంతో నిరసనలు పెల్లుబికాయి. దేశవ్యాప్తంగా అన్ని ప్రభుత్వ ఆస్పత్రుల్లో పనిచేస్తున్న జూనియర్ డాక్టర్‌లు అందోళనకు దిగారు. ఓపీ సేవలను బహిష్కరించారు. దాంతో కేంద్రం ఈ ఘటనపై సీబీఐ విచారణకు ఆదేశించింది. కేసు దర్యాప్తు చేపట్టిన సీబీఐ అధికారులు నిందితుడిని అరెస్ట్ చేసి విచారిస్తున్నారు.

## నామినేషన్ స్వీకరించిన కమలా హారిస్



**చికాగో:** డెమోక్రటిక్ పార్టీ అధ్యక్ష అభ్యర్థిగా అమెరికా ఉపాధ్యక్షురాలు కమలా హ్యారిస్ ఇవాళ నామినేషన్ స్వీకరించారు. చికాగోలో జరిగిన డీఎన్సీ మీటింగ్‌లో ఆమె నామినేషన్ ఆమోదించారు. డెమోక్రటిక్ పార్టీ తరపున అధ్యక్ష అభ్యర్థిగా నామినేషన్ స్వీకరించిన రెండో మహిళగా కమలా హ్యారిస్ నిలిచారు. కన్వెన్షన్‌లో హ్యారిస్ మాట్లాడుతూ తన తల్లి శ్యామలా గోపాలన్‌ను గుర్తు చేసుకున్నారు. ప్రతి రోజూ తన తల్లిని మిస్ అవుతున్నట్లు ఆమె చెప్పారు. గత కొన్నాళ్లుగా తాను వెళ్తున్న దారి అసాధారణమైందన్నారు. కానీ ఇలాంటి జర్నీలు కొత్తేమీ కాదన్నారు. తన తల్లి పైనుంచి చూస్తుంటుందని, ఆమె సంతోషంతో దీవిస్తుందని ఆశిస్తున్నట్లు హ్యారిస్ తెలిపారు. 19 ఏళ్ల వయసులో తన తల్లి దేశం దాటి వచ్చినట్లు గుర్తు చేశారు. బ్రెస్ట్ క్యాన్సర్ సైంటిస్టుగా కెరీర్ కోసం తన తల్లి ఇండియా నుంచి కాలిఫోర్నియా వచ్చినట్లు కమలా హ్యారిస్ వెల్లడించారు. తన తల్లే తనను పెంచినట్లు ఆమె చెప్పారు. స్వంత ఇల్లు కొనడానికి ముందు ఈస్ట్ బేలో ఓ చిన్న అపార్ట్‌మెంట్‌లో కిరాయికి ఉండేవాళ్లమని తెలిపారు. ఫ్లాట్‌ల్యాండ్స్ వద్ద ఉన్న తమ ఇంటి చుట్టూ ఫైర్‌ఫైటర్లు, నర్సులు, కన్‌స్ట్రక్షన్ వర్కర్లు కలగొలుపుగా ఉండేవారన్నారు. 19 ఏళ్ల వయసులో శ్యామలా గోపాలన్.. ఉన్నత విద్య కోసం అమెరికా వెళ్లారు.

## ట్రంప్‌ను చంపేస్తానని బెదిరింపులు.. వ్యక్తి అరెస్టు



**వాషింగ్టన్:** అమెరికా మాజీ అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్పై దాడి జరిగిన అనంతరం సీక్రెట్ సర్వీసెస్ ఆయనకు భారీ భద్రతను పెంచింది. కాగా ఇటీవల సోషల్ మీడియాలో ట్రంప్ను చంపేస్తానని పోస్టు పెట్టిన ఓ వ్యక్తిని పోలీసులు అరెస్టు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. అరిజోనాలోని కోచిస్ కౌంటీ ప్రాంతానికి చెందిన రోనాల్డ్ సిస్రుద్(66) కొద్దికాలంగా సోషల్ మీడియాలో ట్రంప్ను హత్య చేస్తానని పోస్టులు పెడుతున్నాడు. వీటిని గమనించిన సీక్రెట్ సర్వీసెస్ తీవ్రంగా గాలింపు చర్యలు చేపట్టింది. అరిజోనాలో తీవ్రంగా గాలించి నిందితుడిని అరెస్టు చేసినట్లుగా పోలీసులు వెల్లడించారు. నిందితుడిపై అనేక ప్రాంతాల్లో హిట్ అండ్ రన్, లైంగిక వేధింపుల కేసులు ఉన్నాయన్నారు.

## అయోధ్య రాముడికి రూ.2100 కోట్ల చెక్...కానీ ట్విస్ట్

**అయోధ్య :** ప్రధానమంత్రి రిలీఫ్ ఫండ్కు భారీ విరాళం అందేలా శ్రీరామ జన్మభూమి తీర్థ క్షేత్ర ట్రస్టుకు రూ.2,100 కోట్ల చెక్కు రావడం చర్చనీయాంశమైంది. ఈ చెక్కును పంపిన వ్యక్తి దానిపై తన పేరు, మొబైల్ నంబర్, అడ్రస్ను రాశారు. కానీ చెక్కును ప్రధానమంత్రి రిలీఫ్ ఫండ్ పేరు మీద ట్రస్టుకు పోస్టు ద్వారా పంపించారు. ఈ విషయాన్ని శ్రీరామ జన్మభూమి తీర్థక్షేత్ర ట్రస్ట్ ప్రధాన కార్యదర్శి చంపత్ రాయ్ వెల్లడించారు. రెండు రోజుల క్రితమే ఈ చెక్కు తమ కార్యాలయానికి వచ్చినట్లు తెలిపారు. అయితే ఆ చెక్ గురించి పూర్తి వివరాలు తెలుసుకోవాలని, ప్రధాన మంత్రి కార్యాలయానికి పంపించాల్సిందిగా ట్రస్టు అధికారులను ఆదేశించినట్లు చంపత్ రాయ్ చెప్పారు.



# నేపాల్‌లో ఘోర ప్రమాదం

## నదిలో పడిన బస్సు.. 27 మంది మృతి

**నేపాల్ :** నేపాల్‌లో ఘోర ప్రమాదం చోటు చేసుకుంది. రోడ్డుపై వెళ్తున్న ఓ బస్సు ప్రమాదవశాత్తు నదిలోకి దూసుకెళ్లింది. దీంతో ఆ బస్సులో ప్రయాణిస్తున్న ప్రయాణికుల్లో కొందరు ఆ నదిలో పడి గల్లంతయ్యారు. భారత్‌కు చెందిన ఆ బస్సు నేపాల్‌లో పర్యటిస్తుండగా ఈ ఘటన జరిగింది. బస్సు నదిలో పడిన సమాచారం అందుకున్న అధికారులు రంగంలోకి దిగి సహాయక చర్యలు చేపట్టారు. అందులో చిక్కుకున్న ప్రయాణికులను బయటికి తీస్తున్నారు. గల్లంతైన వారి కోసం గాలింపు చేపట్టారు. ఈ ఘటనలో 27 మంది మరణించారని సమాచారం. పలువురు గాయపడ్డారు. పదుల సంఖ్యలో ప్రయాణికులతో నేపాల్లోని పొఖారా నుంచి కార్మండూకు బయలుదేరిన బస్సు, తనాహున్ జిల్లాలోని ఐరా పహారా ప్రాంతంలో మార్స్యంగ్డి నదిలో పడిపోయింది. ఈ ఘటనపై సమాచారం అందుకున్న పోలీసులు, రెస్క్యూ సిబ్బంది ఘటనాస్థలికి చేరుకుని సహాయక చర్యలు చేపట్టారు. క్షతగాత్రులను ఆస్పత్రికి తరలించారు.

ఉత్తర్‌ప్రదేశ్ రిజిస్ట్రేషన్(UP 53 FT 7623) ఉన్న ఓ ట్రావెల్స్ బస్సు నేపాల్లోని పొఖారా నుంచి కాఠ్మాండూకు వెళ్తోంది. ఈ క్రమంలో తనాహున్ జిల్లాలోని ఐరా పహారా ప్రాంతానికి చేరుకోగానే బస్సు అదుపుతప్పి మర్స్యాంగ్డి నదిలో పడిపోయింది. ఈ ప్రమాదం శుక్రవారం ఉదయం 11.30 గంటలకు జరిగినట్లు అధికారులు తెలిపారు. ఈ ఘటన గురించి సమాచారం అందుకున్న నేపాల్ ఆర్మీ సహాయక చర్యల కోసం రంగంలోకి దిగింది. 45మందితో కూడిన రెస్క్యూ టీమ్ ప్రమాదస్థలికి చేరుకుని 29మంది ప్రయాణికులను రక్షించి ఆస్పత్రికి తరలించింది. గాయపడిన వారి ఆరోగ్య పరిస్థితి గురించి వివరాలు తెలియాల్సి ఉంది. మరోవైపు, నేపాల్ ప్రభుత్వం సహాయక చర్యలను ముమ్మరం చేసింది. నేపాల్ ఆర్మీకి చెందిన MI17 హెలికాప్టర్లో మెడికల్ టీమ్ను ఘటనాస్థలికి పంపించింది. ఇదిలా ఉండగా, ఈ దుర్ఘటనపై ఉత్తరప్రదేశ్కు చెందిన ఓ అధికారి స్పందించారు. అక్కడి స్థానిక అధికారులతో మాట్లాడి సమాచారం తెలుసుకుంటున్నట్లు వెల్లడించారు.



## 156 ఔషధాలపై కేంద్రం నిషేధం



**విశ్వంభర, కోల్‌కత :** కేంద్ర ప్రభుత్వం గురువారం 156 ఫిక్సడ్ డోస్ కాంబినేషన్ మందులను నిషేధించింది. వీటిలో యాంటీబయాటిక్స్, నొప్పి నివారణ, మల్టీవిటమిన్ మందులు కూడా ఉన్నాయి. నిపుణుల కమిటీ ఈ కాంబినేషన్‌లకు చికిత్సాపరమైన సమర్థన లేదని గుర్తించిందని, అవి రోగులకు ప్రమాదం కలిగించవచ్చని పేర్కొంది. ఈ మందులు ఆరోగ్యానికి ముప్పు కలిగిస్తాయని పరిశోధనలో తేలింది. ఈ క్రమంలో ఈ మందుల తయారీ, విక్రయం, పంపిణీని పూర్తిగా నిషేధిస్తున్నామని కేంద్ర ఆరోగ్య, కుటుంబ సంక్షేమ మంత్రిత్వ శాఖ నోటిఫికేషన్ జారీ చేసింది.

స్థిర మోతాదు కలయిక మందులు ఒకటి కంటే ఎక్కువ క్రియాశీల పదార్థాలను కలిగి ఉంటాయి. ఇటువంటి కలయికలు క్షయ మరియు మధుమేహం వంటి అనారోగ్యంతో బాధపడుతున్న రోగులకు తక్కువ మాత్రలు తీసుకోవడంలో సహాయపడతాయి, అయితే వారు రోగులకు అవసరం లేని పదార్థాలను పంపిణీ చేయడం జరుగుతోంది. ఉదాహరణకు, రోగులకు పారాసెటమాల్ మాత్రమే అవసరమైనప్పుడు జ్వరం కోసం యాంటీబయాటిక్ కలయికను తీసుకోవడం చేయవచ్చు. 156 నిషేధిత ఔషధాలలో ప్రముఖంగా ఉపయోగించిన యాంటీఅలెర్జిక్ ఔషధాల కలయికతో నాసికా డీకాంగెస్టెంట్, శ్లేష్మం మరియు పారాసెటమాల్‌ను విచ్ఛిన్నం చేసే సిరప్‌లు ఉన్నాయి. ఈ జాబితాలో యాంటీబయాటిక్స్ కలయికలు కూడా ఉన్నాయి. వికారం నిరోధించడానికి మైగ్రేన్ ఔషధాన్ని ఒకదానితో కలపడం, కలబందతో మెంథాల్ వంటి సప్లిమెంట్ల కలయిక మరియు యాంటిసెప్టిక్ ఏజెంట్, కలబంద సారం మరియు విటమిన్తో బర్న్ మెడిసిన్ సిల్వర్ సల్ఫాడియాజైన్ కలయిక నిషేధించబడిన వాటిలో కొన్ని. మెఫెనామిక్ యాసిడ్ కలయిక సాధారణంగా ఋతు తిమ్మిరి కోసం తీసుకోబడుతుంది

సాధారణ యాంటీఫైబ్రోటిక్ ఔషధం ట్రానెక్సామిక్ యాసిడ్ కూడా జాబితాలో ఉంది. కాబట్టి రక్త నాళాలు మరియు కండరాలను సడలించే ఔషధంతో వయాగ్రా సిల్డెనాఫిల్‌లోని క్రియాశీల పదార్థం కలయిక. 2016లో ప్రభుత్వం 344 ఔషధాలను నిషేధించిన తర్వాత ఎఫ్‌డిసిలపై జరిగిన అతిపెద్ద అణిచివేత ఇది, ఆ తర్వాత ఔషధ తయారీదారులచే సవాలు చేయబడింది. కోర్టు ఆదేశాల ప్రకారం, ఈ విషయం డ్రగ్స్ టెక్నికల్ అడ్వైజరీ బోర్డ్‌కు తిరిగి పంపబడింది,ఈ సిఫార్సుపై, ప్రభుత్వం 2018లో 328 కాంబినేషన్‌లను నిషేధించింది. 1988కి ముందు తయారు చేసిన పదిహేను FDCలను నిషేధం పరిధి నుండి దూరంగా ఉంచారు. మూలాల ప్రకారం, ప్రస్తుత జాబితాలో గతంలో నిషేధం నుండి మినహాయించబడిన 1988కి ముందు ఉన్న కొన్ని ఔషధాలు కూడా ఉన్నాయి. ఇప్పటికే మార్కెట్లో ఉన్న ఉత్పత్తులను ఔషధ కంపెనీలు ఎలా ఉపసంహరించుకుంటాయి? అంతేకాకుండా, 1988కి ముందు ఉన్న డ్రగ్స్ కూడా ఈ నోటిఫికేషన్ ద్వారా నిషేధించబడ్డాయి, ఈ మందులు సంవత్సరాలుగా వాడుకలో ఉన్నాయి. హాని ఉన్నట్లు ఎటువంటి రుజువు లేదు అని వ్యాపారులు వాపోతున్నారు. కొన్ని రోజుల క్రితం, ఆరోగ్య మంత్రిత్వ శాఖ ఒక నొప్పి మందులతో కూడిన పారాసెటమాల్‌ను నిషేధించింది. అంతర్జాతీయ ఇన్నోవేటర్స్ కాంబినేషన్ డ్రగ్‌కు సమానమైన సామర్థ్యాన్ని ప్రదర్శించడానికి మరో రెండు కాంబినేషన్‌లను కోరింది.

## జమ్ము కశ్మీర్ ఎన్‌సీతో పొత్తుపై అమిత్ షా మండిపాటు



**న్యూఢిల్లీ :** జమ్ము కశ్మీర్ అసెంబ్లీ ఎన్నికల్లో నేషనల్ కాన్ఫరెన్స్ పార్టీతో కాంగ్రెస్ పొత్తు పెట్టుకోవడంపై కేంద్రమంత్రి అమిత్ షా మండిపడ్డారు. కాంగ్రెస్ పార్టీ అధికార దాహంతో పదేపదే దేశ సమైక్యత, భద్రతను పణంగా పెడుతోందని ఆరోపించారు. జమ్ము కశ్మీర్‌లో అబ్దుల్లా కుటుంబానికి చెందిన ఎన్సీ పార్టీతో పొత్తు పెట్టుకోవడం ద్వారా కాంగ్రెస్ మరోసారి తన కుటిల ఉద్దేశాలను బయటపెట్టిందన్నారు. ఈ మేరకు ఆయన ఎక్స్ వేదికగా ట్వీట్ చేశారు.

నేషనల్ కాన్ఫరెన్స్ మేనిఫెస్టోలో ఇచ్చిన వాగ్దానాల దృష్ట్యా, కాంగ్రెస్ పార్టీకి, ఆ పార్టీ ముఖ్యనేత రాహుల్ గాంధీకి తాను 10 ప్రశ్నలు సంధిస్తున్నానన్నారు.

1. జమ్ము కాశ్మీర్‌కు ప్రత్యేక జెండాపై నేషనల్ కాన్ఫరెన్స్ వాగ్దానానికి కాంగ్రెస్ మద్దతు ఇస్తుందా?
2. ఆర్టికల్ 370, 35Aలను పునరుద్ధరించే జేకేఎన్‌సీ నిర్ణయానికి రాహుల్ గాంధీ, కాంగ్రెస్ పార్టీ మద్దతు ఇస్తుందా? తద్వారా జమ్ము కాశ్మీర్‌లో తిరిగి అశాంతి, ఉగ్రవాద యుగంలోకి నెట్టివేయాలనుకుంటుందా?
3. కశ్మీర్ యువతతో కాకుండా పాకిస్థాన్‌తో చర్చలు జరపడం ద్వారా మళ్లీ వేర్పాటువాదాన్ని ప్రోత్సహించడాన్ని కాంగ్రెస్ సమర్థిస్తుందా?
4. పాకిస్థాన్‌తో 'ఎల్‌ఓసీ ట్రేడ్' ప్రారంభించాలని నేషనలిస్ట్ కాంగ్రెస్ పార్టీ భావిస్తోంది... తద్వారా సరిహద్దు వెంబడి ఉగ్రవాదాన్ని పెంచి పోషించాలనే నేషనల్ కాన్ఫరెన్స్ నిర్ణయానికి కాంగ్రెస్ పార్టీ, రాహుల్ గాంధీ మద్దతు ఇస్తున్నారా?
5. తీవ్రవాదం, రాళ్లతో దాడికి పాల్పడిన వారి బంధువులను ప్రభుత్వ ఉద్యోగాల్లోకి తిరిగి చేర్చుకోవడానికి కాంగ్రెస్ మద్దతు ఇస్తుందా?
6. కాంగ్రెస్ పార్టీ రిజర్వేషన్ వ్యతిరేక వైఖరిని ఇండియా కూటమి బట్టబయలు చేసింది. దళితులు, గుజ్జర్లు, బకర్వాల్, పహాడీ వర్గాలకు రిజర్వేషన్లు రద్దు చేస్తామని, తద్వారా వారికి అన్యాయం చేస్తామని నేషనల్ కాన్ఫరెన్స్ పార్టీ చెబుతోంది. అలాంటి పార్టీకి కాంగ్రెస్ మద్దతు ఇస్తోందా?
7. 'శంకరాచార్య కొండ'ను 'తఖ్త్‌ఎసులేమాన్'గా, 'హరి కొండ'ను 'కోహ్‌ఎమారన్'గా పిలవాలని కాంగ్రెస్ కోరుకుంటుందా?
8. జమ్ము కశ్మీర్ ఆర్థిక వ్యవస్థను తిరిగి అవినీతిలోకి నెట్టి... పాకిస్థాన్ మద్దతు కలిగిన కుటుంబాలకు పాలనా బాధ్యతలను అప్పగించే రాజకీయాలకు కాంగ్రెస్ మద్దతు ఇస్తుందా?
9. జమ్ము, కశ్మీర్ లోయ మధ్య వివక్ష రాజకీయాలకు పాల్పడుతున్న జేకేఎన్‌సీకి కాంగ్రెస్ పార్టీ మద్దతు ఇస్తుందా?
10. కశ్మీర్‌కు స్వయం ప్రతిపత్తి దిశగా నేషనల్ కాన్ఫరెన్స్ విభజన రాజకీయాలకు కాంగ్రెస్ పార్టీ, రాహుల్ గాంధీ మద్దతు ఇస్తున్నారా?

అంటూ ప్రశ్నల వర్షం కురిపించారు.

## కేజ్రీవాల్‌ను విచారించేందుకు సీబీఐకి అనుమతి



**విశ్వంభర, ఢిల్లీ :** ఢిల్లీ మద్యం పాలసీ కేసులో సీఎం అరవింద్ కేజ్రీవాల్ సీబీఐ అరెస్టు చేయడాన్ని సవాల్ చేస్తూ, బెయిల్ కోరుతూ దాఖలు చేసిన పిటిషన్ల విచారణను సుప్రీంకోర్టు సెప్టెంబర్ 5కు వాయిదా వేసింది. మరోవైపు ఈ కేసులో కేజ్రీవాల్‌ను విచారించేందుకు అనుమతి లభించినట్లు కేంద్ర దర్యాప్తు సంస్థ సీబీఐ వెల్లడించింది. ఇదే కేసుకు సంబంధించి నమోదైన అవినీతి కేసులో ఆప్ ఎమ్మెల్యే దుర్గేశ్ పాఠక్‌ను విచారించనున్నట్లు తెలిపింది. ఢిల్లీలోని రౌస్ అవెన్యూ కోర్టు ప్రత్యేక న్యాయమూర్తి కావేరీ భావేజాకు సీబీఐ ఈ విషయాన్ని వెల్లడించింది. ఢిల్లీ మద్యం పాలసీ కేసులో కేజ్రీవాల్‌ను జూన్ 26న సీబీఐ అరెస్టు చేసింది. ఆయన జ్యుడీషియల్ కస్టడీ ఆగస్టు 27న ముగియనుంది. ఇదే సమయంలో కేజ్రీవాల్, పాఠక్‌లను ప్రశ్నించేందుకు అవసరమైన అనుమతుల కోసం 15 రోజుల సమయం ఇస్తున్నట్లు ఆగస్టు 12న న్యాయస్థానం పేర్కొంది. ఈ క్రమంలోనే సీఎం కేజ్రీవాల్‌ను ప్రశ్నించేందుకు అనుమతి పొందినట్లు సీబీఐ పేర్కొంది.

## ఆర్జీకర్ ప్రిన్సిపల్‌పై అవినీతి ఆరోపణల కేసు సీబీఐకి



**కోల్‌కత:** కోల్కతాలో ఆర్జీ కర్ వైద్య కళాశాల మాజీ ప్రిన్సిపల్ సందీప్ ఘోష్ అవినీతి ఆరోపణలు ఎదుర్కొంటున్న విషయం తెలిసిందే. ఈ కేసును ప్రత్యేక సిట్ బృందం దర్యాప్తు చేస్తోంది. తాజాగా ఈ కేసును సీబీఐకి అప్పగించాలని కలకత్తా హైకోర్టు సిట్ని ఆదేశించింది. సీసీటీవీ ఫుటేజీలు, కేసు డైరీతో సహా అన్ని వివరాలను శనివారం ఉదయం 10 గంటల్లోపు సీబీఐకి అందించాలని హైకోర్టు పేర్కొంది.

కోల్కతాలోని ఆర్జీ కర్ వైద్య కళాశాల ఆసుపత్రిలో జూనియర్ వైద్యురాలిపై హత్యాచార ఘటన దేశవ్యాప్తంగా సంచలనం సృష్టిస్తోంది. అయితే ఘటన జరిగిన రెండు రోజుల తర్వాత కాలేజీ ప్రిన్సిపల్ ఉన్న సందీప్ ఘోష్ రాజీనామా చేశారు. ఆయన పదవీకాలంలో అనేక అవినీతి ఆరోపణలకు పాల్పడ్డారని మీడియా కథనాలు వెలువడ్డాయి. అనాథ శవాలను అమ్ముకోవడం, వాడేసిన సిరంజులు, ఇతర సామాగ్రిని రీసైక్లింగ్ చేసి సొమ్ము చేసుకొనేవారని ఇటీవల ఓ అధికారి పేర్కొన్నారు.

ఇక, ఆర్జీ కర్ మెడికల్ కాలేజీలో వైద్య విద్యార్థినిపై జరిగిన హత్యాచార ఘటన చోటుచేసుకున్న రోజు డ్యూటీలో ఉన్న సందీప్ ఘోష్ను సీబీఐ విచారిస్తోంది. ఈ విచారణ సమయంలో పొంతనలేని సమాధానాలు చెప్పినట్లు తెలిసింది. ఆయనకు లై డిటెక్టర్ పరీక్ష నిర్వహించాలని సీబీఐ నిర్ణయించింది. ఇందుకు న్యాయస్థానం సైతం అనుమతినిచ్చింది. దీంతో త్వరలోనే మాజీ ప్రిన్సిపల్ సందీప్ ఘోష్తో పాటు మరో నలుగురిపై సీబీఐ పాలీగ్రాఫ్ టెస్ట్ నిర్వహించనుంది.

## 11 బిల్లులను వెనక్కి పంపిన కర్ణాటక గవర్నర్

**కర్ణాటక :** కర్ణాటక సిద్ధరామయ్య ప్రభుత్వం పంపిన 11 బిల్లులను గవర్నర్ థాపర్ చంద్ గహ్లోత్ వెనక్కి పంపారు. ముడా కేసులో ముఖ్యమంత్రి సిద్ధరామయ్యపై ప్రాసిక్యూషన్‌కు గవర్నర్ ఇటీవల అనుమతి ఇచ్చారు. దీంతో ప్రభుత్వానికి, గవర్నర్కు మధ్య దూరం పెరిగినట్లు వార్తలు వచ్చాయి. ఈ నేపథ్యంలోనే మరింత వివరణ కోరుతూ 11 బిల్లులను గవర్నర్ వెనక్కి పంపడం గమనార్హం. అందులో మూడు బిల్లులను గవర్నర్ రెండోసారి వెనక్కి పంపడం ప్రాధాన్యం సంతరించుకుంది. కర్ణాటక పబ్లిక్ ఎగ్జామినేషన్ సవరణ బిల్లు 2023, కర్ణాటక హిందూ మత సంస్థలు, స్వచ్ఛంద ధర్మాదాయ సవరణ బిల్లు 2023, కర్ణాటక టౌన్ అండ్ రూరల్ ప్లానింగ్ సవరణ బిల్లులను గవర్నర్ రెండోసారి వెనక్కి పంపారు. వీటితోపాటు మరికొన్ని బిల్లులను గవర్నర్ వెనక్కి తిప్పి పంపారు. వాటిపై తమకు మరింత సమాచారం కావాలని కోరారు.

# భూముల రిజిస్ట్రేషన్ చార్జీలు పెంచొద్దు

**- రియల్టర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు బొంగు వెంకటేష్ గౌడ్**



**విశ్వంభర, హైదరాబాద్:** రాష్ట్రంలో భూముల రిజిస్ట్రేషన్ చార్జీలు పెంచొద్దని పేదల సొంతింటి కళలను దూరం చేయొద్దని తెలంగాణ రియల్టర్స్ అసోసియేషన్ జేఏసీ రాష్ట్ర అధ్యక్షుడు బొంగు వెంకటేష్ గౌడ్ అన్నారు. ప్రభుత్వాలు మారినప్పుడల్లా పేద ప్రజల పైన భారం వేస్తున్నారని ఒక చేత్తో ఇస్తు మరో చేత్తో లాక్కుంటున్నారని అన్నారు. ప్రభుత్వానికి ఆదాయ వనరులు పెంచుకోవడానికి చాలా మార్గాలు ఉన్నాయని అన్నారు. ఒక వైపు రైతు రుణమాఫ, రైతు భరోసా, ఉచిత బస్సు ప్రయాణం, ఉచిత విద్యుత్తు అంటూ ఉచిత పథకాలు ఇస్తూ ప్రజలను సోమరులను చేస్తున్నారని దుయ్యబట్టారు. ప్రభుత్వానికి ఆదాయం కావలంటే మార్కెట్ విలువలు పెంచుకోవాలని రిజిస్ట్రేషన్ చార్జీలు పెంచొద్దని ప్రభుత్వానికి సూచన చేశారు. దాని మూలంగా పేద మధ్య తరగతి ప్రజలు సొంతింటి కళలకు దూరం చేసిన వారు అవుతారని చెప్పారు. భూమికి మార్కెట్ విలువలకు తేడా ఉన్నది వాస్తవమని అందుకు అనుగుణంగా మార్కెట్ వాల్యు ఇప్పుడు ఉన్నదాని కంటే రెట్టింపు చేయడంలో తప్పులేదు కానీ రిజిస్ట్రేషన్ చార్జీలు పెంచొద్దని ప్రభుత్వానికి సలహాలు ఇచ్చారు. గత ప్రభుత్వము రియల్ ఎస్టేట్ వ్యాపారుల పొట్టగొట్టినందుకే బీఆర్ఎస్ ప్రభుత్వానికి వీఆర్ఎస్ ఇచ్చారని గుర్తుచేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజా ప్రభుత్వమని ప్రజా పాలన అందిస్తారని అన్ని వర్గాలకు న్యాయం జరుగుతుందని నమ్మి గెలిపించారు కాని ఈ ప్రభుత్వం కూడ ఎల్ఆర్ఎస్ చార్జీలు పెంచుతామని ఇప్పుడు ఉన్న రిజిస్ట్రేషన్ 7.5% చార్జీలను పెంచి ప్లాటు కొన్న దానికంటే రిజిస్ట్రేషన్ చార్జీలు అధికం చేస్తామని అంటున్నారు. రిజిస్ట్రేషన్ చార్జీలు పెంచడం మూలంగా ప్లాటు కొన్నదాని కంటే రిజిస్ట్రేషన్ చార్జిలే అధికమవుతాయని దీని మూలంగా అమ్మకు దారులు కొనుగోలుదారులు ఇబ్బందులకు గురవుతారని గుర్తు చేశారు. అదేవిధంగా ఎల్ఆర్ఎస్ చార్జీలు పెంచి రెండు చేత్తో ప్రజలను, ఇటు వ్యాపారులను ఇబ్బందులకు గురి చేసిన వారవుతారని అన్నారు. ఇప్పుడు ఉన్న 7.5% రిజిస్ట్రేషన్ చార్జీలను 3%తగ్గించాలని తెలంగాణ రియల్టర్స్ అసోసియేషన్ జేఏసి ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. ఒకవైపు రిజిస్ట్రేషన్ చార్జీలు మరోవైపు ఎల్ఆర్ఎస్ చార్జీలు కలిపితే లక్షల రూపాయలు చెల్లించాల్సి వస్తుందని చెప్పడం జరిగింది. మార్కెట్ విలువ పెంచిన ఎల్ఆర్ఎస్ చార్జీలు పెంచకుండా ప్రభుత్వం తగు చర్యలు తీసుకోవాలని కోరారు.

# బల్దియాలో అంతర్గత బదిలీలు

**22 మంది డసీ,జేసీలకు స్థానాచలనం**

**ఇద్దరు అదరపు కమిషనర్లకు పోస్టింగ్ లు**

**ఓ జోనల్ కమిషనర్ కు అదనపు బాధ్యతలు**




**విశ్వంభర, హైదరాబాద్:** జీహెచ్ ఎంసీలో మూడు నెలల నుంచి పెండింగులో ఉన్న అంతర్గత బదిలీలకు శుక్రవారం మోక్షం కలిగింది. ఫలితంగా 22 మంది డిప్యూటీ కమిషనర్లు, జాయింట్ కమిషనర్లకు స్థానచలనం కల్పిస్తూ జీహెచ్ ఎంసీ కమిషనర్ ఆమ్రపాలి శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు. వీరిలో మున్సిపల్ శాఖలో జాయిన్ డైరెక్టర్ గా పనిచేస్తున్న రఘు ప్రసాద్‌ను శానిటేషన్ అండ్ ట్రాన్స్‌పోర్ట్ విభాగానికి అడిషనల్ కమిషనర్ గా నియమించారు. జీహెచ్ ఎంసీకి బదిలీ అయ్యి సుమారు 20 రోజులు గడుస్తున్నా పోస్టింగ్ లేకుండా వెయిటింగ్ లో ఉన్న అశోక్ సామ్రాట్ ను ఎస్టేట్ విభాగానికి అదరపు కమిషనర్ గా నియమించారు. దీంతోపాటు ప్రస్తుతం శేర్ లిగంపల్లి కమిషనర్ గా వ్యవహరిస్తున్న ఉపేందర్ రెడ్డికి కార్పొరేట్ సోషల్ రెస్పాన్సిబిలిటీ పర్యవేక్షణ బాధ్యతలను అదనంగా అప్పగిస్తూ ఉత్తర్వులు జారీ అయ్యాయి. మిగిలిన 22 మంది డిప్యూటీ కమిషనర్లు, జాయింట్ కమిషనర్లకు ఒక సర్కిల్ నుంచి మరో సర్కిల్ కి, సర్కిల్ నుంచి హెడ్ ఆఫీస్ కి బదిలీ చేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు.

# సీఈ నివేదిక ఆధారంగానే నిర్మాణ స్థలాన్ని పరిశీలించకుండా ఆమోదం

**కాళేశ్వరంపై జస్టిస్ ఘోష్ కమిషన్ ముందు వివరించిన ఎస్ఈ ఫజల్**



**విశ్వంభర ,తెలంగాణ బ్యూరో :** కాళేశ్వరం ప్రాజెక్టులో జరిగిన అవకతవకలకు సంబంధించి జస్టిస్ ఘోష్ కమిషన్ విచారణ కొనసాగుతోంది. ఈ క్రమంలోనే సెంట్రల్ డిజైన్స్ ఎస్ఈ ఫజల్ కమిషన్ ముందు శుక్రవారం హాజరయ్యారు. ఈ మేరకు కమిషన్ ముందు శుక్రవారం హాజరైన ఫజల్ను జస్టిస్ పీసీ ఘోష్ ప్రశ్నించారు. పలు వివరాలను ఫజల్ కమిషన్కు తెలియజేశారు. మేడిగడ్డ ఆనకట్ట నిర్మాణంలో సీకెంట్ పైల్స్ కు వెళ్లాలని ఎన్ఐటీ వరంగల్ సిఫార్సుల మేరకు అప్పటి కాళేశ్వరం సీఈ చెప్పారని సెంట్రల్ డిజైన్స్ ఆర్గనైజేషన్ ఎస్ఈ ఫజల్ తెలిపారు. గతంలో దాఖలు చేసిన అఫిడవిట్ ఆధారంగా అడిగిన ప్రశ్నలకు ఫజల్ సమాధానాలు చెప్పారు. కాళేశ్వరం సీఈ నివేదిక ఆధారంగానే ఆనకట్టల నిర్మాణ స్థలాన్ని పరిశీలించకుండానే క్రాస్ సెక్షన్స్ ఆమోదించినట్లు కూడా ఫజల్ పేర్కొన్నారు. సుందిళ్ల ఆనకట్ట రెండో బ్లాక్ ఏ లో అదనపు ఆరు వెంట్లు డిజైన్స్లో మొదట లేవని ఆ తర్వాత చేర్చినట్లు తెలిపారు. మంత్రివర్గ నిర్ణయం మేరకే అదనపు వెంట్ల నిర్మాణం జరిగిందని అన్నారు. అటు జస్టిస్ పీసీ ఘోష్ కమిషన్ ముందు సీడీఓ విశ్రాంత ఈఎన్సీ నరేందర్ రెడ్డి రెండో రోజు కూడా హాజరయ్యారు. నిన్నటి విచారణకు కొనసాగింపుగా రెండు లేఖలను ఆయన కమిషన్కు అందించారు.

# ఉచిత గ్యాస్ పంపిణీపై చంద్రబాబు కీలక వ్యాఖ్యలు



**విశ్వంభర, అమరావతి :** ఆంధ్రప్రదేశ్ మహిళలకు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు శుభవార్త వినిపించారు. ఎన్నో రోజులుగానో ఎదురు చూస్తున్న ఉచిత గ్యాస్ సిలిండర్ల పథకంపై కీలక వ్యాఖ్యలు చేశారు. గ్రామసభ కార్యక్రమంలో పాల్గొనేందుకు గానూ సీఎం చంద్రబాబు నాయుడు శుక్రవారం బీఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లాలో పర్యటించారు. కోనసీమ జిల్లా కొత్తపేట మండలంలోని వానపల్లి గ్రామంలో జరిగిన గ్రామసభలో పాల్గొన్నారు, ఈ సందర్భంగా మాట్లాడిన ముఖ్యమంత్రి.. ఉచిత గ్యాస్ సిలిండర్ల పథకాన్ని త్వరలోనే ప్రారంభిస్తామని చెప్పారు. త్వరలోనే రాష్ట్రంలోని మహిళలకు ఉచిత గ్యాస్ ఇస్తామని ప్రకటించారు. అలాగే ఇల్లు లేని నిరుపేదలకు ఇల్లు కట్టుకోవడానికి గ్రామీణ ప్రాంతాల్లో మూడు సెంట్లు, పట్టణ ప్రాంతాల్లో రెండు సెంట్ల స్థలం ఇస్తామని చంద్రబాబు చెప్పారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన మాట ప్రకారం ఇప్పటికే మెగా డీఎస్సీ ప్రకటించామన్న చంద్రబాబు.. మిగతా వాటిని కూడా నెరవేరుస్తామని అన్నారు. మరోవైపు మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం కింద ఈ ఏడాది రూ.4,500 కోట్లు విలువైన పనులకు కేంద్రం నుంచి అనుమతి తీసుకున్నామని చంద్రబాబు చెప్పారు. ఈ పథకం కింద ఈ ఏడాది 84 లక్షల కుటుంబాలకు పని దొరుకుతుందన్నారు.

కేంద్రం సహకారంతో గ్రామాలను అభివృద్ధి చేస్తామన్న సీఎం.. వచ్చే ఐదేళ్లల్లో ప్రతి గ్రామంలో సిమెంట్ రోడ్లు వేస్తామన్నారు. ఇంటికి తాగునీరు, విద్యుత్ కనెక్షన్లు అందిస్తామని.. పేదలకు ఇల్లు కట్టిస్తామన్నారు. అలాగే నిరుద్యోగ యువతకు ఉపాధి అవకాశాలు కల్పిస్తామని చంద్రబాబు చెప్పారు. మరోవైపు ఎన్నికల ప్రచారం సమయంలో మహిళలకు ఏడాదికి మూడు గ్యాస్ సిలిండర్లు ఉచితంగా అందిస్తామని చంద్రబాబు నాయుడు హామీ ఇచ్చారు. ఎన్నికల్లో గెలిచి టీడీపీ కూటమి అధికారంలోకి రావటంతో ఈ హామీని ఎప్పటి నుంచి అమలు చేస్తారా అనే దానిపై మహిళలు ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు. ఈ క్రమంలోనే త్వరలోనే ఉచిత గ్యాస్ పంపిణీ చేస్తామని చంద్రబాబు ప్రకటించడంతో .. వచ్చే కొద్దిరోజుల్లోనే ఈ పథకాన్ని అమలు చేస్తారనే అంచనాలు నెలకొన్నాయి. వీటితో పాటుగా మహిళలకు ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణం హామీని అమలు చేయడంపై టీడీపీ కూటమి దృష్టిసారించింది. వచ్చే ఒకటి, రెండు నెలల్లో వీటిలో ఏదో ఒక పథకం ప్రారంభించే అవకాశముంది.

# అచ్యుతాపురం ఘటనపై జగన్ రాజకీయం

**- మంత్రి రవీంద్ర**



**విశ్వంభర, మచిలీపట్నం :** అచ్యుతాపురం ఘటనను ఏపీ మాజీ సీఎం జగన్ మోహన్ రెడ్డి రాజకీయం చేస్తున్నారని రాష్ట్ర గనులు, ఎక్సైజ్ శాఖ మంత్రి కొల్లు రవీంద్ర మండిపడ్డారు. బాధితులను పరామర్శించేందుకు వెళ్లి రాజకీయాలు మాట్లాడడం సరికాదన్నారు. బాధితులను ఓదార్చాల్సింది పోయి రాజకీయ విమర్శలకు జగన్ దిగటం సిగ్గుచేటని మంత్రి రవీంద్ర ఆగ్రహించారు. అచ్యుతాపురం ఘటనపై కూటమి ప్రభుత్వం ఘటనపై సరిగా స్పందించలేదంటూ వైసీపీ అధినేత చేసిన వ్యాఖ్యలను మంత్రి కొల్లు రవీంద్ర ఖండించారు. ప్రమాదం గురించి తెలిసిన వెంటనే హోంమంత్రి అనిత, సీఎం చంద్రబాబు, కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ స్పందించారని తెలిపారు. ఘటనా స్థలానికి అధికారులు వెళ్లాల్సిందిగా.. బాధితులకు సరైన వైద్యం అందించి అక్కడి పరిస్థితులపై పర్యవేక్షించాలంటూ అధికారులను అప్రమత్తం చేసినట్లు మంత్రి రవీంద్ర చెప్పుకొచ్చారు. తీవ్ర వేదనలో

ఉన్న బాధిత కుటుంబాలకు ధైర్యం చెప్పాల్సిన చోట వైఎస్ జగన్ రాజకీయాలు మాట్లాడడం ఆశ్చర్యం కలిగించిందని మంత్రి కొల్లురవీంద్ర అన్నారు. ప్రమాదం గురించి తెలిసిన వెంటనే హోంమంత్రి అనిత, సీఎం చంద్రబాబు, కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ స్పందించారని తెలిపారు. ఘటనా స్థలానికి అధికారులు వెళ్లాల్సిందిగా.. బాధితులకు సరైన వైద్యం అందించి అక్కడి పరిస్థితులపై పర్యవేక్షించాలంటూ అధికారులను అప్రమత్తం చేసినట్లు మంత్రి రవీంద్ర చెప్పుకొచ్చారు. తీవ్ర వేదనలో

ఉన్న బాధిత కుటుంబాలకు ధైర్యం చెప్పాల్సిన చోట వైఎస్ జగన్ రాజకీయాలు మాట్లాడడం ఆశ్చర్యం కలిగించిందని మంత్రి అన్నారు.

గత ప్రభుత్వంలో అర్హత లేని అధికారులను డిప్యుటేషన్‌పై ఫ్యాక్టరీల ఇన్‌స్పెక్షన్ అధికారులుగా నియమించారని మంత్రి రవీంద్ర పేర్కొన్నారు. ఇలాంటి నియామకాల వల్లే ప్రమాదాలు జరుగుతున్నట్లు ఆయన చెప్పుకొచ్చారు. డిప్యుటేషన్ల కోసం గత వైసీపీ ప్రభుత్వానికి అడుగులకు మడుగులు ఒత్తిన ప్రతి అధికారిపై చర్యలు ఉంటాయని హెచ్చరించారు. ప్రమాదంపై చంద్రబాబు సర్కార్ వెంటనే స్పందించిందని, బాధితులకు అండగా నిలిచినట్లు చెప్పారు. కానీ జగన్ మాత్రం బాధితుల పరామర్శకు వెళ్లి విమర్శలు చేయడం ఆయన విజ్ఞతకే వదిలేస్తున్నట్లు అన్నారు. అచ్యుతాపురం ఘటనపై న్యాయ విచారణ జరిపిస్తామని, ప్రమాదానికి బాధ్యులైన వారిపై కఠిన చర్యలు ఉంటాయని మంత్రి హెచ్చరించారు. ఇకనైనా జగన్ శవరాజకీయాలు చేయడం ఆపాలంటూ మంత్రి కొల్లు రవీంద్ర హితవు పలికారు.

# మాచర్ల మున్సిపాలిటీ టీడీపీ కైవసం



**విశ్వంభర, మాచర్ల :** పల్నాడు జిల్లా మాచర్ల మున్సిపాలిటీపై తెలుగుదేశం జెండా ఎగిరింది. 16 మంది వైఎస్సార్సీపీ కౌన్సిలర్లు టీడీపీలో చేరారు. కొత్త కౌన్సిల్ ఏర్పాటుకు వీలుగా వారం క్రితం ఛైర్మన్ ఏసోబు రాజీనామా చేశారు. దీంతో వైస్ ఛైర్మన్‌గా ఉన్న పోలూరు నరసింహారావును ఎమ్మెల్యే బ్రహ్మారెడ్డి సూచన మేరకు కౌన్సిలర్లు కొత్త ఛైర్మన్‌గా ఎన్నుకున్నారు. మాచర్ల మున్సిపల్ ఛైర్మన్గా పోలూరు నరసింహారావు ప్రమాణ స్వీకారం చేశారు. ఇటీవలే ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మారెడ్డి ఆధ్వర్యంలో నరసింహారావు తెలుగుదేశంలో చేరారు.

గత ఎన్నికల్లో అప్పటి ఎమ్మెల్యే పిన్నెల్లి రామకృష్ణారెడ్డి దౌర్జన్యాలు, బెదిరింపులతో మున్సిపాలిటీలోని 31 స్థానాల్లోనూ వైఎస్సార్సీపీ అభ్యర్థులు ఏకగ్రీవంగా గెలిచారు. ఇటీవల జరిగిన ఎన్నికల్లో కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టడం, జూలకంటి బ్రహ్మారెడ్డి ఎమ్మెల్యే కావడంతో మాచర్ల మున్సిపాలిటీలో రాజకీయాలు శరవేగంగా మారిపోయాయి. అంతా కలిసి కట్టుగా పనిచేసి మాచర్ల మున్సిపాలిటీని అభివృద్ధి పథంలో ముందుకు తీసుకువెళ్లాలని నూతన ఛైర్మన్ నరసింహారావు, ఎమ్మెల్యే బ్రహ్మారెడ్డి సూచించారు.

# ఎంత బిజీ షెడ్యూల్ ఉన్న పేషంట్లను పరీక్షిస్తున్న ఎమ్మెల్యే



**విశ్వంభర, కోరుట్ల:** కోరుట్ల నియోజకవర్గ ఎమ్మెల్యే డాక్టర్ కల్వకుంట్ల సంజయ్ ఎంత బిజీ షెడ్యూల్ ఉన్నా వచ్చిన ప్రతి పేషెంట్ ను చిరునవ్వుతో స్వాగతిస్తూ వారి ఆరోగ్య సమస్యలను తెలుసుకుంటూ తగిన మందులను రాస్తూ సూచనలు చేస్తున్నారు. స్వతహాగా వెన్నుముక స్పెషలిస్ట్ యశోద హాస్పిటల్ హైదరాబాద్ లో మంచి హస్తవాసి గల డాక్టర్‌గా పేరుగాంచారు. నియోజకవర్గ పరిధిలో గల గ్రామాల ప్రజలే కాక నియోజకవర్గ ప్రజలకు తెలిసిన ఇతర జిల్లాల నుండి కూడా పేషెంట్లు వచ్చి తమ ఆరోగ్య సమస్యలను చెప్పి చికిత్సను పొందుతున్నారు. ప్రతిరోజు ఉదయం పేషంట్లతో ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం బిజీగా ఉంటుంది. వచ్చిన ప్రతి పేషంటును చూసిన తర్వాతనే ఇతర కార్యక్రమాలను చేపడుతున్నారు.

## చంద్రబాబు నుంచి నేర్చుకోవడానికి

# నేను ఎప్పుడూ సిద్ధమే

**- డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్**



**విశ్వంభర, అమరావతి :** ఏపీకి చంద్రబాబు అనుభవం అవసరమని డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ అన్నారు. రాష్ట్రాన్ని అప్పుల బారి నుంచి తప్పించేందుకు, సంపద సృష్టించేందుకు చంద్రబాబు అనుభవం అవసరమని చెప్పారు. చంద్రబాబు నుంచి నేర్చుకోవడానికి తాను ఎప్పుడూ సిద్ధమేనని అన్నారు. పంచాయతీలకు ప్రభుత్వ పరంగా ఆస్తులు లేకపోతే వ్యర్థమని పవన్ చెప్పారు. ప్రతి పంచాయతీకి సొంత భూమి ఉండాలని అన్నారు. ప్రభుత్వ భూములను కబ్జా చేస్తే ఊరుకోబోమని... అవసరమైతే గూండా యాక్ట్ తెస్తామని చెప్పారు. గ్రామాల్లో క్రీడా మైదానాలు కూడా లేని దుస్థితి నెలకొందని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వ భూములు ఉంటే నిర్మాణాలు చేసుకోవచ్చని చెప్పారు. దాతలు ముందుకు రావాలని... తాను కూడా నిధులు తీసుకొచ్చి క్రీడా మైదానాలను ఏర్పాటు చేయిస్తానని తెలిపారు.

అద్భుతాలు చేయడానికి చేతిలో మంత్రదండం లేదని... కానీ, గుండెల నిండా నిబద్ధత ఉందని పవన్ అన్నారు. అప్పుల్లో ఉన్న రాష్ట్రాన్ని గట్టెక్కించే సత్తా చంద్రబాబుకు మాత్రమే ఉందని చెప్పారు. ఎంతో పరిపాలన అనుభవం ఉన్న చంద్రబాబు నుంచి నేర్చుకోవాలనే తపన తనకుందని అన్నారు. ప్రజల కోసం కూలీగా పని చేసేందుకు సిద్ధమని చెప్పారు. వైసీపీ పాలనలో పంచాయతీ వ్యవస్థ పూర్తిగా నిర్వీర్యమైందని పవన్ విమర్శించారు. 75 శాతం గ్రామాల్లో వైసీపీకి చెందిన సర్పంచ్ లే ఉన్నారని చెప్పారు. రాజకీయాలకు అతీతంగా రాష్ట్ర అభివృద్ధి కోసం అందరూ పని చేయాలని సూచించారు. పంచాయతీ వ్యవస్థ దేశానికి వెన్నెముక అని చెప్పారు. పదవులు తనకు అలంకరణ కాదని... బాధ్యత అని అన్నారు.

# కారుణ్య నియామకాల కోసం కృషి చేసిన ముజీబ్ కు సన్మానం




**విశ్వంభర, బషీర్ బాగ్:** కారుణ్య నియమాకాలకు కొరకు విస్తృతంగా కృషిచేసిన టీఎన్జీవోస్ సెంట్రల్ యూనియన్ ప్రధాన కార్యదర్శి డాక్టర్ ఎస్ ఎం హుస్సేని ముజీబ్ ను టీఎన్జీవోస్ యూనియన్ హైదరాబాద్ అసోసియేట్ ప్రెసిడెంట్, స్కూల్ ఎడ్యుకేషన్ డిపార్ట్మెంట్ హైదరాబాద్ అధ్యక్షుడు కేఆర్ రాజ్ కుమార్, సెక్రటరీ ఎం భాస్కర్ లు పుష్పగుచ్చం ఇచ్చి శాలువతో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో టీఎన్జీవోస్ నాయకులు రవి కుమార్, ప్రియదేవ్ ఠాకూర్, శంకర్, యూనియన్ హైదరాబాద్ వైస్ ప్రెసిడెంట్ కే శ్రీనివాస్, ఖలీల్ అహ్మద్, వైదిక శాస్త్రి, ముఖిద్, లక్ష్మీ పతి, పరమేష్, దామోదర్, ఐజాజ్, ఆర్. నాగ శ్రీనివాసరావు, సుబోధ్ పాల్గొన్నారు.

# దైవచింతనతోనే మనిషి మనుగడ



**విశ్వంభర, ఆమనగల్లు:** ఆమనగల్లు మండల కేంద్రంలోని సురసముద్ర చెరువు కట్టపై వెలిసిన కట్ట మైసమ్మ దేవాలయంలో విగ్రహ ప్రతిష్ట కార్యక్రమంలో మాజీ జాతీయ బీసీ కమిషన్ నెంబర్ తల్లోజు ఆచారి పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దైవ చింతన, భక్తి మార్గాలతోనే మనిషి మనుగడ సాధ్యమవుతుందని అన్నారు. ఇంత పెద్ద ఎత్తున విగ్రహ ప్రతిష్టపన కార్యక్రమాలు నిర్వహిస్తున్న ఆలయ కమిటీ సభ్యులను అభినందించారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ అధ్యక్షులు ముక్కాల వెంకటయ్య, కౌన్సిలర్లు గోరటి నరసింహ, విజయకృష్ణ, లక్ష్మణ్, కృష్ణ యాదవ్, మేడిశెట్టి శ్రీధర్, చిన్న వెంకటయ్య, అంజయ్య, కేకే శీను, రాజు, గోజే ఆనంద్ పాల్గొన్నారు.

# బూత్ స్థాయి అధికారులకు శిక్షణ




**విశ్వంభర, మహాదేవపూర్:** మహాదేవపూర్, పలిమెల మండలాల్లోని బూత్ స్థాయి అధికారులకు మండల పరిషత్ కార్యాలయంలో శుక్రవారం శిక్షణ కార్యక్రమాలు నిర్వహించారు. బూత్ స్థాయి అధికారులు ఇంటింటి సర్వే నిర్వహించి ఓటు హక్కులో ఎలాంటి లోపాలున్న ఫారం 8 ద్వారా, సరిచేయాలని చనిపోయిన వారి పేర్లను గుర్తించి ఓటర్ లిస్టులో నుండి తొలగించాలని, ఫారం 7 ద్వారా, 01 జనవరి 2025 వరకు 18 సంవత్సరాలు నిండిన వారికి ఓటు హక్కు కల్పించేలా ఫారం 6 ద్వార నింపాలని, బీఎల్ఓ, ఏపీపీ లకు శిక్షణ కార్యక్రమాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మహాదేవపూర్, పలిమెల తాసిల్దార్ లు ప్రహ్లాద రాథోడ్, అనిల్, ఏ ఎల్ ఎం టీ ట్రైనర్లు రాజేశ్వరరావు, రాజమౌళి బూత్ స్థాయి అధికారులు, సీనియర్ అసిస్టెంట్లు, మండల గిర్దావర్లు, జూనియర్ అసిస్టెంట్ పాల్గొన్నారు.

# కల్లుగీత పారిశ్రామిక సహకార సంఘం ఎన్నికలు

**విశ్వంభర, నార్కెట్ పల్లి:** చిప్పలపల్లి గ్రామంలో కల్లుగీత పారిశ్రామిక సహకార సంఘం ఎన్నికలను నల్గొండ జిల్లా కోఆపరేటివ్ ఇన్స్పెక్టర్ కే. దశరథ ఆధ్వర్యంలో నిర్వహించారు. సంఘ సభ్యులు అందరి సమక్షంలో కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా పనసము వాసు గౌడ్, ఉపాధ్యక్షులు బత్తిని రమేష్ గౌడ్, కార్యదర్శిగా పనసము ధనంజయ గౌడ్, డైరెక్టర్లుగా పనసము రామ నరసయ్య గౌడ్, పనసము జీడికల్లు గౌడ్, పనసము రమేష్ గౌడ్, పనసము శంకరయ్య గౌడ్, పనసము చిన్న శేఖర్ గౌడ్, నోముల కరుణాకర్ గౌడ్ ఎన్నికయ్యారు.





# అంతర్జాతీయ క్రికెట్‌కు కేఎల్ రాహుల్ గుడ్ బై

**విశ్వంభర, క్రీడావిభాగం:** టీమిండియా స్టార్ వికెట్ కీపర్ అండ్ బ్యాటర్ కేఎల్ రాహుల్ చాలా కాలం తర్వాత మళ్లీ టీమ్ ఇండియాలో కనిపించాడు. 2024 ఐపీఎల్ సమయంలో గాయపడిన రాహుల్ కోలుకున్న తర్వాత శ్రీలంకతో జరిగిన వన్డే సిరీస్‌లో టీమిండియా తరఫున ఆడాడు. కానీ లంకతో జరిగిన సిరీస్‌లో రాహుల్ ప్రదర్శన అంతంత మాత్రమే. దీంతో మూడో వన్డే నుంచి రాహుల్‌ను జట్టు నుంచి తప్పించారు. లంకతో సిరీస్‌లో పేలవ ప్రదర్శన కనబరిచిన రాహుల్‌కు మళ్లీ భారత జట్టులో చోటు దక్కాలంటే చాలా కష్టపడాలంటున్నారు క్రికెట్ నిపుణులు. వీటన్నింటి మధ్య, కేఎల్ రాహుల్ గురించి సోషల్ మీడియాలో ఒక పుకారు మొదలైంది. కేఎల్ రాహుల్ ఇన్ స్టాగ్రామ్ అకౌంట్ పేరుతో సోషల్ మీడియాలో ఒక పోస్ట్ చక్కర్లు కొడుతోంది. ఈ పోస్ట్‌లో రాహుల్ అంతర్జాతీయ క్రికెట్‌కు రిటైర్మెంట్ ప్రకటించినట్లు ఉంది. సోషల్ మీడియాలో వైరల్ అవుతున్న ఇన్‌స్టాగ్రామ్ పోస్ట్‌లో, 'చాలా ఆలోచించిన తర్వాత, ప్రొఫెషనల్ క్రికెట్‌కు రిటైర్మెంట్ ప్రకటించాలని నిర్ణయించుకున్నాను. ఎన్నో ఏళ్లుగా క్రికెట్ నా జీవితంలో ముఖ్యమైన భాగమైనందున ఈ నిర్ణయం అంత సులభం కాదు. నా కెరీర్‌లో నాకు మద్దతుగా నిలిచిన నా కుటుంబం, స్నేహితులు, సహచరులు అభిమానులకు కృతజ్ఞతలు. మైదానంలోనూ, బయటా నేను పొందిన అనుభవాలు జ్ఞాపకాలు వెలకట్టలేనివి. నేను నా దేశానికి ప్రాతినిధ్యం వహించడం గర్వంగా భావిస్తున్నాను. చాలా మంది ప్రతిభావంతులైన దిగ్గజ క్రికెటర్లతో ఆడినందుకు సంతోషంగా ఉంది. ఈ అద్భుతమైన ప్రయాణంలో భాగమైనందుకు మీ అందరికీ ధన్యవాదాలు' అని ఈ పోస్ట్‌లో రాసి ఉంది. నిజానికి కేఎల్ రాహుల్ తన ఇన్‌స్టాగ్రామ్ ఖాతాలో ఓ పోస్ట్‌ను షేర్ చేశాడు . 'ఇవాళ ఒక ప్రకటనతో వస్తున్నాను.. వేచి ఉండండి' అని అందులో పేర్కొన్నాడు. అయితే అది అంతర్జాతీయ క్రికెట్ రిటైర్మెంట్ కు సంబంధించినది కాదు. కానీ ఈ పోస్ట్ ను కొందరు నెటిజన్లు వేరేలా ప్రచారం చేస్తున్నారు. రాహుల్ అంతర్జాతీయ క్రికెట్‌కు వీడ్కోలు పలికినట్లు సోషల్ మీడియాలో పుకార్లు పుట్టిస్తున్నారు.

# ధోనీ ఫ్యాన్స్‌కు క్షమాపణలు చెప్పిన దినేశ్ కార్తిక్



**విశ్వంభర, క్రీడావిభాగం :** టీమిండియా మాజీ ప్లేయర్, ఇటీవలే ఐపీఎల్‌కు గుడ్‌బై చెప్పిన దినేశ్ కార్తిక్ మహేంద్ర సింగ్ ధోనీ ఫ్యాన్స్‌కు క్షమాపణలు చెప్పాడు. ఇటీవల తాను ఎంపిక చేసిన ఆల్ టైమ్ ఇండియా ప్లేయింగ్ లెవెన్‌లో ధోనికి దినేశ్ కార్తిక్ చోటు కల్పించలేదు. దీంతో అతడిపై ధోనీ ఫ్యాన్స్ నుంచి విమర్శలు ప్రారంభమయ్యాయి. ఈ నేపథ్యంలో ఈ వివాదంపై దినేశ్ కార్తిక్ క్లారిటీ ఇచ్చాడు. తాను కావాలని ఇది చేయలేదని.. నిజంగా మర్చిపోయానని చెప్పుకొచ్చాడు. ఫార్మాట్‌తో సంబంధం లేకుండా ధోనీనే బెస్ట్ వికెట్ కీపర్, కెప్టెన్ అని వ్యాఖ్యానించాడు. "భాయ్ లోగ్, బడా గల్తీ హో గయా. నిజం చెప్పాలంటే.. ఇది కావాలని చేసింది కాదు. ఆ ఎపిసోడ్ పూర్తయ్యాకే నాకు ఈ విషయం అర్థమైంది. జట్టులో మిగతా విషయాలపై ఆలోచించి.. తాను వికెట్ కీపర్‌ను ఎంపిక చేయడం మర్చిపోయా. దీంతో తాను ఎంపిక చేసిన జట్టులో ఉన్న రాహుల్ ద్రవిడ్ వికెట్ కీపర్‌గా ఉంటారని అంతా భావించారు. కానీ నిజంగా నేను వికెట్ కీపర్‌ను ఎంపిక చేయడాన్ని మర్చిపోయా. ఎంఎస్ ధోనీ గొప్ప ప్లేయర్, కెప్టెన్ అందులో అనుమానం లేదు. భారత ఆల్ టైమ్ ప్లేయింగ్ లెవెన్‌లోనే కాదు. ప్రపంచ ప్లేయింగ్ లెవెన్‌లో కూడా అతడికి చోటు ఇవ్వాల్సిందే. నేను ఎంపిక చేసిన భారత ప్లేయింగ్ లెవెన్‌లో మార్పు చేయాలంటే.. కచ్చితంగా అది ధోనీని అందులో చేర్చడమే" అని దినేశ్ కార్తిక్ వ్యాఖ్యానించాడు. ఇదే సమయంలో మహేంద్ర సింగ్ ధోనీపై డీకే ప్రశంసలు కురిపించాడు. ఫార్మాట్‌తో సంబంధం లేకుంటా.. ఏ భారత జట్టుకైనా అతడే కెప్టెన్ అని చెప్పుకొచ్చాడు. కాగా కార్తిక్ ఎంపిక చేసిన అత్యుత్తమ ఆల్ టైమ్ భారత జట్టులో స్టార్ ప్లేయర్లు ఉన్నారు. డ్యాషింగ్ ఓపెనర్ వీరేంద్ర సెహ్వాగ్‌తో పాటు టీమిండియా కెప్టెన్ రోహిత్ శర్మను ఓపెనర్లుగా ఎంపిక చేశాడు. కీలకమైన మూడు, నాలుగు స్థానాల్లో రాహుల్ ద్రవిడ్, సచిన్ టెండూల్కర్‌లకు చోటు కల్పించాడు. విరాట్ కోహ్లీని ఐదో స్థానంలో ఎంచుకున్నాడు. యువరాజ్ సింగ్ కూడా జట్టులో ఉన్నాడు. జట్టులో ఏకైక పేసర్‌గా బుమ్రాకు చోటు కల్పించాడు.

**దినేశ్ కార్తిక్ ఆల్ టైమ్ ఇండియా ఎలెవన్:**
వీరేంద్ర సెహ్వాగ్, రోహిత్ శర్మ, రాహుల్ ద్రవిడ్, సచిన్ టెండూల్కర్, విరాట్ కోహ్లీ, యువరాజ్ సింగ్, రవీంద్ర జడేజా, అనిల్ కుంబ్లే, ఆర్ అశ్విన్, జహీర్ ఖాన్, జస్ప్రీత్ బుమ్రా, హర్భజన్ సింగ్ (12వ ఆటగాడు).



## మరోసారి నీరజ్ చోప్రా
# అద్భుత ప్రదర్శన

**విశ్వంభర, క్రీడావిభాగం:** భారత స్టార్ జావెలిన్ త్రోయర్ నీరజ్ చోప్రా మరోసారి రెండో స్థానంతో మెరిశాడు. తాజాగా జరిగిన లుసానె డైమండ్ లీగ్‌లో రెండో స్థానంలో నిలిచాడు. 89.49 మీటర్లు ఈటెను విసిరిన నీరజ్ ఈ సీజన్‌లోనే అత్యుత్తమ ప్రదర్శన చేశాడు. అయితే ఎప్పటి లాగే ఈ సారి కూడా అతడి 90 మీటర్ల కల మాత్రం నెరవేరలేదు. గ్రెనెడా అథ్లెట్ అండర్సన్ పీటర్స్ 90.61 మీటర్లు ఈటెను విసిరి ఈ లుసానె డైమండ్ లీగ్ లో అగ్ర స్థానాన్ని దక్కించుకున్నాడు. జర్మన్ అథ్లెట్ వెబర్ జులియన్ 87.08 మీటర్లతో మూడో స్థానాన్ని దక్కించుకున్నాడు.

ఏ రౌండ్‌లో ఎంత దూరమంటే?- మొదటి రౌండ్ లో 82.10 మీటర్లు ఈటెను విసిరి నాలుగో స్థానంలో నిలిచాడు నీరజ్ చోప్రా. ఆ తర్వాత వరుసగా 83.21 మీటర్లు, 83.13 మీటర్లు, 82.34 మీటర్లు, 85.58 మీటర్ల ప్రదర్శన కనబరిచాడు. ఇక ఫైనల్ రౌండ్‌లో గ్రెనెడా అథ్లెట్ అండర్సన్ పీటర్స్ జావెలిన్‌ను 90.61 మీటర్లు విసరగా, నీరజ్ చోప్రా తన శక్తినంతా ఉపయోగించి 89.49 మీటర్లు ఈటెను విసిరాడు. ఇది నీరజ్ కెరీర్‌లో రెండో అత్యుత్తమ ప్రదర్శనగా నిలిచింది. అంతకుముందు స్టాక్ హోమ్ డైమండ్ లీగ్ 2022లో 89.94 మీటర్లు ఈటెను విసిరాడు. ఇప్పటి వరకు అతడి కెరీర్‌లో ఈ స్టాక్ హోమ్ డైమండ్ లీగ్ ప్రదర్శనే అత్యుత్తమం. రీసెంట్‌గా పారిస్ ఒలింపిక్స్ 2024లో ఎన్నో అంచనాలతో బరిలోకి దిగాడు నీరజ్ చోప్రా. దీంతో అతడు పసిడిని ముద్దాడతాడని అంతా భావించారు. కానీ అతడు 89.45 మీటర్లు ఈటెను విసిరి సిల్వర్ మెడల్ దక్కించుకున్న సంగతి తెలిసిందే. అయినప్పటికీ ఇదీ కూడా అత్యుత్తమ ప్రదర్శనే. ఇక 2022లో 87.66 మీటర్లు ఈటెను విసిరి డైమండ్ లీగ్ విజేతగా నిలిచాడు నీరజ్ చోప్రా. అనంతరం 2023 డైమండ్ లీగ్‌లోనూ 89.08 మీటర్లు విసిరి ఎప్పటికీ గుర్తుండిపోయే ప్రదర్శన చేశాడు.

# ఆర్సీబీలోకి రోహిత్, బుమ్రా?

**విశ్వంభర, క్రీడావిభాగం:** ఐపీఎల్ 2025 సీజన్‌కు రంగం సిద్ధమవుతోంది. రాబోవు సీజన్‌కు చాలా సమయం ఉన్నా.. ఇప్పటి నుంచే జట్టు యాజమాన్యాలు తమ ప్రణాళికలను సిద్ధం చేసుకుంటున్నాయి. మెగా వేలానికి ముందు ఆటగాళ్ల రిటెన్షన్, రిలీజ్‌ల విధివిధానాలపై ఐపీఎల్ యాజమాన్యం టీం ఓనర్లతో మీటింగ్ నిర్వహించింది. ఆటగాళ్ల రిటెన్షన్, రిలీజ్ విధివిధానాల గురించి ఈ మీటింగ్‌లో ఖరారు అయ్యాయి. కొత్తగా తీసుకువచ్చిన రూల్స్ ప్రకారం చాలామంది ఆటగాళ్లు తమ టీంను వదిలిపెట్టి, వేరే టీంల్లోకి వెళ్లే అవకాశాలు కనిపిస్తున్నాయి. ఎవరూ ఊహించని విధంగా ఈసారి కెప్టెన్లు సైతం తమ జట్టును వీడేలా ఉన్నారు. ఈ క్రమంలోనే ముంబై ఇండియన్స్ మాజీ కెప్టెన్ రోహిత్ శర్మ ఆ జట్టును వీడటం ఖాయమంటూ గత కొంతకాలంగా వార్తలు వినిపిస్తున్నాయి. కొత్తగా వచ్చిన రూల్స్‌ను బట్టి చూస్తే ఆటగాళ్ల రిటెన్షన్, రిలీజ్‌లో భాగంగా రోహిత్ శర్మ ముంబై ఇండియన్స్‌ను వీడి ఆర్సీబీలో చేరతారనే ప్రచారం జరుగుతోంది. ఒకవేళ అందరు అనుకున్నట్టు రోహిత్ ముంబై ఇండియన్స్‌కు గుడ్ బై చెబితే..అతని కోసం ఆర్సీబీ, గుజరాత్ టైటాన్స్ టీంలు పోటీ పడటం ఖాయంగా కనిపిస్తోంది. ముఖ్యంగా ఆర్సీబీ యాజమాన్యం రోహిత్ కోసం ఎంత ఖర్చు చేయడానికి అయినా రెడీ ఉన్నట్టు కనిపిస్తోంది.



ముంబై ఇండియన్స్ జట్టు నుండి రోహిత్ శర్మను ఆర్సీబీ జట్టులోకి తీసుకుని అతనికి కెప్టెన్సీ ఇవ్వాలనేది ఆర్సీబీ మేనేజ్‌మెంట్ ఉద్దేశం. తాజాగా అందుతున్న సమాచారం ప్రకారం ముంబై ఇండియన్స్ స్టార్ బౌలర్ బుమ్రా సైతం జట్టును వీడటానికి సిద్ధమయ్యారని తెలుస్తోంది. జస్ప్రీత్ బుమ్రా కూడా రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు టీమ్‌లోకి వెళ్లబోతున్నట్లు న్యూస్ వైరల్‌గా మారింది. హార్దిక్ పాండ్యాకు కెప్టెన్సీ పగ్గాలు అప్పగించిన దగ్గర నుంచి అతడు అసంతృప్తితో ఉన్నట్లు తెలుస్తోంది. ఇద్దరి మధ్య అభిప్రాయభేదాలు చోటు చేసుకోవడంతో బుమ్రా ముంబైని వీడటానికి రెడీ అవుతున్నట్టు సమాచారం. ఈ నేపథ్యంలో బుమ్రా ముంబైను వీడి ఆర్సీబీలోకి వస్తాడని జోరుగా చర్చనడుస్తోంది. అటు ఆర్సీబీ సైతం బుమ్రాను తీసుకోవడానికి సిద్ధంగా ఉంది. ఆ జట్టుకు స్టార్ బౌలర్ కొరత ఎప్పటి నుంచో వెంటాడుతోంది. అవసరం అయితే ట్రేడింగ్ విండో ద్వారా బుమ్రాను జట్టులోకి తీసుకోవాలని ఆర్సీబీ యాజమాన్యం ఆలోచిస్తున్నట్లు తెలుస్తోంది. మరి బుమ్రా ముంబై టీమ్ లోనే ఉంటాడా? లేదా ఆర్సీబీలోకి వెళ్తాడా? అన్నది తెలియాలంటే మరికొన్ని రోజులు వేచి చూడాల్సిందే.

## చిక్కుల్లో బంగ్లాదేశ్ స్టార్ ఆల్ రౌండర్
# షకీబ్ అల్ హసన్



**విశ్వంభర, క్రీడావిభాగం :** బంగ్లాదేశ్ స్టార్ క్రికెటర్, మాజీ ఎంపీ షకీబ్ అల్ హసన్ కు షాక్ తగిలింది. అతడిపై హత్య కేసు నమోదయింది. రిజర్వేషన్లకు వ్యతిరేకంగా బంగ్లాదేశ్ లో హింసాత్మక ఘటనలు చోటు చేసుకున్న సంగతి తెలిసిందే. ఈ అల్లర్లలో రూబెల్ అనే యువకుడు ప్రాణాలు కోల్పోయాడు. అతని తండ్రి రఫీకుల్ ఇస్లామ్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు మాజీ ప్రధాని షేక్ హసీనా సహా 154 మందిపై పోలీసులు కేసు నమోదు చేశారు. ఇందులో షకీబ్ అల్ హసన్ 28వ నిందితుడిగా ఉన్నారు. ప్రముఖ బంగ్లాదేశీ నటుడు ఫెర్దూస్ అహ్మద్ 55వ నిందితుడిగా ఉన్నారు. ఇటీవల జరిగిన పార్లమెంట్ ఎన్నికల్లో షకీబ్, ఫెర్దూస్ అవామీ లీగ్ పార్టీ తరఫున ఎంపీలుగా గెలుపొందారు. అయితే, అల్లర్ల కారణంతో షేక్ హసీనా పదవికి రాజీనామా చేయడంతో ప్రభుత్వం రద్దయింది. దీంతో, వీరిద్దరూ కూడా పదవులు కోల్పోయారు.

# స్పామ్ కాల్స్‌పై ట్రాయ్ ఉక్కుపాదం

**విశ్వంభర, బిజినెస్ :** మోసపూరిత కాల్స్, సందేశాలు పంపే టెలిమార్కెటర్లపై, టెలికాం నియంత్రణ సంస్థ ట్రాయ్ కఠిన చర్యలకు దిగింది. వినియోగదారులను మోసపూరిత కాల్స్ నుంచి రక్షించేందుకు, మెసేజింగ్ సేవలు దుర్వినియోగం కాకుండా ప్రత్యేక చర్యలు చేపట్టాలని టెలికాం సంస్థలను ట్రాయ్ మంగళవారం ఆదేశించింది. సెప్టెంబరు 1 నుంచి వైట్‌లిస్టెడ్ (ధ్రువీకరణ) లేని యూఆర్ఎల్‌లు, ఓటీటీ లింక్‌లు లేదా కాల్ బ్యాక్ నంబర్లు కలిగిన మెసేజ్‌లను సెండర్‌లు పంపించకుండా సర్వీస్ ప్రొవైడర్లు ఆపాలని ట్రాయ్ స్పష్టం చేసింది. నవంబరు 1 నుంచి సెండర్స్ నుంచి రిసీపియెంట్స్‌కు వచ్చే అన్ని మెసేజ్‌ల వివరాలు తెలుసుకునే విధంగా ఉండాలని ట్రాయ్ ఆదేశించింది. ట్రాయ్ ఆదేశాల ప్రకారం, ఇకపై ఎక్కడి నుంచి మెసేజ్ వచ్చిందో వివరాలు లేకుంటే, దాన్ని తిరస్కరిస్తారు. టెలికాం వినియోగదారులకు చేసే ప్రమోషనల్ కాల్స్, మెసేజ్‌లు పంపే అనధికార టెలిమార్కెటర్లకు తాజా చర్యలతో కళ్లెం పడే అవకాశం ఉందని సంబంధిత వర్గాలు పేర్కొన్నాయి. స్పామ్ కాల్స్ చేసే అనధికార టెలిమార్కెటర్ల కనెక్షన్‌లను తొలగించడంతో పాటు, రెండేళ్ల పాటు వారిని బ్లాక్‌లిస్ట్‌లో పెట్టాల్సిందిగా టెల్కోలను ట్రాయ్ (TRAI) గతవారం ఆదేశించిన విషయం తెలిసిందే. ప్రమోషనల్ కంటెంట్ కోసం టెంప్లెట్‌లను దుర్వినియోగం చేసే వారిని అడ్డుకోకుంటే, సెండర్‌లపై ట్రాయ్ చర్యలు తీసుకోనుంది. నెల రోజుల పాటు వారి సేవలను నిలిపివేస్తామని హెచ్చరించింది. ట్రాయ్ హెచ్చరికల నేపథ్యంలో ఆయా టెలికాం కంపెనీలు అందుకు తగ్గట్లుగా ఏర్పాట్లు చేస్తున్నాయి. స్పామ్ కాల్స్‌ను అరికట్టేందుకు ఇది ఒక ముందడుగుగా చెప్పుకోవచ్చు.




**సిమ్ స్వాప్**
ట్రాయ్ ఇప్పటికే సిమ్ స్వాప్, రీప్లేస్‌మెంట్ మోసాలను అరికట్టడాని పలు కొత్త నిబంధనలను తీసుకువచ్చింది. టెక్నాలజీ పెరిగిన తరువాత కొంత మంది కేటుగాళ్లు, వ్యక్తుల సమాచారాన్ని తస్కరించి, వారి సిమ్‌కార్డులను పోర్ట్ చేయడం లాంటి మోసాలకు పాల్పడుతున్నారు. మరీ ముఖ్యంగా ఇటీవలి కాలంలో ఇలాంటి మోసాలు భారీగా పెరిగిపోతున్నాయి. ఈ నేపథ్యంలోనే వినియోగదారుల భద్రత కోసం, వారి సమాచారాన్ని సురక్షితంగా ఉంచడం కోసం ట్రాయ్ పలు కొత్త నిబంధనలను తీసుకువచ్చింది.

**కనీసం 7 రోజులు ఆగాల్సిందే!**
ఇప్పటి వరకు ఎలా ఉండేదంటే, పొరపాటున మన ఫోన్ పోయినా, లేదా ఎవరైనా దొంగిలించినా, ఎఫ్ఐఆర్ కాపీని అందిస్తే చాలు. మనకు కొత్త సిమ్ కార్డ్ వచ్చేది. కానీ ఇప్పుడు అలాంటి పరిస్థితి లేదు. జులై 1 నుంచి ఇలాంటి ఘటన ఏదైనా జరిగితే, కొత్త సిమ్ కోసం కనీసం 7 రోజుల పాటు వేచి ఉండాల్సిందే.

# అనిల్ అంబానీపై 5 ఏళ్లపాటు సెబీ నిషేధం

## రూ.25 కోట్లు జరిమానా

**విశ్వంభర, బిజినెస్:**

ప్రముఖ పారిశ్రామికవేత్త అనిల్ అంబానీ స్టాక్‌మార్కెట్‌లో ఎలాంటి కార్యకలాపాలు నిర్వహించకుండా సెబీ 5 ఏళ్ల పాటు నిషేధం విధించింది. 'రిలయన్స్ హోమ్ ఫైనాన్స్ లిమిటెడ్ ' (RHFL)లో కీలకంగా వ్యవహరించిన మాజీ అధికారులు సహా, మరో 24 సంస్థలపైనా నిషేధం విధిస్తున్నట్లు శుక్రవారం వెల్లడించింది. నిధుల మళ్లింపు ఆరోపణల నేపథ్యంలోనే ఈ చర్యలు తీసుకున్నట్లు తెలిపింది.



**దివాలా తీయడానికి కారణమదే!**
2018-19 ఆర్థిక సంవత్సరాల మధ్య కాలంలో రిలయన్స్ హోమ్ ఫైనాన్స్ లిమిటెడ్ పలు కంపెనీలకు ఎలాంటి పూచీకత్తు లేకుండా భారీ ఎత్తున రుణాలు మంజూరు చేసింది. అయితే ఈ కంపెనీలు అన్నీ ఆర్థికంగా అత్యంత బలహీనమైనవి లేదా నష్టాల్లో ఉన్నవి కావడం గమనార్హం. ఇలాంటి సంస్థలకు ఎలాంటి తాకట్టు లేదా సెక్యూరిటీ లేకుండా, ఇంత పెద్ద ఎత్తున రుణాలు ఇవ్వడం ద్వారా అనిల్ అంబానీ పెద్ద ఎత్తున ఆర్థిక అవకతవకలకు పాల్పడినట్లు సెబీ గుర్తించింది. అంతేకాదు RHFL నుంచి జీపీసీ రుణాలు పొందిన వారు, నిధులు పొందుతున్న సంస్థలు అన్నీ ప్రమోటర్ గ్రూప్‌తో సంబంధాలు కలిగి ఉన్నట్లు సెబీ ఇన్వెస్టిగేషన్‌లో తెలిసింది. ఫలితంగా ఆర్ఎఫ్‌హెచ్ఎల్ దివాలా తీసి ఆర్‌బీఐ నిబంధనల ప్రకారం పరిష్కార ప్రణాళికకు వెళ్లాల్సివచ్చింది. తద్వారా పబ్లిక్ షేర్‌హోల్డర్లు భారీగా నష్టపోయారని సెబీ పేర్కొంది. ఉదాహరణకు 2018లో కంపెనీ షేరు ధర రూ.59.60 వద్ద ఉండగా, 2020 నాటికి కంపెనీ మోసం బయటకు రావడం, నిధులు అడుగంటిపోవటంతో షేరు విలువ రూ.0.75కు పడిపోయినట్లు సెబీ గుర్తుచేసింది. ఇప్పటికీ 9 లక్షల మంది షేర్‌హోల్డర్లు నష్టాలతో కొనసాగుతున్నారని వివరించింది.

**భారీ ఫైన్**
సెబీ అనిల్ అంబానీపై రూ.25 కోట్లు, ఆర్‌హెచ్ఎఫ్ఎల్ మాజీ సీఎఫ్ఓ అమిత్ బాప్నాపై రూ.27 కోట్లు, ప్రస్తుతం ఆర్‌హెచ్ ఎఫ్ఎల్ సీఈఓ రవీంద్ర సుదాల్కర్‌పై రూ.26 కోట్లు, ప్రస్తుత సీఎఫ్ఓ పింకేశ్ షాపై రూ.21 కోట్ల మేర జరిమానా విధించింది. అంతేకాదు ఈ మోస పూరిత పథకంతో సంబంధమున్న సంస్థలపైనా రూ.25 కోట్లు చొప్పున ఫైన్ వేసింది. 2022లోనూ సెబీ వీరందరిపై నిషేధం విధించడం గమనార్హం.

**రూ.25 కోట్ల జరిమానా**
అనిల్ అంబానీపై సెబీ రూ.25 కోట్ల జరిమానా కూడా విధించింది. సెక్యూరిటీ మార్కెట్లతో సంబంధం ఉండే ఎలాంటి కార్యకలాపాల్లోనూ పాల్గొనకూడదని ఆంక్షలు విధించింది. ఏ నమోదిత కంపెనీ, సెబీలో రిజిస్టర్ అయిన మధ్యవర్తిత్వ సంస్థల్లో డైరెక్టర్ సహా ఎలాంటి కీలక పదవుల్లో ఉండకూడదని ఆదేశించింది. మరోవైపు రిలయన్స్ హోమ్ ఫైనాన్స్‌ను సైతం సెక్యూరిటీ మార్కెట్ల నుంచి ఆర్నెళ్ల పాటు నిషేధించింది. పైగా రూ.6 లక్షల జరిమానా కూడా విధించింది. అనిల్ అంబానీ తన అనుబంధ సంస్థలకు రుణాల రూపంలో ఆర్‌హెచ్ఎఫ్ఎల్ నిధులను మళ్లించారని సెబీ తమ నివేదికలో ఆరోపించింది. ఇందుకోసం కంపెనీకి చెందిన కీలక నిర్వహణాధికారులతో కలిసి కుట్ర పన్నారని పేర్కొంది. ఆర్ఎఫ్‌హెచ్ఎల్ డైరెక్టర్ల బోర్డు నిలువరించే ప్రయత్నం చేసినప్పటికీ, వాటిని యాజమాన్యం ఏమాత్రం ఖాతరు చేయలేదని తెలిపింది. అనిల్ అంబానీ ఆదేశాలతోనే, కీలక అధికారులు కావాలని నిబంధనలను అతిక్రమించారని సెబీ ఆరోపించింది.

# నవ్వులు పూయించిన మారుతీనగర్ సుబ్రమణ్యం




రావు రమేష్ కథానాయకుడిగా రూపొందిన చిత్రం 'మారుతీ నగర్ సుబ్రమణ్యం'లక్ష్మణ్ కార్య దర్శకత్వం వహించారు. క్రియేటివ్ డైరెక్టర్ సుకుమార్ భార్య తబిత సమర్పణలో పీబీఆర్ సినిమాస్, లోకమాత్రే సినిమాటిక్స్ సంస్థలపై బుజ్జి రాయుడు పెంట్యాల, మోహన్ కార్య నిర్మించారు. ట్రైలర్, టీజర్‌తో ప్రీ రిలీజ్ ఈవెంట్‌తో మంచి అంచనాలు తెచ్చుకున్న ఈ సినిమా శుక్రవారం ప్రేక్షకుల ముందుకు వచ్చింది. ఇప్పటికే అనేక ప్రాంతాలలో సినిమా షోలు స్టార్ట్ అవగా చాలామంది ఈ మూవీని చూసి తమ అభిప్రాయాలు తెలుపుతున్నారు. మధ్య తరగతి నిరుద్యోగికి అనుకోకుండా 10 లక్షలు లభిస్తే ఏం చేశాడనే కథతో రూపొందిన ఈ చిత్రం ఆద్యంతం నవ్వులు పూయించిందని, పెట్టిన డబ్బుకు సరిపోను ఎంటర్‌టైన్ మెంట్ ఇచ్చారని చాలామంది నెటిజన్లు కామెంట్లు చేస్తున్నారు. ముఖ్యంగా అల్లు అర్జున్ రెఫరెన్సులు వాడిన విధానం సినిమాకే హైలెట్‌గా ఉందని, ఒకటి రెండు సందర్భాల్లో చిరంజీవి పాటలకు రావు రమేశ్ తన డ్యాన్స్‌తో ప్రేక్షకులను థ్రిల్ చేశాడని కామొంట్లు సెడుతున్నారు. అదేవిధంగా పాటలు, బావున్నాయని, ఫస్టాఫ్ వరకు ఓ రీతిలో ఉన్న రావు రామేశ్ పాత్ర డబ్బులు వచ్చాక సెకండాఫ్‌లో మారిన విధానం బావుందని అంటున్నారు. సినిమాలో అక్కడక్కడ లాజిక్‌లు మిస్సయిన నవ్వులకు ఎలాంటి ఢోకాలేదని, ఈ ఏడాది బెస్ట్ కామెడీ చిత్రం ఇదేనని, చాలా రోజుల తర్వాత మంచి వినోదం ఇచ్చారని పోస్టులు పెడుతున్నారు. అతేగాక రావు రమేశ్ చేసిన డ్యాన్స్ క్లిప్పులను సోషల్ మీడియాలో షేర్ చేస్తూ తమ ఆనందాన్ని పంచుకుంటున్నారు. సినిమా అంతటినీ రావు రమేశ్ తన భుజాలపై మోస్తూ ఓ రేంజ్‌కు తీసుకెళ్లడాని, భార్యగా చేసిన ఇంద్రజ, కోడుకుగా చేసిన అంకిత్, రమ్య క్యారెక్టర్లు కూడా బాగా పండాయని చెబుతున్నారు. ముఖ్యంగా.. నా తండ్రి అల్లు అరవింద్, నా అన్నయ్య అల్లు అర్జున్ అంటూ రావు రమేశ్ కొడుకు క్యారెక్టర్ పదే పదే చెబుతూ , సినిమాలో తను ప్రేమించిన అమ్మాయిని ఊహించుకుంటూ పాడుకునే పాటల్లోనూ అల్లు అర్జున్ సూపర్ హిట్ సాంగ్స్ రీ క్రియేషన్ చేసిని విధానం చాలా హైలెట్‌గా ఉందని అంటున్నారు. ప్రతి ఒక్కరూ తప్పక చూడాల్సిందే అంటూ తమ తమ పోస్టులలో రాసుకొస్తున్నారు. వినోదంతో పాటు చక్కటి కుటుంబ విలువలతో తెరకెక్కిన ఈ 'మారుతీ నగర్ సుబ్రమణ్యం' సినిమాను మిస్ చేయవద్దని కోరుతున్నారు.

# మోస్ట్ పాపులర్ నటుడిగా ప్రభాస్

## మీడియా సంస్థ ఆర్మాక్స్ వెల్లడి

ప్రస్తుతం ప్రభాస్ పేరు సోషల్ మీడియాలో వైరల్‌గా మారిన సంగతి తెలిసిందే. ఇప్పుడీ స్టార్ హీరో మరో ఘనత దక్కించుకున్నారు. ప్రముఖ మీడియా సంస్థ ఆర్మాక్స్ విడుదల చేసిన మోస్ట్ పాపులర్ హీరోల జాబితాలో మరోసారి టాప్‌లో నిలిచారు. తాజాగా ఆర్మాక్స్ జులై నెలకు సంబంధించి దేశవ్యాప్తంగా మోస్ట్ పాపులర్ స్టార్‌ల జాబితాను విడుదల చేసింది. ఇందులో ప్రభాస్ అగ్రస్థానంలో నిలిచారు. మే, జూన్ నెలల్లో టాప్ వన్‌లో ఉన్న ప్రభాస్.. జులైలోనూ అదే స్థానంలో ఉన్నారు. కల్కి విడుదల నేపథ్యంలో గత రెండు నెలలుగా ప్రభాస్ పేరు ట్రెండింగ్‌లో ఉంది. తాజాగా ఈ సినిమా ఓటీటీలోకి వచ్చిన సందర్భంగా పలు వీడియోలు ఎక్స్‌లో సందడిగా మారాయి. ఈ నేపథ్యంలో మూడోసారి కూడా ప్రభాస్ టాప్ వన్‌లోనే ఉన్నారు. ఆర్మాక్స్ జులై జాబితాలో విజయ్ రెండులో, షారుక్ ఖాన్ మూడో స్థానంలో ఉన్నారు. ప్రభాస్ -నాగ్ అశ్విన్ కాంబినేషన్‌లో వచ్చిన 'కల్కి' తాజాగా ఓటీటీ ప్రేక్షకుల ముందుకువచ్చింది. అమెజాన్ ప్రైమ్ వేదికగా ప్రసారమవుతోంది.



# ప్రభాస్‌పై అర్షద్ వార్సీ వ్యాఖ్యలు

## చర్యలు తీసుకోవాలంటూ మంచు విష్ణు లేఖ

కల్కి 2898 ఏడీ' సినిమాలో ప్రభాస్ పాత్ర గురించి తక్కువ చేస్తూ బాలీవుడ్ నటుడు అర్షద్ వార్సీ మాట్లాడిన తీరుపై ఇప్పటికే పలువురు సినీ ప్రముఖులు స్పందించి ఖండించారు. తాజాగా మూవీ ఆర్టిస్ట్స్ అసోసియేషన్ మా అధ్యక్షుడు మంచు విష్ణు ఈ విషయంలో మూవీ అండ్ టీవీ ఆర్టిస్ట్స్ అసోసియేషన్ కు లేఖ రాశారు. 'కల్కి 2898 పై తన అభిప్రాయాన్ని ఇటీవల ఓ ఇంటర్వ్యూలో అర్షద్ వార్సీ పంచుకున్నారు. అయితే ఈ క్రమంలో ఆయన ప్రభాస్ పాత్ర గురించి చేసిన వ్యాఖ్యలు సోషల్ మీడియాలో వైరల్ అయ్యాయి. అవి టాలీవుడ్ నటుడు, అభిమానుల మనోభావాల్ని దెబ్బతీసేలా ఉన్నాయని అధ్యక్షురాలు పూనమ్ ధిల్లాన్‌కు రాసిన లేఖలో మంచు విష్ణు పేర్కొన్నారు. 'ప్రతి వ్యక్తికి వారి అభిప్రాయాలను వ్యక్తపరిచే హక్కు ఉంది. దాన్ని మేమూ గౌరవిస్తున్నాం. కానీ, అర్షద్ వ్యాఖ్యలు ప్రభాస్‌ను తక్కువ చేసేలా ఉన్నందుకు బాధపడుతున్నాం. సోషల్ మీడియా ఇలాంటి విషయాలు త్వరగా వైరల్ అవుతాయి. ఆ విషయాన్ని అందరూ గమనించాలి. మాటకు చాలా శక్తి ఉంటుంది. అది ఇద్దరి మధ్య బంధాలను బలపరచగలదు, గొడవలూ సృష్టించగలదు. అర్షద్ కామెంట్స్ నెగెటివిటీని తీసుకొచ్చేలా ఉన్నాయి. నటీనటుల మధ్య ఐక్యత, గౌరవం కోసం ఎప్పుడూ ముందుండే లసోసియేషన్ అర్షద్ వ్యాఖ్యలపై స్పందిస్తుందని నమ్ముతు న్నాం. మీ మద్దతు కోసం ఎదురుచూ స్తున్నాం. భవిష్యత్తులో ఇలాంటి కామెంట్స్ చేయకుండా ఆయనకు సూచనలు చేస్తారని ఆశిస్తున్నాం. ప్రాంతాలతో, భాషతో సంబం ధం లేకుండా నటీనటులంతా గౌరవంగా ఉండాలని కోరుతున్నాం. మనమంతా ఒకే కుటుంబంలో భాగమని అందరూ గుర్తుంచు కోవాలి. ఈ ఐక్యతను కాపాడుకుందాం అని తన లేఖలో మంచు విష్ణు అన్నారు.



# క్లైమాక్స్ చిత్రీకరణలో పుష్ప-2

టాలీవుడ్ స్టార్ యాక్టర్ అల్లు అర్జున్ నటిస్తున్న ఫ్రాంచైజీ ప్రాజెక్ట్ పుష్ప 2 ది రూల్ సుకుమార్ దర్శకత్వం వహిస్తున్నాడు. కన్నడ భామ రష్మిక మందన్నా ఫీ మేల్ లీడ్ రోల్ పోషిస్తోంది. మలయాళ స్టార్ హీరో ఫహద్ ఫాసిల్ కీలక పాత్రలో నటిస్తున్నాడు. సినిమా అప్‌డేట్ గురించి ఎదురుచూస్తున్న అభిమానులు, మూవీ లవర్స్ కోసం ఆసక్తికర వార్త ఒకటి ఫిలింనగర్ సర్కిల్‌లో చక్కర్లు కొడుతోంది. తాజా సమాచారం ప్రకారం పుష్ప ది రూల్ క్లైమాక్స్ ను హైదరాబాద్‌లో చిత్రీకరిస్తున్నారు. అంతేకాదు మేకర్స్ స్పెషల్ సాంగ్ షూట్ చేయడానికి రెడీ అవుతుండగా.. క్లైమాక్స్ షూట్‌తో అగ్రభాగం షూట్ పూర్తి కానుందట. చివరి షెడ్యూల్‌లో స్పెషల్ సాంగ్‌ను చిత్రీకరించనున్నట్టు ఇన్‌సైడ్ టాక్. పూర్తయిన తర్వాత సాంగ్ షూట్‌పై నిర్ణయం తీసుకోబోతున్నారని ఇన్‌సైడ్ టాక్. మూవీని డిసెంబర్ 6న ప్రపంచవ్యాప్తంగా గ్రాండ్‌గా విడుదల చేస్తున్నట్టు ఇప్పటికే మేకర్స్ ప్రకటించారు. రిలీజ్ అప్‌డేట్ పోస్టర్‌లో బన్నీ పుష్పరాజ్‌గా కత్తి పట్టుకుని ఊరమాస్ లుక్‌లో కనిపిస్తూ సినిమాపై సూపర్ బజ్ క్రియేట్ చేస్తున్నాడు. ఫస్ట్ పార్టుకు అదిరిపోయే బ్యాక్ గ్రౌండ్ స్కోర్, ఆల్బమ్ అందించిన రాక్‌స్టార్ దేవీ శ్రీ ప్రసాద్ సీక్వెల్‌కు కూడా పనిచేస్తు?ండటంతో అంచనాలు భారీగానే ఉన్నాయి. సీక్వెల్‌లో ఫహద్ ఫాసిల్, జగదీష్ ప్రతాప్ బండారి, జగపతిబాబు, ప్రకాశ్ రాజ్, సునీల్, అనసూయ భరద్వాజ్, రావు రమేశ్, ధనంజయ, షణ్ముఖ్, అజయ్, శ్రీతేజ్ ఇతర కీలక పాత్రల్లో నటిస్తున్నారు.




# హను-మాన్ హీరో మిరాయ్

'హను-మాన్'తో పాన్ ఇండియా సక్సెస్ అందుకుని, సూపర్ హీరో క్రేజ్‌ని సొంతం చేసుకున్న యంగ్ హీరో తేజ సజ్జా మరో పాన్ ఇండియా మూవీ 'మిరాయ్' తో ప్రేక్షకుల ముందుకు వచ్చేందుకు సిద్ధమవుతున్నారు. కార్తీక్ ఘట్టమనేని దర్శకత్వం వహిస్తున్న ఈ యాక్షన్-అడ్వెంచర్‌లో తేజ సజ్జా సూపర్ యోధ పాత్రలో కనిపించనున్నారు. పీపుల్ మీడియా ఫ్యాక్టరీ బ్యానర్‌పై టీజీ విశ్వ ప్రసాద్ భారీ స్థాయిలో ఈ చిత్రాన్ని నిర్మిస్తునారు. శుక్రవారం తేజ సజ్జా పుట్టినరోజు సందర్భంగా 'మిరాయ్' మేకర్స్ బ్రాండ్ న్యూ పోస్టర్‌ని రిలీజ్ చేశారు. పోస్టర్ విషయానికి వస్తే.. సినిమాలో తేజ సజ్జా పాత్రలోని కరేజియస్ స్పిరిట్‌ని హైలైట్ చేస్తూ పోస్టర్ అద్భుతంగా ప్రజెంట్ చేశారు. పోస్టర్‌లో తేజ సజ్జా మండుతున్న ఐరెన్ రాడ్‌ను పట్టుకుని పైకి చూస్తున్నట్లు టెర్రిఫిక్‌గా కనిపిస్తున్నారు. ప్రమాదకర పరిస్థితిలో చిక్కుకుపోయినప్పటికీ ఇంటెన్స్‌గా వున్నారు. బ్యాక్ డ్రాప్‌లో వెనుక ఒక పురాతన దేవాలయం ఉంది. ఈ పోస్టర్ ప్రేక్షకులని ఆకర్షించడమే కాకుండా.. సినిమాపై భారీగా అంచనాలను పెంచేస్తోంది. తేజ సజ్జా చాలా హార్డ్ వర్క్ చేసి సినిమా కోసం బెస్ట్ ఎఫర్ట్స్ పెడుతున్నారనేది ఈ బర్త్‌డే స్పెషల్ పోస్టర్‌లో స్పష్టంగా తెలుస్తోంది. న్యూ వరల్డ్‌ని క్రియేట్ చేయడంలో డైరెక్టర్ కార్తీక్ ఘట్టమనేని నైపుణ్యం ఎలాంటిదో ఇప్పటికే ప్రేక్షకులకు తెలుసు. మరో అద్భుతాన్ని ఆయన సినిమాతో ప్రేక్షకులకు చూపించబోతున్నారని, అత్యున్నత స్థాయి ప్రొడక్షన్ వాల్యూస్‌తో ఈ సినిమా టెక్నికల్‌గా టాప్ క్లాస్‌లో వుండబోతోందని మేకర్స్ చెబుతున్నారు. తేజ సజ్జ, మంచు మనోజ్ పాత్రలను పరిచయం చేసిన ఫస్ట్-లుక్ పోస్టర్లు, గ్లింప్స్‌లకు ట్రెమండస్ రెస్పాన్స్ రావడమే కాకుండా.. సినిమాపై భారీ అంచనాలను నెలకొల్పాయి. ఈ కొత్త పోస్టర్ సినిమాపై ఆసక్తిని మరింత పెంచింది. కార్తీక్ ఘట్టమనేని సినిమాటోగ్రఫీతో పాటు డైలాగ్ రైటర్ మణిబాబు కరణంతో కలిసి స్క్రీన్‌ప్లే కూడా అందిస్తున్నారు. గౌరహరి సంగీతం సమకూరుస్తున్నారు. శ్రీ నాగేంద్ర తంగాల ఈ చిత్రానికి ఆర్ట్ డైరెక్టర్. ఈ సినిమాను 8 భాషల్లో 18 ఏప్రిల్, 2డి, 3డి వెర్షన్‌లలో విడుదల చేస్తామని మేకర్స్ అధికారికంగా ప్రకటించారు.



Edited, Printed, Published & Owned by Dr. KACHAM SATYANARAYANA. Printed at DVM Multi Colour Offset Printers, Dilsukhnagar, Hyderabad - 500060. Telangana. Published at #204, 2nd Floor, Badam Complex, Opp. Metro Pillar No. 1560, Chaitanyapuri X Road, Hyderabad - 500060. Telangana.EDITOR: Dr. KACHAM SATYANARAYANA. Cell: 9441222429 | Email: vishwambhara.daily@gmail.com